


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



పట్టణాల్లోనూ 'ఇందిరమ్మ ఇండ్లు' 03

జి ప్లస్ 1 తరహాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అవకాశం : మంత్రి పొంగులేటి





సంపుటి 08, సంచిక: 321 | గురువారం | 23-10-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## రహదారులపై చెక్ పోస్టుల ఎత్తివేత

ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని రహదారులపై రవాణా చెక్ పోస్టులను వెంటనే ఎత్తివేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నట్లు రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బుధవారం సాయంత్రం 5 గంటలలోగా మూసివేతపై పూర్తి నివేదికను ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిఎం ఆదేశాలతో తక్షణమే చెక్‌పోస్ట్‌ల కార్యకలాపాలు నిలిపివేయాలని ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆకస్మిక ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టుల వద్ద ఉన్న సిబ్బందిని వెంటనే ఇతర బాధ్యతలలో వినియోగించుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని, చెక్ పోస్టుల వద్ద బోర్డులు, బ్యారికేడ్లు, తొలగించాలని డిటిఓలకు సూచించారు. చెక్‌పోస్టుల వద్ద ఉన్న రికార్డులు, పరికరాలు, ఫర్నిచర్‌ను డిటిఓ కార్యాలయాలకు తరలించాలని ఆదేశించారు. అన్ని ఆర్థిక, పరిపాలనా రికార్డులను సరిచూసి భద్రపరచాలని ఆదేశించారు.




## నేడు మంత్రివర్గ సమావేశం

- బిసి రిజర్వేషన్లపై చర్చ
- ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత ఆర్డినెన్స్‌కు ఆమోదం
- రైతు భరోసా స్కీమ్‌పై కీలక నిర్ణయం?

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో జరగనుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనుంది. బిసి రిజర్వేషన్ల విషయంలో హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలపై అధికారుల కమిటీ నివేదికపై మంత్రివర్గం చర్చించనుందని సమాచారం. అలాగే ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై కూడా ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనుంది. స్థానిక సంస్థల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఇద్దరు పిల్లల నిబంధనను రద్దు చేసే ఆర్డినెన్స్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. కాగా ఆర్డినెన్స్‌కు వీలుగా అసెంబ్లీ ఉభయ సభలను బుధవారం నాడు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రోరోగ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, ఎస్‌ఎల్‌బిసి పునరుద్ధరణ, ఎస్‌ఆర్‌ఎస్‌పి రెండో దశ పనులపై కూడా చర్చ జరగనుందని తెలుస్తోంది. రైతు భరోసా స్కీమ్‌కు సంబంధించి కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు సమాచారం.





## సృష్టి కేసులో ఇడి విచారణ

జైల్‌లోనే నిందితులను విచారించిన అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశ వ్యాప్తంగా కలకలం రేపిన 'సృష్టి ఫెర్టిలిటీ కేసు' లో డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారులు బుధవారం విచారణను ప్రారంభించారు. ఇప్పటికే ఈ కేసులో ప్రధాన నిందితులు డాక్టర్ నమ్రత కళ్యాణి, నందిని, సంతోషితో పాటు జయంత్ కృష్ణను కోర్టు అనుమతితో అధికారులు విచారిస్తున్నారు. ప్రస్తుతం వారంతా చంచల్‌గూడ జైలు లో రిమాండ్ ఖైదీలుగా ఉండటంతో అక్కడే విచారించేందుకు ఇడికి కోర్టు అనుమతించింది. అయితే, ఈనెల 28 వరకు నిందితులను కేసులో దర్యాప్తు బృందం ప్రశ్నించి వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేయనుంది. కాగా, సృష్టి ఫెర్టిలిటీ వ్యవహారంలో గోపాలపురం పోలీసుస్టేషన్లో కేసు నమోదు కాగా.. ఆ కేసు దర్యాప్తును హైదరాబాద్ పోలీసు తరువాయి 2లో

# రెండేళ్లలో నయా ఉస్మానియా



- నూతన ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలి
- పనుల వేగవంతానికి వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ
- రానున్న వందేళ్ల అవసరాలకు తగినట్లు వసతుల కల్పన
- పనుల తీరుపై తరచూ క్షేత్ర స్థాయిలో తనిఖీ
- సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణంపై హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సిఎం రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, ఇందుకు సంబంధించి తరువాయి 2లో



## పారిశ్రామికాభివృద్ధిలో తెలంగాణ రోల్ మోడల్

- మరిన్ని పెట్టుబడులు పెట్టండి...
- దిగ్గజ సంస్థ 'ఒరికా'కు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం
- ఆస్ట్రేలియాలో సిఇఒ, ఎండి సంజీవ్ గాంధీతో ప్రత్యేకంగా భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలోనే పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలుస్తున్న తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న దిగ్గజ సంస్థ 'ఒరికా' ప్రతినిధులను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఆ దేశ పర్యటనలో భాగంగా బుధవారం మెల్‌బోర్న్‌లో పారిశ్రామిక పేలుడు పదార్థాల తయారీ, మైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర రంగాల్లో అంతర్జాతీయ అగ్రగామిగా ఉన్న ఆ సంస్థ సిఇఒ, ఎండి సంజీవ్ గాంధీ, ఇతర ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా బుధవారం భేటీ అయ్యారు. తెలంగాణలో 'ఒరికా' ప్రస్తుత కార్యకలాపాలు, భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలపై ఈ సమావేశంలో తరువాయి 2లో

## రష్యా చమురు తగ్గింపుపై మోదీ మరోసారి మాటిచ్చారు

వైట్‌హౌస్ దీపావళి ఉత్సవంలో ట్రంప్ పునరుద్ఘాటన

**వాషింగ్టన్:** రష్యా నుండి చమురు కొనుగోళ్ళు, చమురు దిగుమతులు తగ్గించుకుంటామని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తనకు మాట ఇచ్చారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి పాత విషయాన్ని తెరమీదకు తెచ్చారు. ఒకేసారి చమురు కొనుగోలు ఆపేయమంటే భారత్‌కు సాధ్యం కాదని, క్రమంగా చమురు కొనుగోళ్ళు తగ్గించుకుంటుందని అన్నారు. వైట్‌హౌస్‌లో మంగళవారం రాత్రి దీపావళి ఉత్సవ వేడుకలో పాల్గొన్నారు. దీపాన్ని వెలిగించారు. ఈ వేడుకలలో భారత దౌత్యవేత్త వినయ్ క్వత్రా, భారత సంతతికి చెందిన వ్యాపార నాయకులు ప్రముఖులు కూడా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు తరువాయి 2లో



## పోలీసుల చేతుల్లోకి మళ్లీ లాఠీ?

- కానిస్టేబుల్ ప్రమోద్ హత్య నేపథ్యంలో అధికారుల్లో చర్చ
- నేరస్తులు కత్తులతో దాడులు చేస్తే లాఠీతోనైనా ఎదుర్కోవచ్చనే అభిప్రాయం
- 'ఫ్రెండ్లీ పోలీసింగ్' వ్యవస్థతో మూలకుపడ్డ వైనం

బి. వాసుదేవరాజు

బైక్‌పై నిందితుడిని స్టేషన్‌కు తరలిస్తున్న క్రమంలో నిజామాబాద్ సిసిఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ నిందితుడి చేతిలో హత్యకు గురైన ఉదంతం పోలీసు వర్గాల్లో కలకలం రేపింది. ఇలాంటి ఘటనలో ఆత్మరక్షణ కోసం పోలీసులు లాఠీలు పట్టాలనే అంశం ఇప్పుడు పోలీసు వర్గాల్లో చర్చకు దారి తీసింది. నేరస్తులు పోలీసులపై కత్తులతో దాడులు చేస్తుంటే తాము కనీసం లాఠీతోనైనా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని పలువురు అధికారులు అభిప్రాయపడుతున్నారు. గతంలో మహేందర్‌రెడ్డి హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా, రాష్ట్ర డిజిపిగా పనిచేసిన సమయంలో 'ఫ్రెండ్లీ పోలీసింగ్' వ్యవస్థను తీసుకురావడంతో లాఠీలు మూలకుపడ్డాయి. ప్రజలతో పోలీసులు మమేకమై నమ్మకాన్ని పెంచుకోవడం ద్వారా పోలీసు ప్రతిష్ట పెరుగుతుందని చెప్పడంతో పోలీసులు లాఠీలను విడిచిపెట్టాల్సి వచ్చింది. ఇంత వరకు బాగానే ఉంది, అయితే ప్రమోద్ లాంటి ఉదంతాలు జరిగిన సమయంలో ఉట్టి చేతులతో పోరాడలేమని, ఇలాంటి సంఘటనలు తమకు కూడా ఎదురైన పక్షంలో ప్రమోద్ మాదిరిగానే ప్రాణాలు కాపాడుకోలేక పోవడం తథ్యమని మరికొందరు పోలీసులు వాదిస్తున్నారు. నేరస్తుల నుంచి తమ ప్రాణాలు కాపాడుకోడానికి కనీసం లాఠీలు కూడా తాము ఉపయోగించుకోవద్దా అనేది ఇప్పుడు రాష్ట్రం పోలీసు సిబ్బందిలో ప్రశ్న మొదలైంది. తమకు తిరిగి లాఠీలు సమకూర్చుకునేలా ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వాలని తద్వారా నేరస్తుల్లో భయం ఉంటుందని, అంతేకాకుండా తమను తాము రక్షించుకునే సదుపాయం కలుగుతుందని వారంటున్నారు. పోలీసులంటే భయం లేకపోవడం వల్లనే నడిరోడ్డుపై పట్టపగలు అందరి ముందే దుండగులు రెచ్చిపోయి అమాయకులను హత్య చేస్తున్నారని, అమాయకులను కాపాడాలన్నా తమ వద్ద కనీసం లాఠీ లేకపోతే ఎలా అని మరి కొందరు అంటున్నారు.పోలీసులు గతంలో అమాయకులపై లాఠీలు ఝులిపించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి వాటికి ఆస్కారం లేకుండా కేవలం నిందితులకు తరువాయి 12లో






## దేశవ్యాప్తంగా 'సర్'కు ఇసి ముమ్మర సన్నాహాలు

రెండు నెలల్లో రెండోసారి సమీక్ష

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా దశలవారీగా ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సమీక్ష (సర్) నిర్వహణకు భారత ఎన్నికల సంఘం సన్నాహాలను ముమ్మరం చేసింది. వచ్చే ఏడాది ఎన్నికలు జరిగే రాష్ట్రాలను మొదటి దశ 'సర్' తనిఖీలలో చేరుస్తారు. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాల ప్రక్షాళన జోలికి వెళ్ళదు. 2026లో అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల అసెంబ్లీకు ఎన్నికలు జరుగుతాయి. మొదటి దశ 'సర్'లో ఈ ఐదు రాష్ట్రాలతో పాటు మరికొన్ని రాష్ట్రాలను కూడా చేరుస్తారు. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలలో ఉన్న ఓటర్లను ఇంటింటి తనిఖీలతో పరిశీలించి ఎంతమంది ఓటర్లు స్థిరంగా ఉన్నారో వారందరినీ కొత్త ఓటర్ల జాబితాలలోకి బదిలీ చేస్తారు. వివిధ రాష్ట్రాలలో గతంలో ఈ ప్రత్యేక సమీక్ష తరువాయి 12లో

## భారీగా నామినేషన్ల తిరస్కరణ

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు 211 మంది అభ్యర్థులు, 321 నామినేషన్ పత్రాలు దాఖలు
- గురువారం అర్ధరాత్రి వరకూ కొనసాగిన పరిశీలన



ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నామినషన్ల పరిశీలన బుధవారం రాత్రి వరకు కొనసాగింది. నామినేషన్లు భారీగా తిరస్కరించినట్లు సమాచారం. మొత్తంగా 211 మంది అభ్యర్థులు నామినేషన్లను వేయగా, వారి నుంచి 321 నామినేషన్ల పత్రాలను అందినట్టు రిటర్నింగ్ అధికారి తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి వరకు నామినేషన్ల పర్వం కొనసాగింది. ముందుగా టోకెన్ తీసుకున్న వారి నుంచే మాత్రమే ఎన్నికల రిటర్నింగ్ అధికారి నామినేషన్ల పత్రాలను స్వీకరించారు. చివరి రోజు 117 మంది అభ్యర్థులు 194 మంది నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియను ఎన్నికల పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్ పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పకడ్బందీగా నామినేషన్లను పరిశీలించాలని రిటర్నింగ్ అధికారి పి సాయిరాం, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఆయన సూచించారు. భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలు కావడంతో నామినేషన్ల పరిశీలన ప్రక్రియకు సమయం ఎక్కువగా పడుతోంది. నామినేషన్ల ఉప సంహరణకు ఈ నెల 24తో తుది గుడువు . కాగా పోలీసు పరిశీలకులు ఓం ప్రకాష్ త్రిపాఠి స్లంక్లిష్టమైన తరువాయి 12లో

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థికి సిపిఐ (ఎం) మద్దతు

ప్రజాపక్షం/హైదరాబాద్



జూబ్లీహిల్స్ శాసన సభ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతునిస్తున్నట్టు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రకటించారు. బిజెపితో పొత్తు విషయమై బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ తమ స్పష్టమైన వైఖరిని ప్రకటించలేదన్నారు. బిజెపిని ఓడించడమే తమ లక్ష్యమని, ఇందులోభాగంగానే తాము కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్టు ఎంబి భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చినప్పటికీ ప్రజా, నిరుద్యోగ, భూ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని వెస్లీ అన్నారు.





'ప్రజాపక్షం' దినపత్రిక 7వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేక్ కట్ చేసిన మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో పత్రికా సంపాదకులు మక్కెన సుబ్బారావు, నవచేతన విజ్ఞాన సమితి అధ్యక్షులు పల్లా వెంకట్‌రెడ్డి, కార్యదర్శి బి.ఎస్.ఆర్. మోహన్‌రెడ్డి, కోశాధికారి ఉజ్జని రత్నాకర్‌రావు, జనరల్ మేనేజర్ మధుకర్, గవర్నింగ్ బాడీ సభ్యులు, సిబ్బంది తదితరులు.

## మైనర్ బాలికపై అత్యాచారం నిందితుడికి 32 ఏళ్ల జైలు

ప్రజాపక్షం/నల్లగొండ

మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి బలవంతంగా పెళ్లి చేసుకొని అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 32 ఏళ్ల జైలు, రూ.75 వేల జరిమానాను కోర్టు విధించింది. వివరాలను జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ మీడియాకు వెల్లడించారు. నల్లగొండ పట్టణం లోని పానగల్‌కి చెందిన గురజాల చందు 15 సంవత్సరాల తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## న్యాయబద్ధంగా నేపాల్ ఎన్నికలు

**కాఠ్మండు:** ముందుగా చెప్పినవిధంగా వచ్చే ఏడాది ఐదో తేదీన నేపాల్‌లో ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా నిర్వహిస్తామని ఆ దేశ తాత్కాలిక ప్రధానమంత్రి సుశీల కర్కి భరోసా ఇచ్చారు. నిజాయతీగా, న్యాయబద్ధంగా ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. "జనరేషన్ జెడ్ చెప్పినవిధంగా రాజ్యాంగానికి అనుగుణంగా ప్రజల వాణిని సమర్థిస్తూ ఈ ఎన్నికలు నిర్వహించే బాధ్యత మాది, ప్రభుత్వం అనుకు అనుగుణంగా ఒక మంచి వాతావరణం సృష్టిస్తుంది, నేపాలీ ప్రజలు ఎలాంటి భయం లేకుండా ఓటు వేసే వాతావరణం సృష్టించే బాధ్యత మా ప్రభుత్వానిది, ప్రజాస్వామ్య ఉద్యారా పటిష్టపరుస్తాం, ప్రగతికి బాటలు వేస్తాం, ప్రజల హక్కులను రక్షిస్తాం" అని సుశీల కర్కి చెప్పారు. భక్తపూర్‌లోని మధ్యపూర్ థిమిలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆమెపై విషయాలు చెప్పారు. దేశంలో ఉన్న ప్రధాన రాజకీయపార్టీల ప్రతినిధులు మంగళవారంనాడు రాజధానిలో ఆమెను మొదటిసారి కలిసి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కర్కి ఎన్నికల గురించి ప్రస్తావించారు. బలువటార్‌లోని ప్రధానమంత్రి అధికార నివాసంలో ఈ సమావేశం జరిగింది.

# పుతిన్‌తో చర్చలు టైమ్ వేస్ట్!

ప్రశ్నార్థకంగా మారిన బుడాపెస్ట్ సదస్సు



**వాషింగ్టన్:** రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశం 'టైమ్ వేస్ట్' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఉక్రేన్ సమస్యపై వృథా చర్చలు తాను కోరుకోవడం లేదని, సమీప భవిష్యత్తులో కూడా పుతిన్‌తో చర్చలు జరిగే అవకాశం ఉండకపోవచ్చునని తోసిపుచ్చారు. చర్చలు జరపాలన్న ఆలోచనలను స్తంభింపజేశామని, దీనిపై రెండు రోజుల్లో స్పష్టమైన నిర్ణయం తీసుకుంటానన్నారు. ఈనెల 16న తేదీన పుతిన్‌తో ట్రంప్ సుదీర్ఘంగా ఫోన్‌లో సంభాషించారు. బుడాపెస్ట్‌లో త్వరలో రెండోసారి సమావేశానికి ఇద్దరం అంగీకరించామని, ఆలస్యం లేకుండా ఈ సమావేశం జరుగుతుందని వారం క్రితం ట్రంప్ చెప్పారు. కానీ యూరప్ నాయకులు మంగళవారం చేసిన ప్రకటనల్లోకూడా, ఉక్రేన్ సమస్య పరిష్కారం కాకుండా పుతిన్ సాగదీస్తున్నారని, కాల హరణం చేస్తున్నారని విమర్శించారు. నాటో కూటమి సెక్రటరీ జనరల్ మార్క్ రట్టేతో బుధవారం భేటీకి ముందు ట్రంప్ ఈ టైమ్ వేస్ట్ గురించి మాట్లాడారు. రష్యన్ వార్తాసంస్థ టాస్ కథనం ప్రకారం, వృథా సమావేశాలను నేను కోరుకోవడంలేదు, పుతిన్‌తో సమావేశం జరపాలా?వద్దా? అనే విషయంపై ఇంకా ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. "పుతిన్‌తో సమావేశం ద్వారా సమయం వృథా చేసుకోదల్చుకోలేదు, ఏం జరుగుతుందో చూడాలి, సమావేశం జరపాలని నేనేమీ కృతనిశ్చయంతో లేను, ఇంకా ఆలోచించాలి" అని వైట్ హౌస్‌లో పాత్రికేయులతో ట్రంప్ చెప్పినట్లు టాస్ పేర్కొంది. హంగేరీలో తమ మధ్య సమావేశం జరుగుతుందా? లేదా? అనే విషయంపై రాబోయే రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటానని ట్రంప్ చెప్పినట్లు పేర్కొంది. "రాబోయే రెండు రోజుల్లో మేం ఏం చేస్తామో, చాలా పరిణామాలు సంభవించవచ్చు ఎవరికి తెలుసు? మీరు ఎప్పటికీ ఊహించలేరు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

అలాగని ట్రంప్ పూర్తిగా ఉక్రేన్‌ను సమర్థిస్తున్నట్టు రుజువు చేసుకోలేదు. గతవారంలో ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ వాషింగ్టన్ వెళ్ళి ట్రంప్‌తో సమావేశమై శక్తిమంతమైన తోమాహక్ క్షిపణులు ఇవ్వాలని కోరారు. కానీ అందుకు ట్రంప్ సమాధానం చెప్పకుండా తిరస్కరించారు. పుతిన్‌తో సమస్య పరిష్కరించుకోవాలని నాలుగు మంచి మాటలు చెప్పి పంపేశారు. హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లో రాబోయే వారాల్లో పుతిన్–ట్రంప్ మధ్య రెండోసారి శిఖరాగ్ర సమావేశం ఏర్పాట్లు చేసేందుకు హంగేరీ ప్రభుత్వం కూడా చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు యూరోపియన్ యూనియన్‌తోపాటు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కూడా బుడాపెస్ట్ సమావేశం చుట్టూ ఆలోచనలు చేస్తున్నారు. ఉక్రేన్ సమస్య పరిష్కారం కోసమే బుడాపెస్ట్‌లో ప్రపంచ అగ్రనాయకులిద్దరి మధ్యా సమావేశానికి రంగం సిద్ధం అవుతున్న తరుణంలో ట్రంప్ పైవిధంగా వ్యాఖ్యానించారు.

**ట్రంప్–పుతిన్ భేటీకి ఎలాంటి ఆటంకాలూ లేవు**

ట్రంప్–పుతిన్ మధ్య బుడాపెస్ట్‌లో రెండోసారి శిఖరాగ్ర సమావేశానికి ఎలాంటి ఆటంకాలూ లేవని రష్యా ఉప విదేశాంగమంత్రి సెర్గీ ర్యాబ్కోవ్ చెప్పారు. "నాకు ఎలాంటి ఆటంకాలు కనిపించడంలేదు, కాకపోతే అధ్యక్షులు చెప్పిన పరిమితులు స్పష్టంగా ఉంటాయా?లేదా? అనేదే ప్రశ్న, ఇది కష్టమైన ప్రక్రియ, మనం అంగీకరించాల్సిందే, కానీ వాటిని అధిగమించడానికి దౌత్య తలం ఉన్నాం" అని ర్యాబ్కోవ్ చెప్పారు. వైట్ హౌస్ ప్రకటనలకు భిన్నంగా, తాము ఏర్పాట్లు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. బుడాపెస్ట్‌లో భేటీకి ఇంకా ఒక తారీఖు ఖరారు కాలేదని క్రెమ్లిన్ ప్రతినిధి ద్మీత్రీ పెస్కోవ్ చెప్పారు. చర్చలు జరపాలని ఇరు దేశాల అధ్యక్షులూ నిర్ణయించారని, దీని చుట్టూ వ్యాపిస్తున్న అనేక వదంతులు నిజం కాదని అన్నారు. ఈనెల 16న ట్రంప్–పుతిన్ మధ్య ఫోన్ సంభాషణ తర్వాత బుడాపెస్ట్‌లో భేటీకి నిర్ణయం జరిగింది. క్రెమ్లిన్ అధికార ప్రతినిధి యూరీ ఉషకోవ్ కూడా ఈ సమావేశం జరుగుతుందని వారం క్రితమే ప్రకటించారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రేన్‌లో యుద్ధం ప్రారంభమైంది. అంతకుముందు 2014లో క్రిమియాను రష్యా ఆక్రమించుకుంది.

**పుతిన్ అరెస్టు ఉత్తర్వుకు కట్టుబడిలేం: సిజ్జార్టో**


పుతిన్‌ను అరెస్టు చేయాలని అంతర్జాతీయ న్యాయస్థానం 'ద హేగ్' ఇచ్చిన ఉత్తర్వులకు తాము కట్టుబడిలేమని హంగేరీ ప్రభుత్వం ప్రకటించింది. బుడాపెస్ట్‌లో పుతిన్–ట్రంప్ మధ్య శిఖరాగ్ర సదస్సు జరుగుతుందా? లేదా? అనే విషయం రాబోయే రెండు రోజుల్లో తేలిపోతుంది. ఈ నేపథ్యంలో హంగేరీ విదేశాంగమంత్రి పీటర్ సిజ్జార్టో బుడాపెస్ట్‌లో పాత్రికేయులతో మాట్లాడారు. ఉక్రేన్‌లో దారుణ మారణకాండకు పాల్పడినందుకు గాను పుతిన్‌పై అంతర్జాతీయ న్యాయస్థానం గతంలో జారీ చేసిన అరెస్టు వారెంటుకు తాము కట్టుబడి ఉండబోమన్నారు. పుతిన్ హంగేరీకి వస్తే అరెస్టు చేస్తారా? అనే అంశం తెరమీదకు వచ్చిన సందర్భంగా ఆయన స్పష్టత ఇస్తూ, అంతర్జాతీయ న్యాయస్థానం నుండి తాము వైదొలగినట్లు గతంలోనే ప్రకటించామని, అందువల్ల హేగ్ న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను తాము గౌరవించే ప్రసక్తే లేదని అన్నారు.

# ఉక్రేన్‌పై రష్యా దాడులు:ఏడుగురు మృతి



**కీవ్:** ఉక్రేన్ సమస్యపై పుతిన్‌తో చర్చలు చేయడం "టైమ్ వేస్ట్" అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నోరుపారేసుకున్న తర్వాత రష్యా బుధవారం తన యుద్ధ దాడులను మరింత ఉధృతం చేసింది. ఈ దాడులతో ఉక్రేన్‌లో అత్యవసర బ్లాకౌట్లు అమలు చేశారు. కీవ్, రుపొరిజియా, ఒడెసా, ఛెర్నిహివ్, డ్నిప్రొపెట్రోవ్స్క, కిరోవోహార్డ్, పోల్టావా, విన్నిట్సియా, ఇతర ప్రాంతాలపై డ్రోన్లు, క్షిపణులతో రష్యా జరిపిన దాడుల్లో ఏడుగురు మరణించారని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ బుధవారం ప్రకటించారు. ఉక్రేన్‌లో రెండో అతిపెద్ద నగరం ఖార్కివ్‌పై జరిగిన దాడిలో పిల్లల సంరక్షణ కేంద్రం దెబ్బతిన్నదని, మృతుల్లో పిల్లలు కూడా ఉన్నారని చెప్పారు. ఈ దాడుల్లో పెద్దలతోపాటు 26 మంది పిల్లలు కూడా గాయపడ్డారని చెప్పారు. యుద్ధం ఆపాలని రష్యాపై ఎవరూ గట్టిగా ఒత్తిడి చేయడం లేదని ఆయన విమర్శించారు. రష్యాపై ఆంక్షలకు చర్యలు తీసుకోవాలని జి–7 దేశాలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ దాడులవల్ల కీవ్ నగరంలో విస్తారమైన నష్టం జరిగిందని చెప్పారు. ఉక్రేన్ ఇంధన శాఖామంత్రి మాట్లాడుతూ, మంగళవారం రాత్రి పొద్దుపోయాక తమ దేశ మౌలిక ఇంధన సదుపాయాలపై రష్యా దాడులు ప్రారంభించిందని, బుధవారం తెల్లవారు కూడా దాడులు కొనసాగాయని చెప్పారు. కాగా ప్రస్తుతం యుద్ధం జరుగుతున్న ప్రాంతాల నుండి వైదొలగాలని యూరప్,అమెరికా చేస్తున్న డిమాండ్లను రష్యా తోసిపుచ్చింది. కాగా రష్యా భద్రతా బలగాలు ఒక ప్రకటన చేస్తూ ఖార్కివ్‌లో తన పరిధిని రష్యా విస్తరిస్తోందని ప్రకటించింది. ఉక్రేన్ సైనికులకు ఎటు వెళ్ళాలో దిక్కు తోచని పరిస్థితి ఏర్పడిందని తెలిపింది. ఖార్కీవ్ సమీపంలోని సరిహద్దు ప్రాంతాలలో, ఓల్చెన్స్కీ జోన్‌లో తన పరిధిని జోన్లను విస్తరించుకున్నామని, దీంతో శత్రుసైన్యాలు సందిగ్ధంలో పడ్డాయని పేర్కొంది. ఈ పరిణామాలతో ఉక్రేన్ ప్రభుత్వంలోని పశ్చిమ విభాగం ఆందోళన చెందుతోందని పేర్కొంది. మరోవైపు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లోవరోవ్ మాట్లాడుతూ, యూరప్ దేశాలు ఇప్పుడు రష్యా కాల్పుల విరమణ పాటించాలని కోరుతున్నాయని, ఉక్రేన్‌లోకి మరిన్ని ఆయుధాలను తరలించి, ఉగ్రవాద కార్యకలాపాలను కొనసాగించాలని, రష్యన్ భూభాగాలలోకి రెచ్చగొట్టడంకోసమే కాల్పుల విరమణ విరామాన్ని యూరప్ దేశాలు కోరుకుంటున్నాయని అన్నారు. శాంతి వారు కోరుకోవడంలేదని విమర్శించారు. బేషరతుగా కాల్పుల విరమణవల్ల ఎలాంటి ఇతర షరతులు ఉండబోవన్నారు. బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్మర్, ఫ్రెంచ్ అధ్యక్షుడు మేక్రాన్, యూరోపియన్ యూనియన్ అధ్యక్షురాలు ఉర్సులా వోందర్ లేయన్ తదితరులు కాల్పుల విరమణ గురించి మాట్లాడుతున్నారని, వారిలో నిజమైన చిత్తశుద్ధి లేదని సెర్గీ లోవరోవ్ విమర్శించారు.

## ఉగాండాలో రోడ్డు ప్రమాదం 46 మంది మృతి





**కంపాలా:** తూర్పు ఆఫ్రికాదేశం ఉగాండాలో రెండు బస్సులు ఢీకొట్టుకోవడంతో 46 మంది ప్రయాణికులు మరణించారు. పశ్చిమ ఉగాండా జాతీయ రహదారిపై బుధవారం ఉదయం ఈ ఘటన జరిగింది. మొదట 63 మంది ప్రయాణికులు మరణించినట్లు వార్తలు వెలువడ్డాయి. ఆ తర్వాత ఈ సంఖ్యను సవరించి మరో వార్త విడుదల చేశారు. కొందరు ప్రయాణికులు మూర్ఛపోవడంతో వారు కూడా మరణించినట్లుగా లెక్కలు వేశారు. ఏడుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఇటీవలికాలంలో తూర్పు ఆఫ్రికాలో ఇంతటి తీవ్రమైన రోడ్డు ప్రమాదం జరగడం ఇది రెండోసారి. ఎదురెదురుగా వస్తున్న ప్రయాణికుల బస్సుల డ్రైవర్లు ఒకరినొకరు ఓటర్‌టేక్ చేసేందుకు ప్రయత్నం చేసి విఫలమై ఢీకొట్టుకున్న ఈ ఘటన కిర్యాన్‌డాంగో పట్టణంలో జరిగింది. ఉగాండాలో రోడ్లు చాలా ఇరుకుగా ఉండటంవల్ల ప్రమాదాలు తరచు జరుగుతూ ఉంటాయిగానీ, ఇంత భారీసంఖ్యలో మరణాలు ఇటీవలికాలంలో సంభవించ లేదు. ఇంతకుముందు ఆగస్టులో ఒక బస్సు లోయలో పడిపోవడంతో 25 మంది ప్రయాణికులు మరణించారు.గత ఏడాది ఉగాండాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 5,144 మంది మరణించారు. 2023లో ఈ సంఖ్య అంతకంటే 700 ఎక్కువగా ఉంది.

## ఆయిల్ ట్రక్కు పేలి నైజీరియాలో 29 మంది మృతి



**అబూజ:** సెంట్రల్ నైజీరియాలో బుధవారం ఒక చమురు లారీ పేలిపోవడంతో 29 మంది మరణించారు. వేగంగా వెళుతున్న చమురు లారీ తిరగబడి పేలిపోయింది. దీంతో రహదారిపై ఉన్న ప్రయాణికులు 29 మంది మరణించగా 42 మంది గాయపడ్డారని ఎమర్జెన్సీ సిబ్బంది బుధవారం చెప్పారు. నిగర్ రాష్ట్రం బిదర్–అగ్గె జాతీయ రహదారిపై ఈ ఘటన జరిగింది. ఇలాంటి ప్రమాదాలు ఈ మార్గంలో వరుసగా అనేకం జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల పరంపరలో మంగళవారం జరిగిన ప్రమాదం మరో తాజా ఘటన. రహదారుల నిర్వహణాలోపం, నిర్మాణలోపాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వంటి కారణాలతో తరచుగా నైజీరియాలో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. నైజీరియాలో చమురు కొరత ఉంది. చమురు లారీ నుండి చమురు తీసుకునేందుకు గత జనవరిలో జనం గుమిగూడినప్పుడు ట్యాంకర్ పేలింది. దీంతో 98 మంది మరణించారు. గడచిన మార్చిలో కూడా ఇదేవిధంగా జరిగిన ప్రమాదంలో పదిమంది మరణించారు.

## దోపిడీ నిందితుడిపై పిడి యాక్ట్ సబబే

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** పట్టపగలు జన సంచారం ఉన్న ప్రాంతాల్లో దోపిడీలకు పాల్పడిన నిందితుడిపై పోలీసులు పిడి యాక్ట్ కింద కేసు పెట్టి అరెస్టు చేయడం కరెక్టేనని హైకోర్టు స్పష్టం చేసింది, రెండు వేర్వేరు ఘటనల్లో ఆభరణా ల దోపిడీకి పాల్పడిన నిందితుడి విషయంలో పోలీసులు తీసుకున్న చర్యల నివేదికలను పరిశీలిస్తే పిడి యాక్ట్ ఆమోదయోగ్యమేనని తేల్చింది, చర్లపల్లి సెంట్రల్ జైలులో నిర్బంధించిన తన కుమారుడు నజీమ్ అజీజ్ కోర్టులో హాజరుపరిచేలా పోలీసులకు ఆదేశాలివ్వాలంటూ తండ్రి అజీజ్ హసన్ వేసిన పిటిషన్ను జస్టిస్ మౌషుమి బట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్కుమార్ డివిజన్ బెంచ్ కొట్టివేసింది. గత ఏడాది నవంబర్ 8న సైబరాబాద్ కమిషనరేట్ నజీమ్ను నిర్బంధంలోకి తీసుకున్నట్లుగా నిర్ధారణ చేశారని, పోలీసుల చర్య చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని పిటిషనర్ న్యాయవాది వాదనను తోసిపుచ్చింది. గతేడాది ఫిబ్రవరి 14న, జూన్ 20న దుకాణాల్లో పగటిపూట ఆభరణాల చోరీ ఘటనల్లో నజీమ్ను పోలీసులు నిందితుడిగా నిర్ధారించాకే గూండా చట్ట కింద నిర్బంధించారని చెప్పింది. తొలి కేసులో కత్తులు, ఆభరణాలను స్వాధీనం, సీసీ ఫుటేజీ, కత్తిపోట్ల గాయాల మెడికో లీగల్ రికార్డులను ట్రయల్కోర్టు నమోదు చేసిందని గుర్తు చేసింది. రెండో కేసులో బెయిల్ రద్దు పిటిషన్ కింది కోర్టులో పెండింగ్ ఉందని చెప్పింది. ప్రణాళికాబద్ధంగా, హింసాత్మకంగా, రద్దీగా ఉండే రోడ్లలో దోపిడీలకు పాల్పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగింపులకు పాల్పడ్డారని తెలిపింది. పిడి యాక్ట్‌లోని సెక్ష న్ 13 ప్రకారం గరిష్టంగా 12 నెలల వరకు ముందస్తుగా నిర్బంధించవచ్చని చె ప్పింది. పిడి యాక్ట్ అమలు చట్టబద్ధంగానే జరిగిందని తేల్చుతూ పిటిషన్ను కొట్టివేసింది.

## ఉద్యోగాల్లో 2 శాతం స్పోర్ట్స్ కోటా

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** స్పోర్ట్స్ కోటా కింద రెండు శాతం ఉద్యోగ నియామకాలు చేయాలని హైకోర్టు తీర్పు చెప్పింది. నేషనల్, ఇంటర్నేషన్, యూనివర్సిటీ లెవల్లో ఆడి ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు రెండు శాతం ఉద్యోగాలను కేటాయించాలంది. గ్రూప్ వంటి పోస్టులకు ఇంటర్నేషన్ లెవల్లో ఆడిన వాళ్లనే ఎంపిక చేస్తామని టీజీపీఎస్సీ, రాష్ట్ర సర్కార్ చేసిన వాదనను కొట్టివేసింది. ఫాం1 (ఇంటర్నేషనల్), ఫాం2 (నేషనల్), వర్సిటీ లెవల్స్లో ప్రతిభావంతులపై క్రీడాకారులు అందరూ సమానమని తెల్చింది. గతంలోని మధ్యంతర ఉత్తర్వుల మేరకు ఖాళీగా ఉంచి పోస్టులకు 2 శాతం కోటా అమలు చేయాలంది. ఇప్పటికే భర్తీ చేసిన పోస్టులను యథాతథంగా కొనసాగించాలంది. అయితే, భవిష్యత్లో భర్తీ చేయబోయే పోస్టులకు రెండు శాతం కోటా అమలు చేయాల్సిందేనని తీర్పులో పేర్కొంది. స్పోర్టస్ కోటా అమలుకు చెందిన వేర్వేరు జీవోలను అమలు లోపభూయిష్టంగా ఉందంటూ దాఖలైన పలు పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వర్రావు తీర్పు చెప్పారు.

## ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌ల నిషేధం

# పిల్‌పై కేంద్రం సాయం కోరిన సుప్రీం

సిఎఎస్‌సి దాఖలు చేసిన పిటిషన్
విచారణ చేపట్టిన 'సుప్రీం'
రెండు వారాల తర్వాత 'జాబితాకు'
ఉత్తర్వులు జారీ

**న్యూఢిల్లీ :** సోషల్, ఈస్పోర్ట్స్ గేమ్‌ల ముసుగులో పనిచేస్తున్న ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లను నిషేధించాలని ఆదేశాలు కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజనాల వ్యాజ్యం (పిల్)పై సుప్రీంకోర్టు కేంద్రం సహాయం కోరింది. న్యాయమూర్తులు జస్టిస్ జెబి.పార్దివాలా, జస్టిస్ కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తరపు న్యాయవాదికి ప్రజా ప్రయోజన వ్యాజ్యం కాపీని అందజేయాలని పిటిషనర్ తరపు న్యాయవాదిని ధర్మాసనం కోరింది. 'ఈ పిటిషన్‌ను పరిశీలించి తదుపరి విచారణ తేదీలో మాకు సహకరించాలని వి.సి.భారతిని మేం అభ్యర్థిస్తున్నాం. రెండు వారాల తర్వాత జాబితా చేయాలి' అని శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వులో ధర్మాసనం కోరింది. సోషల్, ఈస్పోర్ట్స్ గేమ్‌ల ముసుగులో పనిచేస్తున్న ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్ ప్లాట్‌ఫారాలను నిషేధించాలని కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ థింక్‌టాంక్ సెంటర్ ఫర్ అకౌంటబిలిటీ అండ్ సిస్టమెటిక్ చేంజ్ (సిఎఎస్‌సి) దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం విచారించింది. రిజిస్టర్డ్ కాని గేమింగ్ అప్లికేషన్‌లతో ఏవైనా ద్రవ్య లావాదేవీలను అనుమతించకుండా ఆర్‌బిఐ, ఎన్‌పిసిఐ, యుపిఐ ప్లాట్‌ఫారమ్‌లను ఆదేశించాలని కూడా పిటిషన్ కోరింది. రూ. 2 లక్షల కోట్లకు పైగా చెల్లించని పన్నులు చెల్లించాల్సిన ఆఫ్‌షోర్ గేమింగ్ కంపెనీలపై పన్ను రికవరీ, దర్యాప్తును ఇంటర్‌పోల్, సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ద్వారా కోరింది. ఆన్‌లైన్ గేమింగ్ చట్టం 2025 ప్రమోషన్, రెగ్యులేషన్, ప్రొవిజన్స్‌ను సోషల్, ఈస్పోర్ట్స్ గేమ్‌ల ముసుగులో నిర్వహించబడుతున్న ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్, బెట్టింగ్ గేమ్‌లను నిషేధించడానికి రాష్ట్ర శాసనసభలు రూపొందించిన చట్టాలు, ఆన్‌లైన్ గేమ్‌లను ప్రోత్సహించడం, నియంత్రించడం వంటి నిబంధనలలో సమన్వయం పాటించాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్, ఆర్థిక , యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖలను ఆదేశించాలని పిటిషన్ కోరింది. ఆన్‌లైన్ మనీగేమ్‌లకు సంబంధించిన హానికరమైన పద్ధతులను నిషేధిస్తూనే డిజిటల్ వినోదాన్ని ప్రోత్సహించడానికి ఈ చట్టం సమగ్ర చట్టాన్ని నిర్దేశిస్తుంది. ఈ పిటిషన్‌లో ఆరుగురు ప్రతివాదుల పేర్లు ఉన్నాయి. వారిలో నాలుగు కేంద్ర మంత్రిత్వ శాఖలు సహా రెండు ప్రముఖ యాప్ స్టోర్ ఆపరేటర్లు ఆపిల్ ఇంక్ లేదా గూగుల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఉన్నాయి. దేశవ్యాప్తంగా సామాజిక, ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాని ఆరోపిస్తున్న బెట్టింగ్, జూదం అనువర్తనాల విస్తరణను అరికట్టాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని సిఎసిఎస్ అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది. 'భారతదేశంలో చాలా రాష్ట్రాలు బెట్టింగ్, జూదం చట్టవిరుద్ధమైన చర్యలుగా పరిగణిస్తాయి. ప్రభుత్వం, గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లు అఫిడవిట్ దాఖలు చేసిన అనేక కేసులు ఎక్కువగానే ఉన్నాయి. వీటిని విశ్లేషించిన తర్వాత రూ.65 కోట్లకు పైగా ఇటువంటి ఆటలను ఆడుతున్నారని , భారతదేశంలో ఈ ప్లాట్‌ఫారమ్‌లకు ప్రతీ ఏటా రూ. 1.8లక్షల కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని నివేదించబడింది' అని ప్రజాప్రయోజనాల వ్యాజ్యం పేర్కొంది. అన్ని చట్టవిరుద్ధమైన బెట్టింగ్ సైట్‌లపై ఐటి చట్టంలోని సెక్షన్ 69A బ్లాక్ చేయమని ఆదేశించాలని ఒక ప్రార్థనలో పిల్ కోరింది. ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు ఇప్పటికే సేకరించిన మైనర్ల డేటాను రక్షించడానికి కూడా ఆదేశాలు జారీ చేయాలని ఈ ప్రజాప్రయోజనాల వ్యాజ్యం కోరింది. సైబర్ మోసాలు, వ్యసనం, మానసిక ఆరోగ్య రుగ్మతలు, ఇలాంటి చట్టవిరుద్ధమైన గేమ్స్‌కు దారితీస్తున్నాయని వాటిని అత్యున్నతస్థాయి క్రికెటర్లు, సినీ స్టార్లు సమర్థిస్తున్నారని పిల్ ఆరోపించింది.

## కోర్టుధిక్కరణ నోటీసులు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్రంలోని 33 జిల్లాలకుగాను 21 జిల్లాల్లోని మత్స్యకారుల సహకార సంఘాలకు ఎందుకు ఎన్నికలు పెట్టలేదో చెప్పాలని రాష్ట్రానికి హైకోర్టు కోర్టుధిక్కార నోటీసులు జారీ చేసింది. చీఫ్ సెక్రటరీ, పశుసంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సహకార శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, మత్స్య శాఖ ఎండీలు కౌంటర్లు దాఖలు చేయాలంది. గడువు అయినప్పటికీ ఎన్నికలు పెట్టలేదంటూ ముత్రాసి, ముదిరాజ్ తెగకు చెందిన బీ మల్లేషం మరో ఏడుగురు వేసిన పిటిషన్లో హైకోర్టు ఎన్నికలు పెట్టాలని గత సెప్టెంబర్లో ఆదేశించింది. 12 జిల్లాలకే ఎన్నికలు పెట్టారని, మిగిలిన 21 జిల్లాలకు స్పెషలాఫీసర్లను నియమించారని పిటిషనర్లు కోర్టుధిక్కరణ పిటిషన్ వేశారు. దీనిపై విచారణను వచ్చే నెల 14కి వాయిదా వేస్తూ జస్టిస్ మాధవీ దేవి ఉత్తర్వులు జారీ చేశారు.

## నయా ఉస్మానియా

(మొదటి పేజీ తరువాయి)

తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఆసుపత్రి నిర్మాణ పనులతో పాటు స్థానికులకు ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఆసుపత్రి నిర్మాణ పనుల వేగవంతానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జిహెచ్‌ఎంసి, రోడ్లు, భవనాలు, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని సిఎం ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రతి పది రోజులకోకసారి సమావేశమై ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకుంటూ పనులు వేగంగా జరిగేలా చూడాలని సిఎం ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన అనంతరం అక్కడి బందోబస్తు, ట్రాఫిక్ విధుల నిర్వహణకు సంబంధించి ముందుస్తుగానే తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి పోలీసు శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ఆసుపత్రికి వివిధ రహదారులను అనుసంధానించే ప్రణాళికలు ఇప్పటి నుంచే రూపొందించాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులకు సిఎం సూచించారు. హైదరాబాద్‌లో పాటు వివిధ జిల్లాలలో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రులు, మెడికల్ కళాశాలల నిర్మాణానికి సంబంధించి ప్రతి నిర్మాణానికి ఒక అధికారిని నియమించాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నిర్మాణాలపై 24 గంటలు ఆ అధికారి పర్యవేక్షించే విధంగా పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగించాలని సిఎం సూచించారు. వచ్చే ఏడాది జూన్ నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. సమీక్షలో సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి, శ్రీనివాసరాజు, సిఎం కార్యదర్శి మాణిక్ రాజ్, డిజిపి శివధర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు వికాస్‌రాజ్, క్రిస్టియానా జోంగ్తూ, ఇలంబర్తి, ముషారఫ్ అలీ ఫరూఖీ, హరిచందన తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ లాఠీ?

(మొదటి పేజీ తరువాయి)

భయం ఉండే విధంగా మాత్రమే లాఠీలు ఉపయోగించాలని, అమాయకుల పట్ల వాడకూడదని పోలీసు వర్గాల్లో తర్జనా భర్జన జరుగుతోంది. ఒకప్పుడు పోలీసులు అంటే చేతిలో లాఠీ, ముఖంలో గంభీరత, కళ్ళలో క్రమశిక్షణ కనిపించేది. కానీ ఈ రోజుల్లో దృశ్యం పూర్తిగా మారిపోయింది. ఆధునిక సాంకేతికత, కెమెరాలు, మొబైల్ యాప్స్, డ్రోన్లు,ట్యాబులు, సీసీటీవీలు పోలీస్ ల పనితీరును మార్చేసాయి. అయితే ఈ పరిణామంలో పోలీస్ ల ప్రతీకగా నిలిచిన లాఠీ మాత్రం మరుగునపడింది. కొత్త తరహా పోలీసింగ్‌లో లాఠీకి బదులు టాబ్, మొబైల్, బాడీ కెమెరా, స్మార్ట్ ప్యాట్రోలింగ్ వాహనాలే ఆయుధాలుగా మారాయి. ఫీల్డ్ స్థాయిలో కూడా ఇప్పుడు డిజిటల్ రిపోర్టింగ్, ఆన్‌లైన్ కేస్ రిజిస్ట్రేషన్, సర్వైలెన్స్ ఆధారిత విచారణలు పెరుగుతుండటంతో లాఠీ వినియోగం తగ్గిపోయిందని సీనియర్ పోలీసు అధికారులు చెబుతున్నారు. ఇప్పటి పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలి. భయం కంటే విశ్వాసం పెంపొందించడమే లక్ష్యం. అందుకే లాఠీ వినియోగం తగ్గించి కమ్యూనిటీ పోలీసింగ్‌పై దృష్టి పెడుతున్నాం అని మరి కొందరు వాదిస్తున్నారు. అయితే పాత తరం పోలీస్‌లు మాత్రం వేరే కోణంలో చూస్తున్నారు. లాఠీ అంటే క్రమశిక్షణకు ప్రతీక. అది పోలీస్ కి గౌరవం ఇచ్చేది. ఇప్పుడు లాఠీ లేకుండా పోలీస్ ని చూసి భయం కూడా లేకపోవడం వల్ల నేరస్థులు ధైర్యం పెంచుకున్నారు అనే వాదన కూడా వినిపిస్తుంది. లాఠీ లేకుండా పోలీసులు సాఫ్ట్ టార్గెట్ అవుతున్నారనే వాదన కూడా వినిపిస్తోంది. కొన్నిసార్లు దాడులకు గురవుతున్న పోలీస్ సిబ్బందికి రక్షణగా ఉండే ఒకే సాధనం లాఠీ. ఇప్పుడు ఆచరణలో కనబడడం లేదనే వాదన కూడా ఉంది. తాజా తరం పోలీసింగ్ డిజిటల్ దిశగా ముందుకెళ్తున్నప్పటికీ, లాఠీ సింబల్ ఆఫ్ పోలీస్ పవర్ అని చెప్పే వారి మాటల్లో నిజం లేదని చెప్పలేము. ఒకవైపు టెక్నాలజీతో ముందడుగు, మరోవైపు సంప్రదాయ క్రమశిక్షణ మధ్య తెలంగాణ పోలీసులు సంతులనం సాధించగలరా? అనేది కాలమే సమాధానం చెప్పాలి.

## ఇడి విచారణ

(మొదటి పేజీ తరువాయి)

కమిషనరేట్ పరిధిలోని సిసిఎస్‌కు చెందిన సిట్ కు అప్పగించారు. ఈ క్రమంలోనే సృష్టి అక్రమాలను వెలికి తీసేందుకు ఇడి రంగంలోకి దిగింది. కేసులో నిందితులంతా భారీగా ఆస్తులు కూడబెట్టినట్లుగా ఇప్పటికే సోదాల్లో గుర్తించి కీలక పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. తాజాగా కోర్టు నిందితులను విచారించేందుకు ఇడి అధికారులకు అనుమతి ఇవ్వడంతో నిందితులకు మంగళవారం నోటీసులు జారీ చేసింది. బుధవారం మొదటి రోజు నిందితులను ఇడి అధికారుల బృందం 25 ప్రశ్నలు వేసి వివరాలు రాబట్టింది. విదేశాల్లో కూడా సృష్టి యాజమాన్యం ఆస్తులు కూడబెట్టిందని తెలిసింది. ఇక్కడ సుమారు 150 మంది బాధిత దంపతుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి విదేశాల్లో పెట్టుబడులు పెట్టారని ఇడి విచారణలో బయటపడినట్లు తెలిసింది. నిందితులను ఇడి అధికారులు ఈనెల 28 వరకు చంచల్‌గూడ మహిళా, పురుషుల జైలులోనే విచారించనున్నారు.

## నిందితుడికి 32 ఏళ్ల జైలు

(మొదటి పేజీ తరువాయి)

మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా బలవంతంగా పెళ్లి చేసుకుని శారీరకంగా వాడుకున్న తరువాత వదిలేసిన ఘటనపై నల్లగొండ 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిందితుడిపై 2022లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. విచారణ అనంతరం కోర్టులో ఛార్జ్ సీట్ దాఖలు చేయగా బుధవారం ఏడిజె టు కమ్ ఎస్సి, ఎస్టి కోర్టు అత్యాచారం, ఫోక్సో కేసుల కోర్ట్ నిందితున్ని దోషిగా నిర్ధారించి,పోక్సో యాక్ట్ క్రింద 20 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు రూ.25 వేల జరిమాన, అదేవిధంగా సెక్షన్ 366 ఐపిసి క్రింద 10 సంవత్సరాల జైలు రూ.25 వేల జరిమాన, బాల్య వివాహ నిషేధ చట్టం కింద 2 సంవత్సరాల జైలు రూ.25 వేల జరిమానా మొత్తం కలిపి 32 సంవత్సరాల జైలు శిక్ష రూ.75 వేల జరిమాన విధించడం జరిగిందన్నారు. బాధితురాలికి డిఎస్ఎల్ఎ ద్వారా రూ.10 లక్షలు పరిహారం అందించాలని తీర్పు వెలువడించిందని తెలిపారు. ఈ కేసులో సరైన సాక్ష్యదారాలు సేకరించి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు సమర్పించి నిందితునికి శిక్ష పడే విధంగా చేసిన ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి,చంద్ర శేఖర్ రెడ్డి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్.అలాగే ప్రాసెక్యూషన్‌కు సహకరించిన నల్లగొండ డిఎస్‌పి కె.శివరాం రెడ్డి,సిఐ రాఘవ రావు ,ఎస్ఐ సైదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ వేముల రంజిత్ కుమార్,సిడిఓ సుమన్,లీగల్ ఆఫీసర్ బరోసా సెంటర్ కె.కల్పన,లైజెన్ అధికారులు పి.నరేందర్, యన్.మల్లికార్జున్ లను జిల్లా ఎస్‌పి అభినందించారు.

## తెలంగాణ రోల్ మోడల్

(మొదటి పేజీ తరువాయి)

సుదీర్ఘంగా చర్చించారు. 'ఇన్నోవేషన్, టెక్నాలజీ హబ్‌లను ఏర్పాటు చేసేందుకు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణ వైపు చూస్తున్నాయి. జిసిసిలు, పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రం అత్యంత అనుకూలం. పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించే ప్రగతిశీల విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ఎకో సిస్టమ్, స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం అందుబాటులో ఉంది' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు కంపెనీ ప్రతినిధులకు వివరించారు. ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్, సస్టెయినబిలిటీ, మాన్యుఫాక్చరింగ్, మైనింగ్ రంగాల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం తెలంగాణతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని ఆహ్వానించారు. 'పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవ, అమలు చేస్తున్న ప్రోత్సాహకర, ప్రగతిశీల విధానాలు అభినందనీయం. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న జీసీసీలో డిజిటల్ ఇంజనీరింగ్, ఆటోమేషన్, అడ్వాన్స్‌డ అనలిటిక్స్ తదితర రంగాల్లో 600 మంది హై స్కిల్డ్ నిపుణులకు ఉద్యోగాలు కల్పించాం. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. తెలంగాణలో కార్యకలాపాల విస్తరణ, వివిధ రంగాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నాం' అని ఒరికా సంస్థ సీఈఓ, ఎండీ సంజీవ్ గాంధీ తెలిపారు. 'ఆస్ బయోటెక్ 2025 ఇంటర్నేషన్ కాన్ఫరెన్స్'లో కీలకోపన్యాసం చేసేందుకు ఆస్ట్రేలియాకు విచ్చేసిన మంత్రి శ్రీధర్ బాబును కంపెనీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## 90 వేలు దాటిన మద్యం దుకాణాల దరఖాస్తులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలోని 2620 మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవడానికి గురువారం చివరి రోజు. ఆసక్తి కలిగిన నేడు సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు చేసుకోవడానికి ఎక్సైజ్ శాఖ అవకాశమిచ్చింది. బిసి రాష్ట్ర బంద్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు బస్సులు నడువకపోవడం, కొన్ని చోట్ల బ్యాంకులు పని చేయకపోవడం లాంటి ఘటనలను దృష్టి ఉంచుకొని ఎక్సైజ్ శాఖ మద్యం షాపులకు దరఖాస్తుల గడవు ఈ నెల 23 వరకు పొడగించిన విషయం తెలిసిందే. మద్యం షాపులకు దరఖాస్తుల గడవు పొడగించడంతో ఈ నెల 21న 461 దరఖాస్తులు, 22వ తేదీన 511దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 18 వరకు తెలంగాణలో మద్యం షాపులకు 89,344 దరఖాస్తులను ఎక్సైజ్ శాఖ స్వీకరించారు. బుధవారం నాటికి 90,316 దరఖాస్తులు వచ్చాయి. మద్యం షాపులకు చివరి రోజున దరఖాస్తులు దాఖలు చేయడానికి అన్ని జిల్లాలకు సంబంధించిన కౌంటర్లను ప్రొహిబిషన్ కార్యాలయంలో ఎక్సైజ్ డివిజన్ల వారిగా ఏర్పాటు చేశారు. అన్ని జిల్లాల్లోను డిజిఇఒ కార్యాలయాల్లో దరఖాస్తులు వేసు కోవడానికి ఏర్పాట్లు చేశారు. మద్యం షాపుల దరఖాస్తులు చివరి రోజు కావడంతో వచ్చె దరఖాస్తుదారుల రద్దీకి అనువుగా ఏర్పాట్లను ఎక్సైజ్ శాఖ చేసింది.

# సైన్స్, ఆవిష్కరణలకు కేంద్రంగా హైదరాబాద్




### ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ రానున్న దశాబ్దంలో విపరీతంగా పెరగనుందని, ఆ వృద్ధికి తెలంగాణ లాంచ్ ప్యాడ్‌గా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రపంచంలోని పరిశోధనా సంస్థలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నామన్నారు. సహాయక విధాన వాతావరణం, ఇన్క్యుబేషన్ సపోర్ట్, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది అన్నారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కాలం నుంచి హైదరాబాద్ సైన్స్, ఆవిష్కరణలకు కేంద్రంగా విరాజిల్లుతోందని అన్నారు. మాదాపూర్ జెఆర్‌సి కన్వెన్షన్‌లో బుధవారం నిర్వహించిన 'బయో ఇన్‌స్పైర్డ్ ఫ్రాంటియర్స్ 2025 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ స్పేస్ ఎకానమీ, బయోమిమిక్రి, ఎక్స్‌ట్రాటెరెస్ట్రియల్ రిసోర్స్' సదస్సులో ముఖ్యఅతిథిగా డిప్యూటీ సిఎం పాల్గొన్నారు. సదస్సులో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ హైదరాబాద్ కేవలం ఒక గమ్యం కాదని, ఆత్మవిశ్వాసంతో కూడినదని, హైదరాబాద్‌లో మొదలైన చర్చలు భవిష్యత్తులో భూమి మీదా, అంతరిక్షంలోనూ మంచిని నిర్మించే భాగస్వామ్యులుగా మారాలని కోరుకుంటున్నామన్నారు. తెలంగాణా ఎల్లప్పుడూ ప్రభుత్వ సంస్థలను ప్రేరేపించే, స్టార్టప్‌లు ఆవిష్కరించే, ప్రపంచ శాస్త్రం కలిసే ప్రదేశంగా ఉంటుందని స్పష్టం చేశారు. జ్ఞానం, అన్వేషణ మధ్య వంతెనగా, భూమి, ఆకాశం మధ్య సేతువుగా హైదరాబాద్ మహానగరం ఎప్పటికీ నిలవాలని డిప్యూటీ సిఎం ఆకాంక్షించారు. ప్రపంచ స్థాయి వ్యవస్థల రూపకల్పనకు కేంద్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి పరిశోధన సంస్థలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పక్షాన ఆహ్వానం పలుకుతున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతుల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది అన్నారు. హైదరాబాద్ నగరానికి ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేసిన శాస్త్రవేత్తలు, పరిశ్రమ నాయకులు, ఆవిష్కర్తలకు ఆయన స్వాగతం తెలిపారు. శాస్త్ర సున్నితత్వం, కల్పనాత్మకత కవిత్వం కలిసిన ఈ నగరం ఎప్పుడూ సృజనాత్మకతకు నిలయంగా నిలిచింది అన్నారు. 'బయో ఇన్‌స్పైర్డ్ ఫ్రాంటియర్స్ 2025' జీవ శాస్త్రం, సాంకేతికత, అంతరిక్ష అన్వేషణల మధ్య జరుగుతున్న ఈ ప్రపంచ స్థాయి సంభాషణ భారత శాస్త్రీయ గమ్యాన్ని అర్థ శతాబ్దానికి పైగా నిశ్శబ్దంగా మలిచిన హైదరాబాద్ నగరంలో జరగడం గర్వకారణమన్నారు. తెలంగాణా ప్రభుత్వం ఈ తత్వాన్ని తన అభివృద్ధి దృక్పథంలో భాగం చేస్తోంది, బయోమిమెటిక్ డిజైన్, గ్రీన్ బిల్డింగ్ కోడ్స్, నీటి నిర్వహణ, శుద్ధ ఇంధనం రంగాల్లో దీన్ని ప్రోత్సహిస్తోంది అని వివరించారు. అంతరిక్షంలోకి విస్తరించేప్పుడు కూడా మనం ఈ వినయాన్ని తీసుకెళ్లాలి, ఆవిష్కరణ, సంరక్షణ రెండూ కలిసి రెండు కాళ్ళ మాదిరిగా నడవాలి అన్నారు. సమావేశంలో ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, జియో ప్యాక్ సిఈఓ ఎం అబ్బాస్, లీడ్ స్పాన్సర్ సుజిత్ పాల్గొన్నారు.

# గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా తెలంగాణ

### ఆస్ట్రేలియా యూనివర్సిటీ 'ఆర్‌ఎంఐటీ'తో ప్రభుత్వం ఎల్ఒఐ
### రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్'గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా బుధవారం మెల్‌బోర్న్‌లోని ప్రముఖ యూనివర్సిటీ 'ఆర్‌ఎంఐటి'తో రాష్ట్ర ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్ఒఐ)ను కుదుర్చుకుందని చెప్పారు. లైఫ్ సైన్సెస్ రంగంలో ఇన్నోవేషన్, పరిశోధన, అభివృద్ధి, ఉన్నత విద్య, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రెడీ టూ వర్క్ ఫోర్స్ తయారీ తదితర అంశాల్లో ద్వైపాక్షిక సహకారానికి ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. రేపటి జీనోమ్ వ్యాలీకి ఇది ఒక బ్లూ ప్రింట్‌గా మార్గ నిర్దేశం చేస్తుందన్నారు. ఆసియాలోనే అగ్రగామిగా ఎదిగిన తెలంగాణ 'లైఫ్ సైన్సెస్' ఆర్థిక వ్యవస్థను 2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 80 బిలియన్ డాలర్ల విలువ చేసే 2వేలకు పైగా జాతీయ, అంతర్జాతీయ దిగ్గజ ఫార్మా, బయోటెక్ కంపెనీలు ఇక్కడ ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. దేశంలో ఉత్పత్తయ్యే ఔషధాల్లో మన వాటా 40 శాతంగా ఉందన్నారు. ప్రపంచానికి అవసరమైన వ్యాక్సిన్లలో మూడింట ఒక వంతును మనమే అందిస్తున్నామన్నారు. 'ఎలీ లిల్లీ' లాంటి దిగ్గజ ఫార్మా సంస్థలు తెలంగాణ వైపు చూస్తున్నాయని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా తెలంగాణ యువతను లైఫ్ సైన్సెస్ రంగానికి అవసరమైన అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులుగా తీర్చే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందన్నారు. త్వరలోనే ప్రత్యేకంగా తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తాజా ఒప్పందంలో భాగంగా ఉమ్మడి పీహెచ్‌డీ, స్టూడెంట్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం అందుబాటులోకి వస్తుందన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేలా ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులను చేపడతామన్నారు. పరిశోధక విద్యార్థులు బిట్స్ హైదరాబాద్, ఆర్‌ఎంఐటి యూనివర్సిటీలలో నిపుణుల మార్గ నిర్దేశంలో రీసెర్చ్ చేసే అవకాశం లభిస్తుందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉమ్మడి అకడమిక్ కరిక్యులంను రూపొందించి విద్యార్థులను రేపటి అవసరాలకు అనుగుణంగా స్కిల్డ్ వర్క్ ఫోర్స్‌గా తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సిఇఒ శక్తి నాగప్పన్, ఆర్‌ఎంఐటి యూనివర్సిటీ డిప్యూటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కేథరీన్ ఇట్సియోపౌలోస్ లెటర్ ఆఫ్ ఇంటెంట్ పై సంతకాలు చేశారు. తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పనిచేసే అవకాశం దక్కడం సంతోషంగా ఉందని ప్రొఫెసర్ కేథరీన్ ఇట్సియోపౌలోస్ అన్నారు. ఈ ఒప్పంద ద్వారా లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్ గా మారుతుందన్నారు.

# జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని కాపాడిన హైడ్రా

### 38 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ కంచె నిర్మాణం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం పేట్ బషీరాబాద్‌లో జర్నలిస్టులకు కేటాయించిన ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. సర్వే నంబరు 25/2లోని 38 ఎకరాల కాపాడిన భూమికి చుట్టూ బుధవారం ఫెన్సింగ్ వేసింది. గతంలో భూమిని జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచ్యువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి రాష్ట్ర ప్రభుత్వం 2008లో కేటాయించింది. ఈ భూమిని జర్నలిస్టులకు కేటాయిస్తూ హెచ్‌ఎండిఎ కస్టడీలో ప్రభుత్వం ఉంచిన విషయం విధితమే. అయితే ఈ కేటాయింపులపై కొంతమంది కోర్టుకెళ్లడంతో అక్కడ జర్నలిస్టులకు ప్లాట్ల పంపిణీ జరగలేదు. కోర్టులో వివాదం ఉంటుండగానే.. మరో వైపు అక్కడ ఆక్రమణలు జరుగుతున్నాయని హైడ్రాకు జెఎన్‌ఎంఎసిహెచ్‌ఎస్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై అక్కడ రెవెన్యూ, హెచ్‌ఎండిఎ అధికారులు కూడా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్, హెచ్ ఎండిఎ అధికారులతో కలిసి హైడ్రా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. ఆక్రమణలు జరిగినట్టు నిర్ధారించుకుంది. ఇప్పటికే కొంత మంది ఇళ్లు కట్టుకుని ఉండగా.. వాటి జోలికి పోకుండా ఇంకా ఖాళీగా ఉన్న భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసింది. ఈ విషయమై కొంతమంది అభ్యంతరాలు వ్యక్తం చేయగా.. కోర్టు తీర్పు ప్రకారం ఆ స్థలం కేటాయింపులు జరుగుతాయి.. ఈలోగా ఆక్రమణలు జరగకుండా ప్రభుత్వ భూమిని కాపాడుతున్నట్టు హైడ్రా స్పష్టం చేసింది. అలాగే అక్కడ ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారితో త్వరలోనే సమావేశాన్ని ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో రికార్డులను పరిశీలిస్తామని హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ చెప్పారు. ఈ సమావేశంలో హైడ్రా, రెవెన్యూ, హెచ్ ఎండిఎ, మున్సిపల్ అధికారులు కూడా ఉంటారని తెలిపారు.

# తెలంగాణలో 'ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సిటీ'

### రాష్ట్రంలో ఏర్పాటుకు ఆస్ట్రేలియా విద్యాసంస్థ 'విఐటి' ఆసక్తి
### ఆస్ట్రేలియా పర్యటనలో మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేక భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో 'ఫ్లగ్ అండ్ ప్లే' విధానంలో 'ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సిటీ'ని ఏర్పాటు చేసేందుకు ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ విద్యా సంస్థ విక్టోరియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విఐటి) ఆసక్తి చూపిస్తోంది. ఈ మేరకు ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మెల్‌బోర్న్‌లో బుధవారం విఐటి బోర్డు సభ్యుడు, మాజీ పార్లమెంటేరియన్, ప్రస్తుత ఆస్ట్రేలియా ప్రధాని సన్నిహితుడు అలన్ గ్రిఫిన్ ప్రత్యేకంగా కలిశారు. అంతర్జాతీయ విద్యా, నైపుణ్య కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలు, ఇక్కడి అనుకూలతలు, ప్రగతిశీల విధానాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, తెలంగాణ యువత ప్రతిభ, సమర్థవంతమైన నాయకత్వం తదితర అంశాలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వారికి వివరించారు. అనంతరం 'ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సిటీ' ఏర్పాటు ప్రతిపాదనపై సుదీర్ఘంగా చర్చించారు. విదేశీ వర్సిటీలు, ఉన్నతస్థాయి పరిశోధన కేంద్రాలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలకు 'గ్లోబల్ హబ్'గా ఈ క్యాంపస్ ను అభివృద్ధి చేస్తామని 'విట్ ప్రతినిధులు మంత్రి శ్రీధర్ బాబుకు చెప్పారు. సదరు సంస్థలు తమ కార్యకలాపాలను నిర్వహించుకునేలా 'ఫ్లగ్ అండ్ ప్లే' విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలతో ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఈ ప్రతిపాదనపై మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. స్థల పరిశీలన, తదుపరి చర్చల కోసం తెలంగాణకు రావాలని ఆహ్వానించారు. సమావేశంలో విఐటి ప్రతినిధి అర్జున్ సూరపనేని, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# పట్టణాల్లోనూ 'ఇందిరమ్మ ఇండ్లు'

### జి ప్లస్1 తరహాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అవకాశం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం గ్రామీణ ప్రాంతాలలో శర వేగంగా సాగుతున్న నేపథ్యంలో పట్టణ ప్రాంతాలలో కూడా 'ఇందిరమ్మ ఇండ్ల' నిర్మాణంపై దృష్టి సారించామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కనీసం 30 చదరపు మీటర్ల విస్తీర్ణంలో జి ప్లస్ 1 తరహాలో ఇంటిని నిర్మించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని, గ్రౌండ్ ఫ్లోర్‌లో 200 చదరపు అడుగులు మొదటి అంతస్తులో మరో 200 చదరపు అడుగులు నిర్మించుకునేందుకు వీలుగా జిఒ ఎంఎస్ నె 69ను జారీ చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లోని సచివాయంలో ఇందిరమ్మ ఇండ్ల అంశంపైన మంత్రి పొంగులేటి గృహ నిర్మాణ శాఖ అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ఇరుకు స్థలాల్లో నివసిస్తున్న పేద ప్రజలకు పక్కా ఇంటి వసతిని కల్పించేలా ఇందిరమ్మ పథకాన్ని వర్తింప చేస్తున్నామన్నారు. పట్టణ ప్రాంతాల్లో పేదలకు పక్కా ఇంటి వసతిని కల్పించాలన్న లక్ష్యంతో పాటు, స్థలాల కొరత ను దృష్టిలో పెట్టుకుని కొన్ని సడలింపులు కల్పించామన్నారు. పట్టణ ప్రాంతాల్లోని పేదలకు పక్కా ఇంటి వసతి కోసం కొద్ది కాలంగా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై అధ్యయనం చేశామని వివరించారు. రాష్ట్రంలోని అనేక పట్టణాలు, నగరాల్లోని పేదలు సొంత ఇంటిని నిర్మించుకునేందుకు తగిన స్థలం లేక , అరకొర వసతులతో తాత్కాలిక ఏర్పాట్లు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని అలాంటి వారి కోసం ఇందిరమ్మ ఇండ్ల ను నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అనేక మంది 60 చదరపు గజాల కంటే తక్కువ విస్తీర్ణంలోని రేకుల షెడ్లు, ఇతరత్రా తాత్కాలిక ఏర్పాట్లుతో జీవిస్తున్నారని, వీరికి ఆర్‌సిసి స్లాబుతో పక్కా ఇంటిని నిర్మించాలంటే తగిన స్థలం అందుబాటులో లేదని, ఈ సమస్యను అధిగమించేందుకు పట్టణ ప్రాంతాల్లో జి ప్లస్ 1 నిర్మాణాలకు అనుమతినిస్తూ, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అందచేస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని దశల వారీగా నిర్మాణ పనుల స్థాయిని బట్టి లబ్ధిదారులకు అందజేస్తామని మంత్రి వివరించారు. జి+1 విధానంలో పట్టణ ప్రాంతాల్లోని లబ్ధిదారులు 96 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 70 అడుగుల విస్తీర్ణంలో వేర్వేరుగా రెండు గదులతో పాటు, కనీసం 35.5 చదరపు అడుగుల్లో వంటగదిని నిర్మించుకోవాలని, ప్రతి ఇంటికి ప్రత్యేకంగా టాయిలెట్, బాత్ రూములు తప్పనిసరిగా ఉండాలని, ఈ ఇంటి నిర్మాణం ఆర్ సిసి స్లాబ్ తో ఉండాలని, ఇందుకు సంబంధించిన స్ట్రక్చరల్ డిజైన్లకు డిఇఇ (హౌసింగ్)అనుమతి తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.

**నాలుగు దశల్లో రూ.5 లక్షలు చెల్లింపు...**

మొదటి అంతస్తు రూఫ్ లెవల్ వరకు నిర్మాణ పనులు జరిగితే రూ.1 లక్ష, ఆ తర్వాత గ్రౌండ్ ఫ్లోర్ రూఫ్ వేసిన తర్వాత రూ.1 లక్ష, ఆపైన ఫస్ట్ ఫ్లోర్‌లో కాలమ్స్, స్లాబ్, గోడల నిర్మాణాలు పూర్తయిన తర్వాత రూ.2 లక్షలను, ఇంటి నిర్మాణ పనులు పూర్తి అయిన తరువాత మరో లక్ష రూపాయలను విడుదల చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రభుత్వానికి ఒక సవాల్‌గా తీసుకున్నామని, ఇండ్ల నిర్మాణంపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

# నిరుద్యోగ సమస్య పరిష్కారానికి వేగంగా కార్యాచరణ చేపట్టాలి

### పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌తో కోదండరామ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం వేగంగా కార్యాచరణను చేపట్టాలని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ను టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ కోరారు. జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ మహేష్ కుమార్‌గౌడ్ హైదరాబాద్‌లోని టిజెఎస్ కార్యాలయంలో కోదండరామ్‌తోపాటు, టిజెఎస్ రాష్ట్ర కమిటీ నాయకులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నిస్వార్థంగా, నిజాయితీగా తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ కోదండరామ్ కీలక పాత్ర పోషించారన్నారు. మిత్రపక్షంలో భాగంగా త్వరలోనే టిజెఎస్‌కు ప్రభుత్వంలో తగిన భాగస్వామ్యం కల్పిస్తామని హామీనిచ్చారు. ప్రస్తుత జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక చాలా కీలకమని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి టిజెఎస్ మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల సాధన కోసం తీవ్రంగా కృషి చేయాలని, ఆ ప్రయత్నానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అంశంలో టిజెఎస్ రాష్ట్ర కమిటీ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం ప్రకటిస్తామన్నారు. మిత్రపక్షమైన టిజెఎస్‌కు ప్రభుత్వంలో తగిన భాగస్వామ్యం కల్పించాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పలు చోట్ల పోటీ చేసే టిజెఎస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. టిజెఎస్ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో మతవిద్వేషాలు రెచ్చగొడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ విలువలను కాపాడుతూ, అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. ఈ సమావేశంలో టిజెఎస్ నాయకులు గొప్పగాని శంకర్ రావు, పల్లె వినయ్‌కుమార్, నిజ్జన రమేష్ ముదిరాజ్, ఆశప్ప, మాసంపల్లి అరుణ్ కుమార్, సర్దార్ జస్వంత్, బట్టల రామచందర్, కొత్త రవి, ప్రశాంత్, శేఖర్, హనుమంత్ రెడ్డి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ రాజ్యాంగ సవరణ చేయాలి

### బి.వి.రాఘవులు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ంలోని బిజెపి రెండు నాల్కల దోరణి అవలంభిస్తోందని సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు విమర్శించారు. రాష్ట్రంలోని బిల్లును ఆమోదిస్తూ, కేంద్రంలో ఆబిల్లులను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో ఎం.బి భవన్‌లో రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎం.బి.భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు విజయరాఘవన్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో కలిసి బి.వి.రాఘవులు మాట్లాడారు. సుప్రీం కోర్ట్ విధించిన 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ రాజ్యాంగ సవరణ చేపట్టాలని తెలంగాణ శాసనసభ తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపించాలని, తద్వారా కేంద్రంపైన ఒత్తిడిని పెంచాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల విషయంలో కేంద్రం ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే శీతాకాల పార్లమెంట్ సమావేశంలో రాజ్యాంగ సవరణ చేపట్టాలన్నారు. విద్యుత్ చట్ట సవరణ ద్వారా తెలంగాణ రాష్ట్రానికి, రైతులకు, పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. పవర్ సెక్టార్‌ను అదానీ చేతిలో పెట్టేందుకే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యుత్ చట్ట సవరణ చేస్తోందని విమర్శించారు. ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు ఇవ్వడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కాగర్ చేపట్టిందని మండిపడ్డారు.

సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. దేశాన్ని, ప్రజలను విభజించడమే ఆర్‌ఎస్‌ఎస్ ఏజెండా అని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతవసంతాల సందర్భంగా ఆ సంస్థ చీఫ్ మోహన్ భగవత్ ముస్లింలకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. బిహార్‌లో ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు ఓడిస్తారని, అక్కడ బిజెపి కూటమిని ఓడించమే తమ లక్ష్యమన్నారు.

# ప్రశ్నించటం, పోరాడటం నేర్పిందే సిపిఐ

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాల నరసింహ




**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** వందేళ్లలోనే దేశ పేదలకు, బాధితులకు ప్రశ్నించటం, పోరాడటం నేర్పిందే సిపిఐ అని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాల నరసింహ అన్నారు. బుధవారం వనపర్తి శ్వేతా నగర్ కామ్రేడ్ కటికనేని గోపాల్ రావు భవన్‌లో సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం కే.శ్రీరామ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా కామ్రేడ్ బాల నరసింహ పాల్గొని మాట్లాడుతూ వందేళ్లలో సిపిఐ ఏమిచ్చిందని కొందరు విమర్శ చేస్తుంటారని, పేదలకు ,బాధితులకు ప్రశ్నించటం ,పోరాటం ,న్యాయం పొందటం నేర్పింది సిపిఐ మాత్రమే అన్నారు. దోపిడికి వ్యతిరేకంగా కష్టజీవులకు అండగా సిపిఐ పోరాడి వారికి అనుకూలంగా చట్టాలను తెచ్చిందన్నారు. ఖమ్మంలో డిసెంబర్ 26న సిపిఐ వందేళ్ల విజయోత్సవ సభ జరగనుంది అన్నారు. దేశ స్వాతంత్ర కోసం, తెలంగాణ విముక్తి కోసం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం సిపిఐ అలుపెరగని పోరాటం చేసిందన్నారు. ప్రజా పోరాటాలతో పేదలకు భూములు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రుణమాఫీ, ఉపాధి హామీ పథకం, వంటి వాటిని ఎన్నో సాధించిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కార్మికులకు కనీస వేతనం వంటి చట్టాలు సాధించిందన్నారు. వందేళ్ళ విజయోత్సవ నేపథ్యంలో సాధించిన విజయాలను గ్రామ గ్రామాన ప్రజలకు వివరించేందుకు గద్వాల జోడే ఘాట్ బాసర నుంచి బయలుదేరి డిసెంబర్ 26న జరగనున్న విజయోత్సవ సభకు చేరుకుంటాయన్నారు. గద్వాల నుంచి బయలుదేరిన వనపర్తి జిల్లాలో 6 మండలాలు, నారాయణ పేట 3, మహబూబ్‌నగర్ 4, గద్వాల్ 2, నాగర్‌కర్నూల్ 6 మండలాలలో పర్యటించి ప్రచారం చేస్తుందన్నారు. రాష్ట్రంలో సిపిఐ విస్తరణకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ప్రజా పోరాటాల్లో సిపిఐ ప్రత్యేక పాత్రను ప్రజలు గుర్తించారన్నారు. పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లి పార్టీని బలోపేతం చేయాలన్నారు. పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలకు వివరించి ఆకర్షించాల్సిన అవసరం ఉందన్నారు.

**మూడు లక్షల మందితో వందేళ్ల విజయోత్సవ సభ**

ఖమ్మంలో మూడు లక్షల మందితో విజయోత్సవ సభ జరుగుతుందన్నారు. ఖమ్మం, కొత్తగూడెంలో నుంచే 80 వేల మంది పాల్గొంటారన్నారు. వనపర్తి జిల్లా నుంచి 300 మంది ఖమ్మం విజయోత్సవ సభలకు హాజరవుతారన్నారు. వందేళ్ళ ఉత్సవ సభకు 40 దేశాల ప్రతినిధులు హాజరై సందేశాలు ఇస్తారన్నారు. దేశంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల్లో ఖమ్మంలో వందేళ్ళ సభ జరుగుతుందన్నారు. ప్రజల మధ్య మతం పేరుతో ఐక్యతను దెబ్బతీసే ఆర్‌ఎస్‌ఎస్ కూడా వందేళ్ల సభను జరుపుకోబోతుందన్నారు. విప్లవ పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ వచ్చిన నక్సలైట్లు దశలవారీగా ప్రభుత్వానికి సరెండర్ అవుతూ ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు దిశా నిర్దేశం చేసే సిపిఐ వందేళ్ళ ఉత్సవాలకు ప్రత్యేకత ఉందని పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, చంద్రయ్య, రమేష్, రాబర్ట్, మోష, శ్రీహరి, రవీందర్, గోపాల్, గోపాలకృష్ణ, కుతబ్ కుర్మయ్య, కృష్ణవేణి, గీత తదితరులు పాల్గొన్నారు.

# సాహిత్య కళారూపాల రచనలకు ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాజంలోని వివిధ రుగ్మతలను రూపుమాపి, ప్రజలలో పరివర్తన తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం 'ప్రభాతభేరి' అనే నూతన సామాజిక చైతన్య కార్యక్రమాన్ని లాంఛనంగా ఈ నెల 19న ప్రారంభించింది. ఈ కార్యక్రమాలతో ప్రజలలో మార్పు తీసుకువచ్చే దిశగా సృజనకారుల నుండి సృజనాత్మకమైన రచనలను, కళారూపాలను ప్రభుత్వం ఆహ్వానిస్తోందని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను నవంబర్ 10 లోపు తమ రచనలను పంపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పాటగానో, స్కిట్ గానో, ఏకపాత్రగానో, వీధి నాటికగానో, చిందు యక్షగానంగానో, షార్ట్ ఫిలిం గానో, బుర్రకథ గానో, హరికథ గానో, గేయ రూపకం గానో, బ్రీత్ లెస్ సాంగ్ గానో, ఫ్లాష్ మాబ్ గానో లేదా ఇంకా పేరు పెట్టని ఇంకో కళారూపం ఏదైనా గాని, అత్యంత సృజనాత్మకమైన వివిధ కళారూపాల ద్వారా సమాజంలో మార్పు ను తీసుకువచ్చే దిశగా ప్రణాళికలు రూపొందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళాకారులు, కవులు, సాహితీవేత్తలు తమ రచనలను నవంబర్ 10, 2025లోపు హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రాంగణంలోని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో అందజేయవల్సినదిగా సృజనకారులందరికీ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు నర్సింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. నవంబర్ 10లోపు అందిన రచనలను పరిశీలించి వాటిలో ఉత్తమమైన వాటికి బహుమతులు ఇవ్వబడతాయని, ఎంపికైన వాటిని ప్రభుత్వం తరఫున నిర్వహించే కార్యక్రమాలలో వినియోగించుకుంటామని ఆయన వివరించారు. రచనలు పంపవలసిన చిరునామా: కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి, సైఫాబాద్, హైదరాబాద్ – 500004. ఇతర వివరాలకు (ఆఫీస్ పని వేళలో) ఫోన్: 040 2970 3142 సంప్రదించాలని ఆయన తెలిపారు.

**తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (TGIRD)**
రాజేంద్రనగర్, హైదరాబాద్-500030

TGIRDకి "స్టేషనరీ వస్తువులు, జ్యూట్ బ్యాగులు, హౌస్ కీపింగ్ మెటీరియల్, ఎలక్ట్రికల్ & ప్లంబింగ్ వస్తువులను అందించడం" కోసం ఇ-టెండర్ నోటీసు. వివరాల కోసం దయచేసి సంప్రదించండి: 040 - 24018656 / 5959. సందర్శించండి: www.tgird.telangana.gov.in, ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారంలో టెండర్ ఐడి: 637615, 637708, 637711.

సం/- చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

DIPR R.O. No. : 9564-PP/CL/ADVT/1/2025-26, Date: 22-10-2025

## దళారుల వద్దకు వెళ్లొద్దు

ప్రజాపక్షం/బీబీనగర్: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకెపి కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని దళారుల వద్దకు వెళ్లి మోస పోవద్దని భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్య o కొనుగోలు కేంద్రాలను వెంకిర్యాల, పడిగాపురం, రాఘవపురం, రుద్రవెల్లి, పట్టుగూడం, నీలి తండా, మాదారం, రావిపహాడ్, మొదంపల్లి, గొల్లగూడెం, గూడూరు, జైన పెల్లి, కొండమడుగు, నెమురగుముల్లో ఏర్పాటు చేశారు. ఆర్డీఓ కృష్ణారెడ్డి, పిఏసి చైర్మన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి, తహసిల్దార్ శ్యాంసుందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాలో డబ్బులు జమవుతాయని తెలిపారు. అంతేగాక ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2,389,బిగ్రేడ్ ధాన్యానికి రూ. 2,369 చెల్లిస్తుందని, సన్న బియ్యంకు 500 బోనస్ చెల్లిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్లవేళలా రైతులకు సహకరించాలని సూచించారు. సింగిల్ విండో వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణ గౌడ్, డైరెక్టర్లు పంజాల సత్తయ్య గౌడ్, చింతకింది శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

## గురుకుల హాస్టల్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాపక్షం/ రామన్నపేట: మండల పరిధిలోని జనంపల్లి తెలంగాణ గురుకుల పాఠశాల, మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతిగృహం, బీసీ బాలికల వసతిగృహాలను బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జె.సబిత ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అక్కడ విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను పరిశీలించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన వంటలను, వాష్‌రూమ్, టాయిలెట్స్, డార్మెటరీహాల్ క్లీనింగ్ పరిశీలించారు. అనంతరం ఎస్సీ హాస్టల్‌లో కిచెన్, విద్యార్థులకు భోజన సదుపాయం, పడక గదులు, ప్రాంగణ పరిసరాలు పరిశీలించారు. లీగల్ సెల్ సభ్యులు అక్షుల గణేష్, నాగేష్, పారాలు, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## నిరుద్యోగ యువతకు చక్కని అవకాశం

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 25న హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువతీ,యువకులు పెద్ద ఎత్తున తరలిరావాలని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మెగా జాబ్‌మేళా ప్రచారంలో భాగంగా ఉత్తమ్ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ దగ్గుపాటి బాబూరావు సహకారంతో ముద్రించిన కరపత్రాలను మంత్రి ఉత్తమ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ,యువకులకు ఈ మెగా జాబ్ మేళా ద్వారా చక్కని ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని,మెగా జాబ్ మేళాను ఈ ప్రాంత యువతీ,యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కోల సంపత్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ నాయకులు రెడపంగు రాము, కస్తాల రవీందర్, రమేష్ తదితరులున్నారు.

## రైతులను ఆదుకోవాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేలు చొప్పు ననష్టపరిహారంఅందించి రైతులను ఆదుకోవాలని సిపిఐ జిల్లాకార్యవర్గసభ్యులు పోకల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో గరిడేపల్లి మండల తహ శీల్దార్ కార్యాలయం ముందు ధర్నానిర్వహించి తహశీల్దార్ బండ కవితకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం ఎంతో శ్రమించి పండించిన పంటలు మరో 20రోజులలో చేతికి వస్తున్న తరు ణంలో ప్రకృతి కన్నెర్ర చేసి వర్షాలు పడటం వలన మండలంలోని చాలా గ్రామాలలో వరినేలకు ఒరిగి కిందపడిపోవడం జరిగిందని తెలిపారు. సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య,రైతు సంఘం నాయకులు కట్టా నర్సింహారావు, కృష్ణ, యడ్ల అంజిరెడ్డి, ప్రతాని సైదులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల జోలికెళ్లొద్దు



ప్రజాపక్షం/మిర్యాలగూడ: దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిన నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలు అవుతూ కుటుంబాలకు భారంగా మారుతున్నారని, ముఖ్యంగా మాదకద్రవ్యాలకు బానిసలుగా మారితే బతు కు ఛిద్రమవుతుందని జిల్లా కౌన్సిలర్ భరత్ తేజ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా మహిళా అభివృద్ధి, శిశు వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ నల్లగొండ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్, మాదక ద్రవ్యాల వాడకం లేని స్థిరమైన సమాజాన్ని నిర్మించడంలో భాగంగా బుధవారం పట్టణంలోని ఆదిత్య పాఠశాలలోని విద్యార్థులకు ఆయన మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.పాఠశాల కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కట్టా అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దళిత హక్కుల సాధనకై పోరాడాలి

### డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం




ప్రజాపక్షం/నల్లగొండటౌన్ : దళిత అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం ఎస్‌సి, విద్య, సామాజిక వికాసంతో పాటు,ఆర్థికంగా వారు నిలదొక్కుకునేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి(డిహెచ్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షులు కె.యేసు రత్నం కోరారు. బుధవారం నల్లగొండ సిపిఐ జిల్లా కార్యాలయంలో డిహెచ్‌పిఎస్ వార్షికోత్సవ వేడుకలు జిల్లా కన్వీనర్ గోసుకొం డ లింగ య్య అధ్యక్షతన నిర్వహించారు. ఏసు రత్నం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని దళితుల సంక్షేమ కోసం ప్రభుత్వం అమలు చేస్తు న్న సంక్షేమ పథకాల్లో దళితులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన దళితులకు రెండో వ విడుతలో ఇవ్వాలని ఇప్పటికే ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు.ఇందిరమ్మ ఇండ్లలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని అన్నారు. ప్రైవేటు పాఠశాలలో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోవచ్చిన తర్వాత దళిత,గిరిజన,మైనార్టీలపై దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు.డిహెచ్‌పిఎస్ 59 ఉపకులాలకు సంబంధించిందని ఏ ఒక్క కులానికి కాదని తెలిపారు. గత 19 సంవత్సరాల నుండి దళిత హక్కుల కై పోరాడుతుందని భవిష్యత్తులో అన్ని కులాలను ఐక్యం చేసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ వల్లంపట్ల వెంకన్న,ముండ ముత్యాలు, అశోక్, కె ఎస్ రెడ్డి, దోటి పండరి, వీరయ్య పాల్గొన్నారు.

## నిరుద్యోగ సమస్యతో

# గ్రామీణ యువత సతమతం




### రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/సూర్యాపేట : దేశంలోని అన్ని రాష్ట్రాలలో గ్రామీణ యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటుందని, ఉన్నత చదువులు చదివినప్పటికి ఉద్యోగాలు రాక యువత ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సమావేశ మందిరంలో మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గడిచిన 20 నెలల కాలంలో 70 నుండి 75 వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని, ఇటీవల గ్రూప్ 1, గ్రూప్ 2 అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడమే కాకుండా, లైసెన్స్ సర్వేయర్లకు కూడా నియామక పత్రాలు అందించినట్టు చెప్పారు. అంతేకాకుండా ప్రైవేట్ రంగంలోకూడా ఎక్కువ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని దేశ విదేశాల నుండి పెట్టుబడులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రత్యేకించి సూర్యాపేట జిల్లాలోని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో సింగరేణి కాలరీస్, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ సహకారంతో హుజూర్‌నగర్‌లో ఈ నెల 25న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని వివరించారు.జాబ్‌మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువతకుఅన్నిరకాలసౌకర్యాలుఏర్పాటు చేస్తున్నామని అన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువత రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇప్పటి వరకు 12,500 మంది ఉద్యోగాల కోసం రిజిస్టర్ చేసుకోగా, ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోకుండా జాబ్‌మేళాకు వచ్చే అవకాశం ఉందన్నారు. 15వేలమందికి పైగానే నిరుద్యోగ యువత జాబ్‌మేళాకు రానున్నట్లు మేళాకు వచ్చే వారి కోసం అన్నిసౌకర్యాలుకల్పిస్తామని,ప్రత్యేకించి గ్రామీణ ప్రాంత ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు 5 కాపీల రేజ్యూమ్‌తో హాజరుకావాలని సూచించారు. ఈ సమావేశంలో రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్,కొప్పులవేణారెడ్డి, పోతు భాస్కర్, చింతల లక్ష్మీ నారాయణరెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

### నిరుద్యోగులు హాజరయ్యేలా చూడాలి

సూర్యాపేటకలెక్టరేట్ : గ్రామ పాలనాధికారులు, గ్రామ పోలీస్ అధికారులు గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత ఈనెల 25న హుజూర్‌నగర్‌లో జరిగే మెగా జాబ్ మేళాకు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా చొరవ చూపాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ఆర్‌డిఓలు, తహశీల్దార్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఎంపిడిఓలు, గ్రామ పాలనాధికారులు, పంచాయితీ కార్యదర్శులు, గ్రామ పోలీస్ అధికారులతో జాబ్‌మేళాపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గ్రామీణ ప్రాంత తల్లిదండ్రులు పిల్లల్ని కష్టపడి చదివిస్తున్నప్పటికీ ఉద్యోగావకాశాలు సరిగా లేకపోవడం, అవగాహన లేకపోవడం వల్ల వారికి ఉద్యోగ అవకాశాలు సరిగా రావడంలేదన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని తమవంతు ప్రయత్నంగా కొంతవరకైనా నిరుద్యోగ సమస్యను తీర్చాలన్న ఉద్దేశంతో సింగరేణి కాలరీస్, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ సంయుక్త సహకారంతో 25న హుజూర్‌నగర్‌లో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. 250 వరకు కంపెనీలు ఈ మేళాలో పాల్గొనున్నాయని, గ్రామీణ ప్రాంతానికి వెళ్లి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో కంపెనీలు హుజూర్‌నగర్‌కు వస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ కంపెనీలన్ని మన గడప దగ్గరకు వస్తున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు జాబ్‌మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్లు పంపించడం జరుగుతుందని తెలిపారు. జాబ్‌మేళా నిర్వహించే పెద్ద ఇన్నిస్టిట్ ఇంటర్నేషనల్ స్కూల్లో హెల్ప్‌డెస్కులు, రిజిస్ట్రేషన్ డెస్కులు ఏర్పాటు చేస్తున్నామని, హాజరైన వారికి స్వర్ణ వేదిక ఫంక్షన్ హాల్‌లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టిఫిన్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్,జిల్లా ఎస్‌పి కె నరసింహా మాట్లాడారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ డైరెక్టర్ రాజేశ్వర్ రెడ్డి, మినిస్టర్ ఓఎస్‌డి ప్రవీణ్, అదనపు కలెక్టర్ కె సీతారామారావు, ప్రజాప్రతినిధులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్, కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్, చింతల లక్ష్మీ నారాయణరెడ్డి,చకిలం రాజేశ్వర్‌రావుపాల్గొన్నారు.

### ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు కృషి

గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు పెద్ద మొత్తంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గాను ఈనెల 25న హుజూర్‌నగర్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంజనీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్లతో జాబ్‌మేళాపై ఆయన మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలు ఎక్కువ మంది నిరుద్యోగ యువత జాబ్‌మేళాకు హాజరయ్యే విధంగా చూడాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ హుజూర్ నగర్‌లో నిర్వహిస్తున్న జాబ్‌మేళా సూర్యాపేట జిల్లా నిరుద్యోగ యువతకే కాకుండా, ఉమ్మడి నల్లగొండ జిల్లా నిరుద్యోగ యువతకు ఒక చక్కని అవకాశమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కళాశాల ప్రతినిధులు మాట్లాడుతూ మెగా జాబ్‌మేళాకు స్పందన బాగుందని, ఎక్కువ మంది నిరుద్యోగయువతను మేళాకు పంపించేలా సోషల్ మీడియా, ఎస్ఎంఎస్‌ల ద్వారా సమాచారాన్ని అందించడమే కాకుండా అవగాహన కల్పిస్తామన్నారు. డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ డైరెక్టర్ రాజేశ్వర్ రెడ్డి, మినిస్టర్ ఓఎస్‌డి ప్రవీణ్ మాట్లాడారు. జిల్లా ఎస్‌పి నరసింహా, అడిషనల్ కలెక్టర్ కె సీతారామారావు, సింగరేణి ప్రతినిధులు శ్రీధర్, చందర్ డిటి ప్రతినిధి వంశీ, ప్రజాప్రతినిధులురాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్,కొప్పులవేణారెడ్డి, పోతు భాస్కర్, చింతల లక్ష్మీ నారాయణరెడ్డి,చకిలం రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## వృద్ధురాలి హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు



ప్రజాపక్షం/సూర్యాపేట : హుజూర్‌నగర్ పట్టణంకు చెందిన ఒంటరి వృద్ధురాలి హత్య కేసులో ముగ్గురు నింధితులను హుజూర్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.3లక్షల 60వేల విలువైన బంగారం, ప్రామిసరీ నోట్, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా ఎస్‌పి కె నరసింహ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 14 రాత్రి హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ హాస్పటల్ వెనుక గల ఇంట్లో చెన్న అనసూర్యమ్మ (60) అనుమానాస్పదంగా మృతి చెందిన సమాచారం మేరకు పోలీసులు విచారించి మొదటగా అనుమానాస్పద కేసుగా నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ శివ పంచానామా చేసే సమయంలో శరీరంపై రక్తపు గాయం గుర్తించి ఆమె పెద్ద కుమారుడు చెన్న వేణు వారణాసి వంట పనికి వెళ్ళి వచ్చిన తరువాత అతని వాంగ్మూలం, సాంకేతిక సమాచారం సేకరించి హత్య, దొంగతనం కేసుగా నమోదు చేసినట్లు వివరించారు. ధర్యాప్తులో భాగంగా మృతురాలికి పరిచయం ఉన్న వ్యక్తి హుజూర్‌నగర్ పట్టణంకు చెందిన లింగం సతీష్ ఆమె వద్ద రూ.50వేలు అప్పుగా తీసుకొని మిత్తి చెల్లిస్తున్నట్లు, తరచూ ఆమె వద్దకు వస్తున్నట్లు గుర్తించి విచారణ చేయగా పథకం ప్రకారం హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు చెప్పారు. 14 రాత్రి లింగం సతీష్ అతని మేనల్లుడు మైనర్ బాలుడు కలిసి అనసూర్యమ్మ ఇంటికి వెళ్ళి మద్యం ఇచ్చి త్రాగిన మత్తులో ఉన్న ఆమెను నోరు, ముక్కు చేతులతో మూసి మైనర్ బాలుడు కాళ్ళను పట్టుకోగా ఆమె ఊపిరాడక మరణించిందన్నారు. వారిద్దరు ఆమె చెవులకు ఉన్న బంగారు దిద్దులు, మాటీలు, ఆమె బొడ్డు సంచిలో గల బంగారు ఉంగరం, నాను తాడు దొంగిలించి, అప్పుగా తీసుకున్న ప్రామిసరీ నోట్ కూడా దొంగిలించినట్లు తెలిపారు. అట్టి బంగారాన్ని లింగం మౌనికకు చూపించగా ఆమె సలహా మేరకు విజయవాడకు వెళ్ళి బంగారాన్ని కరిగించి వారి వద్ద ఉంచుకున్నట్లుచెప్పారు. వారిని పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద ఉన్న బంగారాన్ని, ప్రామిసరీ నోట్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. త్వరితగతిన కేసును ధర్యాప్తు చేసి నింధితులకు శిక్షలు పడేలా కృషి చేస్తామని తెలిపారు. నేరాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఏనాటికైనా శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఎవరు కూడా నేరాలకు పాల్పడవద్దని సూచించారు. అనంతరం సిబ్బందికి రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో హుజూర్‌నగర్ సిఐ చరమందరాజు, సిబ్బంది ఉన్నారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్



ప్రజాపక్షం/ఆలేరు : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆలేరు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం లోఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి ప్రజలకు అనేక హామీలుఇచ్చి గద్దెనెక్కిన తర్వాత హామీలను విస్మరించారన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ నెరవేర్చేంతవరకు ప్రభుత్వంపై ఉద్యమిస్తామన్నారు. బీసీలకు వెంటనే 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్లపై రేవంత్‌రెడ్డి రెండు కాళ్ల సిద్ధాంతాన్ని అవలంబిస్తున్నారని ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసినా 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ప్రభుత్వం కల్పించేంతవరకు పోరాడుతామన్నారు. అర్హులైన పేదవారందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఐకెపి సెంటర్లలో ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. అకాల వర్షం కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. పోతు ప్రవీణ్, తెడ్డు ఆంజనేయులు,ధారా వోదయ, పరశురాములు, రాజు, సిపిఐ ఆలేరు మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, గొట్టిపాముల శ్రీనివాసరావు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నల్లగొండ: ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.బుధవారం ఆమె నల్లగొండ మండలం ముషం పల్లి,జికే అన్నారం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అధికారులతో సమీక్షించారు. ఎక్కువ రోజులు కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం ఉండడం వల్ల వర్షానికి తడిసిపోయే ప్రమాదం ఉందని, అందువల్ల వచ్చిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేసి, తేమను చూసి సరైన ప్రమాణాలతో ఉంటే తక్షణమే కొనుగోలు చేసి అప్పటికప్పుడే మిల్లులకు పంపించాలని చెప్పారు.నాణ్యతతో కూడుకున్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కనగల్ మండలం, పర్వతగిరి గ్రామంలోని వెంకట సాయి రైస్ మిల్లును తనిఖీ చేసి ధాన్యం ఎగుమతి, దిగుమతులను వేగవంతం చేయాలన్నారు .రెవెన్యూ అదనపు కలెక్టర్ జే .శ్రీనివాస్,ఆర్‌డిఓవై. అశోక్ రెడ్డి, ధాన్యంసేకరణ జిల్లాప్రత్యేక అధికారి నాగేశ్వరరావు, మార్కెటింగ్ శాఖ ఏడి ఛాయాదేవి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్, డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,పత్యా నాయక్, కనగల్ తహసిల్దార్ పద్మఉన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



### ఎమ్మెల్యే మందుల సామేలు

ప్రజాపక్షం/అడ్డగూడూరు : రైతు సంక్షేమమే ప్రజాప్రభుత్వం లక్ష్యం అని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండలంలోని ధర్మారం, చౌల్లరామారం, కోటమర్తి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఎమ్మెల్యే మందుల సామేలు ముఖ్య అథిదులుగా పాల్గొని ప్రారంబించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజాప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు పెద్దపీట వేసి రైతులకు ఉచిత విద్యుత్, సన్నధాన్యంకు బోనస్, రైతు భరోసా, రుణమాఫీ అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుంది అని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఆరబెట్టి తీసుకునిరావాలని కోరారు నిర్వహకులు రైతులకు ఇబ్బందులు లేకుండా తేమలేని ధాన్యం వెంటనే కాంటాలు వేయాలని చూచించారు. అధికారులు రైతులు, నిర్వహకులు సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా నిర్వహణ చేయాలని కోరారు కొనుగోలు కేంద్రాల సెంటర్లను కలిసి వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేయడం జరిగింది. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. చెరువులు కుంటలు నిండి వాగులు పొంగి పొర్లాయి వరి దిగుబడి మంచిగా ఉంది రైతులు వర్షాలు కురుస్తున్నాయి తగుజాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపిడివో శంకరయ్య, ఏపిఎం కళావతి, పిఏసిఎస్ చైర్మన్ నిరంజన్ రెడ్డి, వైస్ చైర్మన్ చేడే చంద్రయ్య, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నిమ్మనగోటి జోజి, కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు బొమ్మగాని అంజమ్మ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాశం సత్యనారాయణ, ఇటికాల చిరంజీవి, బాలెంల సైదులు, బాలెంల విద్యాసాగర్, మత్యాస్ రెడ్డి, బొమ్మగాని లక్ష్మ య్య తదితరులు పాల్గొన్నారు.

### స్వంత గ్రామంలో పాఠశాలకు శంకుస్థాపన



అడ్డగూడూరు : మండలంలోని ధర్మారం గ్రామంలో ఎమ్మెల్యే మందుల సామేలు స్వంత గ్రామంలో పాఠశాల నూతన భవణానికి బుధవారం కోటి రూపాయల వ్యయంతో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తన స్వంత గ్రామంలో పాఠశాల శిదిలావ్యవస్థలో ఉండటంతో ఉన్న ఊరిలో పాఠశాల కోటిరూపాయల వ్యయంతో మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, అధికారులు, నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మూతపడిన సాగర్ రవాణా శాఖ సరిహద్దు తనిఖీ కేంద్రం

ప్రజాపక్షం/నందికొండ:నాగార్జునసాగర్ లోని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖకు చెందిన సరిహద్దు తనిఖీ కేంద్రాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి నుంచి మూసివేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఇక్కడ సరిహద్దు తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ కీలక నిర్ణయంతో వర్షాకాలంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని వాహనాల రాకపోకలు సులభతరం అవుతాయని అధికారులు తెలిపారు. గతంలో చెక్‌పోస్టుల వద్ద జరిగే తనిఖీలు, పన్నుల వసూళ్ల వల్ల ప్రయాణికులు, రవాణాదారులు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు ఈ సమస్యకు ముగింపు పలికి.. సరుకు రవాణా, వాణిజ్య కార్యకలాపాలు వేగవంతం కానున్నాయి. భవిష్యత్తులో ఈ టెక్నాలజీ, సీసీటీవీ పర్యవేక్షణ ద్వారా వాహనాల తనిఖీలను మరింత పారదర్శకంగా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.గతంలో రాష్ట్రంలో దాదాపు చాలా వరకు తనిఖీ కేంద్రాలు మూసివేయగా బుధవారం నాగార్జునసాగర్ తనిఖీ కేంద్రాన్ని మూసివేశారు.ఇకపై రాష్ట్రంలో రవాణా తనిఖీ కేంద్రాలు కనిపించవు.రోడ్డు మార్గం ద్వారా వెళ్లే వాహనాలకు సరుకు రవాణా సమయాన్ని తగ్గించడమే కాకుండా రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. జీఎస్టీ అమలు తర్వాత తనిఖీ కేంద్రాలతో అవసరం లేదని కేంద్రం ఇప్పటికే స్పష్టమైన సూచనలు ఇచ్చింది. దీనికి అనుగుణంగా పలు రాష్ట్రాలు తమ చెక్‌పాయింట్లను ఎత్తివేయగా తాజాగా నాగార్జునసాగర్ కూడా ఈ జాబితాలో చేరింది. ఇక నుంచి రవాణా శాఖకు చెందిన అన్ని సేవలు ఆన్లైన్లో లభ్యం కానున్నాయి.

## మాతృ మరణాలు లేకుండా జాగ్రత్తలు

### కలెక్టర్ హనుమంతరావు




ప్రజాపక్షం/యాదాద్రి : జిల్లాలో మాతృ మరణాలు జరగకుండా గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి గర్భిణీలకు తగు సూచనలు, సలహాలు, చికిత్స అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు వైద్య ఆరోగ్యశాఖ వైద్యులను, సిబ్బందికి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మాతృ మరణాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో అయన పాల్గొని సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాతృ మరణాలు సంభవించకుండా గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. గర్భిణీల (జనన పూర్వ సంరక్షణ సేవలు) మెరుగుపరచాలని, గర్భిణీల ఆరోగ్యం పై ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఫాలో అప్ చేయాలన్నారు. హై రిస్క్ గర్భిణీలను గుర్తించి వారి వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లాలో జరిగిన మాతృ మరణాలలో 4 మాతృ మరణాలపై సమీక్ష జరిపారు.అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మనోహర్, జిల్లా ఉప వైద్యాధికారి చౌటుప్పల్ డివిజన్, పోగ్రామ్ ఆఫీసర్ ఎంహెచ్ఎన్ డాక్టర్ యశోద, డిప్యూటీ డాక్టర్ శిల్పిని, భువనగిరి డివిజన్ డాక్టర్ ఇంద్రాణి స్త్రీ వైద్య నిపుణురాలు, డాక్టర్ కవిత పీడియాట్రిషన్, డాక్టర్ ప్రభాకర్ ఐఎంఏ ప్రెసిడెంట్, డిసిహెచ్ఎస్ డాక్టర్ చిన్నా నాయక్, తదితరులున్నారు.

## ఉచిత కంటి వైద్య పరీక్షలు అభినందనీయం



ప్రజాపక్షం/రామన్నపేట: గ్రామీణ పేదలకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని దాతలు ముందుకు వచ్చి అనేక గ్రామాల్లో పేదలకు కంటిచూపు అందించాలని ఎమ్మెల్యే వేముల వీరేశం, జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మునిపంపుల గ్రామంలో దేవిరెడ్డి రాంరెడ్డి జ్ఞాపకార్థంగా శంకర్ నేత్రాలయ కంటి ఆసుపత్రి డాక్టర్లతో దేవిరెడ్డి సావిత్రమ్మ, వీరేందర్‌రెడ్డి ఆర్థిక సహకారంతో ఉచిత కంటి పరీక్ష శిబిరం ప్రారంభించారు.సుమారు 14 గ్రామాలకు 8 రోజులపాటు నిర్వహించే ఉచిత కంటి పొర చికిత్స శిబిరం ప్రారంభోత్సవం భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించడం జరిగింది.ఎమ్మెల్యే వేముల వీరేశం, జిల్లా కలెక్టర్ హనుమంతరావులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యల్లో కంటిచూపు సమస్య ఒకటని కనీసం వైద్యం చేయించుకోవడానికి గ్రామీణ ప్రజల దగ్గర డబ్బులు లేక, కనీస అవగాహన లేక కంటి చూపు మందగించి దీర్ఘకాలికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మనోహర్, ఎస్పీ గుమ్మి చక్రవర్తిరెడ్డి, నిర్వాహకులు దేవిరెడ్డి సావిత్రమ్మ, దేవిరెడ్డి పద్మ, వీరేందర్‌రెడ్డి, టాస్క్ ఛైర్మన్ సింగిరెడ్డి రాఘవేందర్, పీడీ ఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్ లాల్ బహదూర్, ఎంపీడీవో రాములు, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సింగిరెడ్డి మల్లారెడ్డి, గుమ్మిరెడ్డి రాంరెడ్డి, వెంగల్‌రెడ్డి, నేత్రాల కోఆర్డినేటర్ భానుప్రకాశ్, సభాధ్యక్షులు తొలుపునూరి చంద్రశేఖర్, నిర్వాహకులు గాదె శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ఢిల్లీని కమ్మేసిన దట్టమైన పొగ... క్షీణించిన గాలి నాణ్యత

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకీ క్షీణిస్తోంది. దీపావళి అనంతరం గాలి కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రకారం ... బుధవారం ఉదయం ఢిల్లీలో వాయు కాలుష్యం అధ్వాన స్థితికి చేరింది. ఏక్యూఐ లెవెల్స్ 345గా నమోదయ్యాయి. అశోక్ విహార్, బవానా, దిల్షాద్ గార్డెన్ ప్రాంతాల్లో ఏక్యూఐ 380గా నమోదైంది. డీటీయూ, ఎయిర్‌పోర్ట్, లోధి రోడ్డు సహా ఇతర ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ 300 కంటే ఎక్కువగానే నమోదైంది. మరోవైపు రాజధాని ప్రాంతాన్ని దట్టమైన పొగ కమ్మేసింది. దీంతో ముందు వెళ్తున్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం... గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించవచ్చు.

# ప్రతిపక్షం ఐక్యంగా ఉంది

మహాగట్బంధన్‌లో వివాదాల్లేవ్

24 గంటల్లో అన్నీ సర్దుకుంటాయి

బీహార్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్

**పట్నా:** మహాగట్బంధన్‌లో విభేదాలున్నాయని వచ్చిన ఊహాగానాలను ఆర్‌జెడి నాయకుడు, బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ తోసిపుచ్చారు. కూటమిలో ఎటువంటి వివాదాలు లేవని పేర్కొన్నారు. గురువారం కల్లా అన్ని సర్దుకుంటాయని చెప్పారు. ఈ మేరకు ఆయన బుధవారం జరిగిన మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. తేజస్వి మాట్లాడుతూ... ''ప్రతిపక్ష కూటమి మహాఘట్బంధన్‌లో ఎటువంటి వివాదాలు లేవు, రేపటికి అన్నింటికి సమాధానాలు లభిస్తాయి. కాంట్రాక్టు ఉద్యోగులు అన్ని ప్రభుత్వ సేవలను అందిస్తున్నా దోపిడీకి గురవుతున్నారు. వారిని కారణం తెలియజేయకుండానే ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేస్తాం. వారికి శాశ్వత ప్రభుత్వ సిబ్బంది హోదా ఇవ్వడానికి మేము కృషి చేస్తాం'' అని తేజస్వీ యాదవ్ తెలిపారు.

బీహార్‌కు ఆర్థిక న్యాయం అవసరమని తేజస్వీ యాదవ్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే నామినేషన్ దాఖలు ప్రక్రియ పూర్తయిందని, అక్టోబర్ 24 నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈసారి, బీహార్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో బీహార్ ప్రజలు విసుగు చెందారు. డబుల్ ఇంజిన్ పాలనలో అవినీతి, నేరాలు పెరిగాయి. నిరుద్యోగం, వలసలతో బీహారీలు విసుగు చెందారు. ప్రస్తుత ప్రభుత్వం మేం గతంలో ఇచ్చిన హామీలను కాపీ చేస్తోంది'' అని తేజస్వి విరుచుకుపడ్డారు.

**ఓట్ల కోసమే 'మై బహిన్ మాన్ యోజన'**

ఎన్నికల వేళ ఎన్‌డీఏ ప్రభుత్వం 'మై బహిన్ మాన్ యోజన' కింద రాష్ట్రంలోని మహిళలకు రూ. 10 వేలు పంపిణీ చేయడాన్ని తేజస్వి తప్పుపట్టారు. ఈ నగదును లంచంగా అభివర్ణించారు. ''బీహార్‌లో మహాగట్బంధన్ అధికారంలోకి వచ్చిన తర్వాత కమ్యూనిటీ సమీకరణకర్తలుగా పనిచేసే జీవికా దీదీలకు ప్రభుత్వ ఉద్యోగుల హోదా ఇస్తాం. వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తాం. జీవికా దీదీల జీతాన్ని నెలకు రూ.30,000కు పెంచుతాం. జీవికా దీదీలకు రూ.2వేలు అదనపు అలవెన్స్‌ను అందిస్తాం. రూ.5లక్షలకు జీవిత బీమా కల్పిస్తాం. జీవికా దీదీలు తీసుకున్న రుణాలపై వడ్డీని మాఫీ చేస్తాం. రాబోయే రెండేళ్లు వడ్డీ లేని రుణాలను వారికి ఇస్తాం. జీవికా దీదీలు లేకుండా గ్రామాలు లేదా నగరాల్లో ఏ పని సాధ్యం కాదు. అయితే, వారికోసం ఎన్‌డీఏ సర్కార్ ఏమీ చేయలేదు. అందుకే వారికి మహాఘట్బంధన్ సర్కార్ సాయం చేస్తుందని తేజస్వీ యాదవ్ పేర్కొన్నారు. బీహార్ ప్రజలు అవినీతి, వలసలు, నిరుద్యోగం, పెరుగుతున్న నేరాలు వంటి సమస్యలపై నితీశ్ కుమార్ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్‌పై విసిగిపోయారని తేజస్వీ యాదవ్ విమర్శించారు. అందుకే బీహారీలు తమ మనసులో మార్పు కోరుకుంటున్నారన్నారు. బీహార్ లో మహాగట్బంధన్ ప్రభుత్వం ఏర్పడితే రాష్ట్రంలోని మహిళల కోసం 'భేటీ', 'మా' పథకాలను ప్రవేశపెడతామని ప్రకటించారు. బీహార్‌కు ఇప్పుడు కావాల్సింది ఆర్థిక న్యాయం'' అని తేజస్వి పేర్కొన్నారు.



**ప్రజాతీర్పుపై తీవ్ర ఉత్కంఠ**

బీహార్‌లో రెండు విడతల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. నవంబరు 6న మొదటి విడత, నవంబరు 11న రెండో విడత జరగనుంది. అదేనెల 14న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఇప్పటికే ఎన్డీఏ,మహాగట్బంధన్ భాగస్వామ్య పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. చాలామంది అభ్యర్థులు తమనియోజకవర్గాల్లో ప్రచారం చేస్తున్నారు. యువజన సంక్షేమం, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆర్‌జేడీ నేత తేజస్వియాదవ్ ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఇదే సమయంలో కుల సమీకరణాలపైనా మహాగట్బంధన్ దృష్టి సారిస్తోంది. మరోవైపు ఎన్‌డీఏ కూటమి అభివృద్ధి, సుస్థిరత అంశాలను నినాదంగా మార్చుకుంది. రాష్ట్ర వికాసం కోసం మళ్లీ తమ కూటమినే గెలిపించాలని బిజెపి, జెడియు ఎల్‌జెపి నేతలు ఓటర్లను కోరుతున్నారు. తొలి ఎన్నికల్లో సత్తా చాటుకోవాలని జన్ సురాజ్ పార్టీ భావిస్తోంది. ఈఎన్నికల్లో బీహార్ ప్రజలు ఎవరి వైపు నిలుస్తారు? ఎలాంటి తీర్పు ఇస్తారు? అనేది తెలియాలంటే కొన్ని వారాలు వేచి చూడాల్సిందే.

## 8 చోట్ల కూటమి భాగస్వాముల స్నేహపూర్వక పోటీ

**పట్నా :** బిహార్‌లో పోలింగ్ సమయం మంచుకొస్తున్నా ఇండియా కూటమిలో ఇంకా ఏకాభిప్రాయం కుదరడం లేదు. సీట్ల పంపకాలపై అంతర్గత విభేదాలు ఉన్నందున దాదాపు 8 నియోజకవర్గాల్లో కాంగ్రెస్, ఆర్‌జెడి, వామపక్షాలు ఒకదానికొకటి స్నేహపూర్వక పోటీకి దిగాయి. ప్రతిపక్ష కూటమి భాగస్వాములు కలిసి పోటీ చేసే అసెంబ్లీ నియోజకవర్గాల్లో నర్కటియాగంజ్, వైశాలి, రాజపాకర్, రోసెరా, బచ్వారా, కహల్గావ్, బిహార్‌షరీఫ్, సికందర ఉన్నట్లు ఆర్‌జెడి, కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కాంగ్రెస్ 61 స్థానాల్లో పోటీ చేస్తుండగా, ఆర్‌జెడి 143 మంది అభ్యర్థులను నామినేట్ చేసింది. సిపిఐ తొమ్మిది నియోజకవర్గాల్లో పోటీ చేస్తుండగా, సిపిఐ(ఎం) నాలుగు స్థానాల్లో బరిలో ఉంది. 2020లో Bమహాఘట్‌బంధన్'లో అత్యుత్తమ స్ట్రైక్ రేట్‌ను కలిగి ఉన్న సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ 19 స్థానాల్లో పోటీ చేసి 12 స్థానాల్లో గెలిచింది, ఈసారి 20 అసెంబ్లీ విభాగాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. నార్కటియాగంజ్ స్థానంలో ఆర్‌జెడి అభ్యర్థి దీపక్ యాదవ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి శాశ్వత్ కేదార్ పాండే పోటీ చేస్తుండగా, వైశాలిలో కాంగ్రెస్ అభ్యర్థి సంజీవ్ సింగ్, ఆర్‌జెడి అభ్యర్థి అజయ్ కుమార్ కుష్వా మధ్య పోటీ జరుగుతోంది. రాజపాకర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రతిమ కుమ్రీ, సిపిఐ అభ్యర్థి మోహిత్ పాశ్వాన్, బచ్వారా స్థానంలో సిపిఐ అభ్యర్థి అబ్దేష్ కుమార్ రాయ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి శివ ప్రకాష్ గరీబ్ దాస్ పోటీ చేస్తున్నారు. బిహార్‌షరీఫ్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి ఒమైర్ ఖాన్, సిపిఐ అభ్యర్థి శివ కుమార్ యాదవ్ మధ్య పోటీ జరుగుతోంది. పరిణామాలపై ఆర్‌జెడి రాష్ట్ర యూనిట్ ప్రతినిధి మృత్యుంజయ్ తివారీ పిటిఐతో మాట్లాడుతూ, ఇండియా కూటమిలో కూటమి భాగస్వాములు తమ పార్టీ బలాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. ఆర్‌జెడి బిహార్, పొరుగు రాష్ట్రాలలో మాత్రమే పోటీ చేసే పార్టీ అని, తాము దక్షిణాది లేదా ఇతర రాష్ట్రాలలో తమ భాగస్వాముల నుండి సీట్లు డిమాండ్ చేయమని చెప్పారు. అందువల్ల బిహార్‌లో గరిష్ట సంఖ్యలో సీట్లలో పోటీ చేయడానికి అర్హులమని ఆయన పేర్కొన్నారు. ఆర్‌జెడి ఇప్పటికే అభ్యర్థులను నిలబెట్టిన స్థానాల నుండి తమ అభ్యర్థులను ఉపసంహరించుకోవాలని ఇండియా కూటమి అభ్యర్థులకు విజ్ఞప్తి చేశారు. దీనిపై బిహార్ కాంగ్రెస్ ప్రతినిధి అసిత్ తివారీ స్పందిస్తూ, తాము ఎల్లప్పుడూ సంకీర్ణ ధర్మాన్ని అనుసరిస్తున్నామని, కాంగ్రెస్ ఇప్పటికే తమ అభ్యర్థుల జాబితాను ప్రకటించిన తర్వాత ఆర్‌జెడి, వామపక్షాలు తమ అభ్యర్థులను నిలబెట్టాయన్నారు. ఒకటి లేదా రెండు రోజుల్లో అన్నీ సర్దుకుంటాయని ఆశిస్తున్నానన్నారు.

## బీహార్‌లో ప్రతిపక్ష కూటమి

# గెలుపు ఎంతో ముఖ్యం

కాంగ్రెస్ నేత అశోక్ గెహ్లాట్

ఆర్‌జెడి అధినేత లాలూతో భేటీ

సీట్ల సర్దుబాటుపై చర్చలు ముమ్మరం

అన్ని ప్రశ్నలకూ నేడు సమాధానం చెబుతామని వెల్లడి




**పట్నా:** మహాగట్బంధన్‌లో సీట్ల సర్దుబాటుపై చర్చలు ముమ్మరమయ్యాయి. కొన్ని స్థానాల్లో కూటమికి చెందిన కాంగ్రెస్, ఆర్‌జెడి, వామపక్ష పార్టీల మధ్యే పోటీ నెలకొంది. ఈ క్రమంలోనే ఆర్‌జెడితో నెలకొన్న విభేదాలకు తెరదించేందుకు కాంగ్రెస్ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ సిఎం అశోక్ గెహ్లాట్ రంగంలోకి దిగారు. బుధవారం ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్‌తో సమావేశమయ్యారు. ''బీహార్‌లో ప్రతిపక్ష కూటమి గెలవడం ఎంతో ముఖ్యం. మహారాష్ట్రలో 'మహావికాస్ అఘాడీ' ఓటమి తర్వాత వస్తున్న ఎన్నికలు ఇవి. బీహార్ ఎన్నికలు జాతీయ రాజకీయాలను ప్రభావితం చేస్తాయి. సమాజంలో విభజనలకు కారణమైన, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిన ఎన్డీయేను ఓడించాల్సిన అవసరం ఉంది. బీహార్ ప్రజలు ఈ పని చేయగలరు'' అని లాలూతో భేటీ అనంతరం గెహ్లాట్ మీడియాతో మాట్లాడారు. ఎన్నికల పొత్తులపై గురువారం మీడియా సమావేశం నిర్వహించనున్నామని, అన్ని ప్రశ్నలకు సమాధానం చెబుతామన్నారు.

**సిఎం అభ్యర్థిపై వ్యాఖ్యకు నిరాకరణ**

ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్‌ను సిఎం అభ్యర్థిగా ప్రకటించేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందా? అనే ప్రశ్నకు నేరుగా సమాధానం ఇచ్చేందుకు గెహ్లాట్ నిరాకరించారు. ''రాహుల్‌గాంధీ, తేజస్వీ యాదవ్ మధ్య మంచి అనుబంధం ఉంది. బీహార్‌లో ఇటీవల నిర్వహించిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో ఇది నిరూపితమైంది. ఇరునేతలు రాష్ట్రమంతా పర్యటించారు. వారు సరైన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటారు'' అని తెలిపారు. ఎన్డీయే కూటమిలో తమకన్నా ఎక్కువ విభేదాలు ఉన్నాయని విమర్శించారు. బీహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 143 సీట్లలో ఆర్‌జెడి, 61 సీట్లకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించాయి. దాదాపు ఐదు నియోజకవర్గాల్లో ఈ రెండు పార్టీల అభ్యర్థులూ బరిలో ఉన్నారు. మరో మూడు సీట్లలోనూ సొంత కూటమి అభ్యర్థులపై హస్తం పార్టీ పోటీకి దిగింది. అంతకుముందు పట్నా విమానాశ్రయంలో గెహ్లాట్ ఈవ్యవహారంపై మాట్లాడుతూ.. ఐదు పది సీట్లలో స్నేహపూర్వక పోటీ పెద్ద విషయం కాదని వ్యాఖ్యానించారు.

**కూటమి పక్షాలు అర్థం చేసుకోవాలి: ఆర్‌జెడి**

ఆర్‌జెడి నాయకుడు మత్యుంజయ్ తివారీ మాట్లాడుతూ... ఇండియా కూటమిలోని భాగస్వాములు తమను అర్థం చేసుకోవాలని కోరుతున్నానన్నారు. తమది పెద్ద పార్టీ కాబట్టి.. బీహార్‌లో ఎక్కువ సీట్లలో పోటీ చేసే అర్హత తమకు ఉందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి ప్రకటించిన అభ్యర్థుల స్థానాల నుంచి కూటమిలోని ఇతర పార్టీలు తమ అభ్యర్థులను ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇకే, ఇదే విషయంపై బీహార్ కాంగ్రెస్ ప్రతినిధి అసిత్ తివారీ మాట్లాడుతూ... తాము ఎల్లప్పుడూ సంకీర్ణ ధర్మాన్ని అనుసరిస్తామన్నారు. తొలుత తాము ప్రకటించిన తర్వాతే... ఆర్జేడీ, వామపక్ష పార్టీలు వారి అభ్యర్థులను ప్రకటించారన్నారు. మరికొన్ని రోజుల్లో ఈ విషయంలో సర్దుబాట్లు జరుగుతాయని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. కాగా కాంగ్రెస్ 61 స్థానాల్లో పోటీకి దిగింది. ఆర్‌జెడి 143 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించగా.. ..సిపిఐ తొమ్మిది, సిపిఎం నాలుగు స్థానాల్లో బరిలోకి దిగాయి.

## శబరిమలలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**తిరువనంతపురం:** శబరిమల అయ్యప్ప స్వామిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దర్శించుకున్నారు. పంబ నుంచి బుధవారం ఉదయం ఇరుముడితో ఆలయానికి ఆమె చేరుకున్నారు. ఇరుముడితో 18 మెట్లు ఎక్కి అయ్యప్పను దర్శించుకున్నారు. అక్కడ ఇరుముడి సమర్పించి.. ప్రత్యేక పూజలు చేశారు. శబరిమల ఆలయాన్ని సందర్శించిన తొలి రాష్ట్రపతిగా ఆమె నిలిచారు.

**కుంగిన హెలిప్యాడ్... రాష్ట్రపతి సురక్షితం**



రాష్ట్రపతి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కిందికి దిగుతుండగా హెలిప్యాడ్ ఉన్నట్టుండి కుంగిపోయింది. దీంతో హెలికాప్టర్ చక్రం అందులో ఇరుక్కుపోయింది. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది రాష్ట్రపతిని సురక్షితంగా హెలికాప్టర్ నుంచి దించారు. అనంతరం ఆమె రోడ్డు మార్గంలో పంబకు బయల్దేరారు. వాస్తవానికి రాష్ట్రపతి ముర్ము హెలికాప్టర్ పంబ సమీపంలోని నీలక్కల్ వద్ద దిగాల్సింది. అయితే, ప్రతికూల వాతావరణం కారణంగా ల్యాండింగ్ స్థలాన్ని ప్రమాదం ప్రాంతానికి మార్చారు. మంగళవారం రాత్రే ఇక్కడ హెలిప్యాడ్‌ను నిర్మించారు. దీంతో కాంక్రీట్ పూర్తిగా ఎండలేదు. బుధవారం ఉదయం హెలికాప్టర్ దిగిన తర్వాత ఆ బరువును మోయలేక అది కుంగిపోయింది అని సీనియర్ పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. కేరళలో నాలుగు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రపతి మంగళవారం సాయంత్రం తిరువనంతపురం చేరుకున్నారు. బుధవారం ఉదయం పథనంథిట్టకు వచ్చారు. ఈ క్రమంలోనే రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో హెలికాప్టర్ దిగుతుండగా... హెలిప్యాడ్ కుంగిపోయింది.


# ఎఐ కంటెంట్‌కు లేబులింగ్

జనరేటివ్ ఎఐ, డీప్‌ఫేక్ టెక్నాలజీల దుర్వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా ఐటీశాఖ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ : జనరేటివ్ ఎఐ, డీప్‌ఫేక్ టెక్నాలజీల దుర్వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. బుధవారం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యంతర మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) రూల్స్, 2021కి పలు సవరణలు ప్రతిపాదిస్తూ, ఓముసాయిదాను విడుదల చేసింది. దీని ప్రకారం, సోషల్ మీడియా వేదికల్లో కృత్రిమంగా రూపొందిన కంటెంట్‌ను స్పష్టంగా లేబులింగ్ చేయాల్సి ఉంటుంది. సింపుల్‌గా చెప్పాలంటే, కృత్రిమమేధ (ఎఐ) ద్వారా తయారు చేసిన కంటెంట్, డీప్‌ఫేక్ కంటెంట్ అని సదరు వీడియో లేదా ఆడియో గురించి స్పష్టంగా చెప్పాల్సి ఉంటుంది. ఇందుకోసం సోషల్ మీడి యా ప్లాట్‌ఫారమ్స్ ఇంటర్‌మీడియరీస్ (ఎస్ఎస్ఎంఐ) తప్పనిసరిగా లేబులింగ్, మెటాడేటా ట్యాగింగ్, విజిబిలిటీ ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది. వీడియో అయితే కనిపించే విధంగా, ఆడియో అయితే వినిపించే విధంగా ఎఐ, డీప్‌ఫేక్ కంటెంట్ అని స్పష్టంగా లేబుల్ చేయవలసి ఉంటుంది. భారత్‌లో 5 మిలియన్లకు పైగా నమోదిత వినియోగదారులు కలిగిన ఎస్ఎస్ఎంఐలు ఉన్నాయి. వీటిలో ఫేస్‌బుక్, యూట్యూబ్, స్నాప్ మొదలైన ప్లాట్ ఫారమ్స్‌లు 2021 ఐటీ నిబంధనల ప్రకారం అదనపు సమ్మతికి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

**లేబులింగ్ ఎలా ఉండాలంటే?**

ప్రతిపాదిత ఐటి నియమం 3(3) ప్రకారం, కృత్రిమంగా (సింథటిక్) తయారు చేసిన కంటెంట్‌ను సృష్టించడానికి వీలు కల్పించే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు కొన్ని నిబంధనలను కచ్చితంగా పాటించాలి. అవి ఏమిటంటే, ఎఐ, డీప్‌ఫేక్ కంటెంట్‌కు కచ్చితంగా 'శాశ్వతమైన ప్రత్యేక మెటా డేటా లేదా ఐడెంటిఫైయర్'తో లేబులింగ్ పొందుపరిచేలా చూసుకోవాలి. పైగా ఆ ఐడెంటిఫైయర్ స్పష్టంగా కనిపించేలా లేదా వినగలిగేలా ఉండాలి. ముఖ్యంగా 'విజువల్ డిస్‌ప్లే (వీడియో లేదా ఇమేజ్) అయితే దాని ఉపరితల వైశాల్యంలో కనీసం 10 శాతం ఐడెంటిఫైయర్ కనిపించాలి. ఒకవేళ అది ఆడియో అయితే దాని మొత్తం వ్యవధిలో కనీసం 10 శాతాన్ని కవర్ చేసేలా ఉండాలి. అంతేకాదు మెటా డేటా లేదా ఐడెంటిఫైయర్‌ను మార్చకూడదు. సప్రెస్ చేయ డం (అణచివేయడం), తీసివేయడం లాంటివి చేయకూడదు' అని ముసాయిదా నియమాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు సింథటిక్ కంటెంట్ సృష్టించడానికి లేదా సవరించడానికి వీలు కల్పించే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు అప్‌లోడ్ చేసిన కంటెంట్ ఎఐ ద్వారా సృష్టించబడిందని ధ్రువీకరించడానికి, ప్రకటించడానికి తగి సాంకేతిక మార్పులు, చర్యలు తీసుకోవాల్సి ఉం టుంది అని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పేర్కొంది.



**తప్పుడు సమాచారం అరికట్టడమే లక్ష్యం!**

ఎఐ, డీప్‌ఫేక్ ద్వారా నడిచే తప్పుడు సమాచారాన్ని అరికట్టడం, ప్రజలను వంచనకు గురికాకుండా తప్పించడం, ఎన్నికల ఫలితాలను తారుమారు చేసే పరిస్థితులను నివారించడమే లక్ష్యంగా ఈ తాజా ప్రతిపాదనలు చేసినట్లు ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ తెలిపింది. ఓపెన్‌గా, సురక్షితమైన, విశ్వసనీయమైన, జవాబుదారీ ఇంటర్నెట్‌ను నిర్వహించడానికి ఈ చర్యలు తప్పనిసరి అని పేర్కొంది. అంతేకాదు, ఈ ముసాయిదాపై స్టేక్‌హోల్డర్స్ తమ అభిప్రాయాన్ని 2025 నవంబర్ 6 లోపు తెలియజేయాలని సూచించింది. ఇందుకోసం itrules. consultation @meity.gov.in ద్వారా ఈమెయిల్ చేయవచ్చని సూచించింది.

## మహిళా ఉగ్రవాదులకు ఆన్‌లైన్ కోర్స్



**న్యూఢిల్లీ :** పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ జరిపిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం తమ నెట్‌వర్క్‌ను విస్తరించుకునేందుకు తొలిసారి ప్రత్యేకంగా జైషే మహిళా బ్రిగేడ్‌ను ఏర్పాటు చేసినట్లు ఇటీవల నిఘా వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పాటయిన జైషే మహమ్మద్ ఉగ్ర సంస్థ మహిళలకు ఉగ్రవాదంపై ఆన్ లైన్ కోర్సు నిర్వహించనున్నట్లు నిఘా వర్గాలను ఉటంకిస్తూ అనేక ఆంగ్ల మీడియా కథనాలు తెలిపాయి. ఈ కోర్సుకు 'తౌఫత్ అల్ ముమినాత్'గా పేరు పెట్టినట్లు తెలుస్తోంది. జైషే చీఫ్ మసూద్ అజార్ చెల్లెళ్లు సాదియా అజార్, సమైరా అజార్ దీనికి నాయకత్వం వహిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో బహవల్‌పూర్‌లోని జైషే ప్రధాన కేంద్రంపై భారత్ బాంబులు జారవిడిచిన సంగతి తెలిసిందే. ఆ దాడుల్లో మసూద్ అజార్ కుటుంబానికి చెందిన 10 మంది మతి చెందారు. మతుల్లో మసూద్ బావ, సాదియా భర్త యూసఫ్ అజార్ కూడా ఉన్నాడు. కాగా మసూద్ మరో సోదరి సమైరా భర్త.. పుల్వామా ఉగ్రదాడి కుట్రదారు ఉమర్ ఫరూక్ గతంలో భారత భద్రతా దళాల ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ప్రస్తుతం వీరు ఇద్దరూ మహిళా బ్రిగేడ్ సభ్యులకు ఆన్ లైన్ కోర్సులో మతపరమైన, జిహాద్‌కు సంబంధించిన పాఠాలను బోధించనున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇతర మహిళలను కూడా ఉగ్రవాదం వైపు ఆకర్షించడానికి ఈ బ్రిగేడ్ సభ్యులు పని చేస్తున్నట్లు తెలిపాయి. ఈ మహిళ బ్రిగేడ్‌లో జైషే కమాండర్ల భార్యలతో పాటు బహవల్‌పూర్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లీ, హరీపూర్ వంటి ప్రాంతాల్లో ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన మహిళలను సభ్యులుగా నియమించుకున్నట్లు తెలుస్తోంది. నవంబరు 8 నుంచి సెషన్లు ప్రారంభం కానున్నాయని.. ఇందులోభాగంగా ప్రతి రోజూ 40 నిమిషాల పాటు మసూద్ చెల్లెళ్లు, కమాండర్ల కుటుంబ సభ్యులు పాఠాలు బోధిస్తారని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇందుకోసం మహిళా బ్రిగేడ్‌లోని సభ్యుల నుంచి కొంత మొత్తంలో విరాళాలు కూడా సేకరిస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త మహిళా బ్రిగేడ్ భారత్‌లో తన నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసే అవకాశం ఉందని ఇటీవల నిఘా వర్గాలు హెచ్చరించాయి. సోషల్ మీడియా, ఆన్ లైన్ నెట్‌వర్క్‌లతో జమ్మూకశ్మీర్, యూపీ వంటి ప్రాంతాల్లో మహిళలను ఈ బ్రిగేడ్‌లో చేరేలా ఆకర్షించే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో భారత అధికారులు అప్రమత్తమైనట్లు సమాచారం.

# తమిళనాడులో కుండపోత

ఇల్లు కూలి ఇద్దరు మహిళల మృతి

12 జిల్లాలకు రెడ్ అలర్ట్

13 జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవులు

సహాయక చర్యలు ముమ్మరం



**చెన్నై:** కుండపోత వర్షాలు తమిళనాడు రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. కడలూరు జిల్లాలో భారీ వర్షాలకు ఓ ఇల్లు కూలి ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. చెంగల్‌పట్టు, విల్లుపురం, కడలూరు, మైలాడుతురై జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. రెడ్ అలర్ట్ జారీ అయిన జిల్లాలకు 12 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ పర్యవేక్షకులుగా నియమించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, సహాయక శిబిరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. చెంగల్‌పట్టు కలెక్టర్ డి.స్నేహ మాట్లాడుతూ.. వర్షాలకు ముందే పూడికతీత పనులు పూర్తి చేశామని, నీటిని తోడే పంపులు, సహాయక కేంద్రాలు, కమ్యూనిటీ కిచెన్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. భారీ వర్షాల కారణంగా తమిళనాడులోని 13 జిల్లాల్లో పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. తూత్తుకూడి, తిరువారూర్ జిల్లాల్లోని పలు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. నాగపట్నం, తిరువారూర్ జిల్లాల్లో వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జేసీబీలు, బోట్లు, చెట్లను తొలగించే యంత్రాలతో పాటు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బందాలను సిద్ధంగా ఉంచారు.

కాగా, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి... ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తా తీరాల వైపు కదులుతూ రాగల 24 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో తమిళనాడు వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రోడ్లు, వీధులు నదులను తలపిస్తున్నాయి. చెన్నై సహా పలు తీర ప్రాంత జిల్లాలకు భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, రాణిపేట, తిరువణ్ణామలై, కళ్లకురిచ్చి, అరియలూరు, పెరంబలూరు, తంజావూరు, తిరువారూరు, నాగపట్టణం జిల్లాలు, కారైక్కల్‌లో కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీవర్షం, సేలం, తిరుచ్చి, వేలూర్, తిరుపత్తూర్, ధర్మపురి, పుదుక్కోట్టై జిల్లల్లో ఒకటి రెండు చోట్ల భారీవర్షానికి అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది.

## మోదీ దాచిపెడితే.. ట్రంప్ బయటపెడతాడు

భారత్ చమురు దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ధ్వజం

**న్యూఢిల్లీ :** భారత్ చమురు దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి భారత్ పెద్దగా చమురును కొనుగోలు చేయబోవడం లేదని పునరుద్ఘాటించారు. ఆయన ఆరు రోజుల్లో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇది నాల్గోవసారి కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో మండిపడింది. ప్రధాని నరేంద్ర మోదీ దాచిపెట్టిన దానిని ట్రంప్ వెల్లడిస్తున్నారని ప్రతిపక్ష పార్టీ విమర్శించింది. ప్రధాని నరేంద్ర మోదీతో ట్రంప్ మాట్లాడి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన తర్వాత కాంగ్రెస్ ఆయనపై విమర్శలు చేసింది. ప్రధాని చివరకు ట్రంప్ తనకు ఫోన్ చేశారని, ఇద్దరం ఒకరితో ఒకరం మాట్లాడుకున్నామని బహిరంగంగా అంగీకరించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. అయితే తనకు దీపావళి శుభాకాంక్షలు మాత్రమే ట్రంప్ చెప్పినట్లు మోదీ వెల్లడిస్తున్నారని, కానీ ప్రధాని మోదీ దాచిపెడుతున్నదంతా ట్రంప్ బహిర్గతం చేస్తున్నారన్నారు. 'అమెరికా అధ్యక్షుడు దీపావళి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు, రష్యా నుండి భారతదేశం చేస్తున్న చమురు దిగుమతుల గురించి మాట్లాడానని, ఈ దిగుమతులను నిలిపివేస్తామని తనకు హామీ ఇచ్చారని' ట్రంప్ పేర్కొన్నారని రమేష్ ఎక్స్‌లో పోస్టు చేశారు. అంతకుముందు ట్రంప్ మే 10న సాయంత్రం ఆపరేషన్ సిందూర్ నిలిపివేతను ప్రధాని మోదీ ప్రకటించే ముందు ప్రకటించారని కాంగ్రెస్ నాయకుడు చెప్పారు.

# మా నాన్న రాజకీయ జీవితం ముగిసినట్లే

సిద్ధరామయ్య కుమారుడు సంచలన వ్యాఖ్యలు!

**బెంగళూరు :** కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశంపై రాజకీయ వేడి కొనసాగుతోన్న వేళ సిఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తండ్రి రాజకీయ జీవితం చివరి దశలో ఉందని బాంబు పేల్చారు. అంతేకాకుండా కర్ణాటకలో కాంగ్రెస్ నాయకత్వాన్ని నడిపించేందుకు సతీశ్ ఝర్కిహోళి అర్హుడంటూ సిఎం మార్పుపై సంకేతాలు ఇచ్చారు. బెళగావి జిల్లాలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న యతీంద్ర సిద్ధరామయ్య, ఈవ్యాఖ్యలు చేశారు. దీంతో ఇది కాస్తా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 'రాజకీయాల్లో మా నాన్న చివరి దశలో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బలమైన, ప్రగతిశీల భావజాలం ఉన్న నాయకుడు ఆయనకు కావాలి. అలాంటి నాయకుడికి సిద్ధరామయ్య మార్గదర్శిగా ఉంటారు కూడా. సతీశ్ ఝర్కిహోళికి ఆ లక్షణాలు ఉన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని నడిపించేందుకు ఆయన సరైన వ్యక్తి. పెద్దబాధ్యతలు అందుకునేందుకు సిద్ధంగా ఉండండి' అని యతీంద్ర పేర్కొన్నారు.

**ముఖ్యమంత్రి మార్పును ఉద్దేశించే యతీంద్ర వ్యాఖ్యలు....**మరోవైపు యతీంద్ర వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పును ఉద్దేశించే ఆయన ఇలా మాట్లాడి ఉంటారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే సిద్ధరామయ్య తర్వాత ముఖ్యమంత్రిగా డికె శివకుమార్ పగ్గాలు చేపడుతారనే ప్రచారం వేళ సతీశ్ పేరు తెరపైకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిణామాలపై సిద్ధరామయ్య గానీ, కాంగ్రెస్ పార్టీ గానీ ఇంకా స్పందించలేదు.

ప్రజాపక్షం
గురువారం, 23 అక్టోబరు

# అమెరికా యుద్ధ కాంక్ష!

అమెరికా ప్రవచిస్తున్న 'ప్రపంచ శాంతి' ముసుగు తొలిగిపోతున్నది. సామ్రాజ్యవాద సిద్ధాంత వికృతరూపం మళ్లీ ఆవిష్కృతమవుతున్నది. కరేబియన్‌లో ఇటీవల జరిపిన వైమానిక దాడులు, వెనిజులాపై సైనిక బెదిరింపులు ఇందుకు నిదర్శనాలు. ఈ ప్రాంతాలపై దశాబ్దాలుగా అమెరికా అనుసరిస్తున్న అనుచిత వైఖరికి ఇది కొనసాగింపు. వెనిజులాపై నిఘా ఉంచి, పట్టుపెంచి, రహస్య చర్యలు తీసుకునే అధికారం సిఐఎకి ఇచ్చినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధ్రువీకరించారు. ఒకప్పుడు ఇరాన్‌పై ఆరోపణలు చేసి, యుద్ధం ప్రకటించి, సర్వనాశనం చేసిన అమెరికా, అదే విధానాన్ని వెనిజులాపై అనుసరించే ప్రమాదం ఉంది. భౌగోళిక ఆధిపత్యం కోసం నిరంతరం తహతహలాడే అమెరికా తన నిఘా కార్యకలాపాలు, ప్రత్యక్ష సైనిక జోక్యాలను విస్తరిస్తున్నది. ఒత్తిళ్లకు లొంగని వెనిజులాపై కుట్రలు పన్నుతునే ఉంది. 1998లో హ్యూగో చావెజ్ దేశాధ్యక్షుడిగా ఎన్నికైన నాటి నుంచి వెనిజులాపై నియంత్రణను తిరిగి పొందాలనే మొండి పట్టు ప్రదర్శిస్తునే ఉంది. చావెజ్ ఎన్నిక అమెరికా ప్రాయోజిత నయా ఉదారవాద విధానాలకు తెరదించింది. లాటిన్ అమెరికాలో వామపక్ష ప్రభుత్వాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ పరిణామం అమెరికాకు కునుకు లేకుండా చేసింది. 2013లో చావెజ్ అనుమానాస్పద మరణం తర్వాత కూడా అధికార మార్పు కోసం పావులు కదుపుతునే ఉంది. నాటి నుంచి నేటి వరకూ వెనిజులా ప్రభుత్వంతో ప్రత్యక్ష యుద్ధాన్ని నడిపించడానికి అమెరికా మిలియన్ల డాలర్లు ఖర్చు చేసింది. ప్రజాస్వామ్య ప్రతిపక్షం లేదా స్వచ్ఛంద సంస్థల ద్వారా ఈ నిధుల ప్రవాహం కొనసాగుతున్నది. దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని హింసాత్మకంగా తొలగించాలని నిరంతరం వాదించే సమూహాలకు, నాయకులకు అమెరికా మద్దతు ఇచ్చింది. అమెరికా అధ్యక్ష స్థానంలో ఉన్న ప్రతి ఒక్కరూ వెనిజులా పట్ల ప్రతికూల విధానాన్ని అనుసరించారు. 2015లో, అధ్యక్షుడు ఒబామా వెనిజులాను అమెరికా జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పుగా అభివర్ణించారు. ఆర్థిక ఒత్తిడి పెంచారు. ఏ రకమైన ముప్పు అనేది మాత్రం చెప్పరు. వెనిజులాపై ఆర్థిక యుద్ధాన్ని ప్రకటించడానికి కారణాన్ని వివరించలేదు. వెనిజులాలో చమురు పరిశ్రమ పతనమయ్యే వరకూ అమెరికా శాంతించలేదు. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే వరకూ నిద్రపోలేదు. 2017 ఆంక్షల తర్వాత వెనిజులాలో చమురు ఉత్పత్తి క్షీణించింది. వెనిజులా చమురులో మూడోవంతు కొనుగోలు చేసే అమెరికా, హఠాత్తుగా నిర్ణయాన్ని మార్చుకుంది. ఫలితంగా 17 నుంచి 31 బిలియన్ డాలర్ల మేరకు ఆదాయాన్ని వెనిజులా కోల్పోయింది. ఈ లోటు ఆహారం, మందులు, నిత్యావసర వస్తువులపై పడింది. ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది. అప్పటికీ వెనిజులా కాళ్లబేరానికి రాకపోవడం అమెరికా అహాన్ని దెబ్బతీసింది. ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవటానికి ట్రంప్ ప్రభుత్వం పాత పావులనే కొత్తగా కదపడం మొదలు పెట్టింది. వెనిజులాను ఆర్థికంగా, రాజకీయంగా అస్తవ్యస్తం చేయడమే లక్ష్యంగా ఎంచుకుంది. ప్రత్యక్ష, పరోక్ష బెదిరింపులు మొదలు పెట్టింది. నికొలస్ మదురో ప్రభుత్వంపై 'నార్కోటెర్రరిస్ట్' ముద్ర వేసింది. 2003లో సామూహిక విధ్వంసకర ఆయుధాలు ఉన్నాయంటూ సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని నాటి జార్జి బుష్ పాలన కూల్చివేసింది. సద్దాంను ఉరితీసే వరకూ విశ్రమించలేదు. నాడు విధ్వంసకర ఆయుధాల పేరిట ఇరాక్‌తో ఆడిన నాటకాన్ని ఇప్పుడు 'నార్కోటెర్రరిస్ట్' అంటూ వెనిజులాతో కొనసాగిస్తున్నది. కానీ, ఇరాక్ మాదిరి వెనిజులాను లొంగతీసుకోవడం, పాదాక్రాంతం చేసుకోవడం అనుకున్నంత సులభం కాదని అమెరికాకు తెలుసు. అందుకే, ఆర్థిక నిర్బంధాలు.. ప్రజాస్వామ్యవాదుల పేరుతో కుట్రదారులకు ప్రోత్సాహకాలు. తాజా పరిణామాలతో అమెరికా తాత్కాలికంగా తలిగించుకున్న 'విశ్వశాంతి' పరదా తొలిగింది. సామ్రాజ్యవాద వికృత రూపం బయటపడింది. అమెరికా తన ఆయుధ అమ్మకాలను వదులుకోదు. వాణిజ్య ప్రయోజనాల కోసం దేశాల మధ్య చిచ్చు పెట్టడానికి వెనుకాడదు. సజావుగా సాగుతున్న ప్రభుత్వాలను కూల్చడానికి, అంతర్యుద్ధాన్ని ప్రేరేపించడానికి వెనుకాడదు. వెనిజులా విషయంలో ఇదే విధానం... ఎట్టి పరిస్థితుల్లోనూ వెనిజులాను పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థగా మార్చేయడమే ఇప్పుడు అమెరికా ధ్యేయం... సంక్షేమాన్ని సంక్షోభంగా మార్చడమే లక్ష్యం. యుద్ధ విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగించడం.. దారికి రాకపోతే, నేరుగా రంగంలోకి దిగుతామని హమాస్‌ను ట్రంప్ బెదిరించడంతో అమెరికా యుద్ధపిపాస మరోసారి బయటపడింది. వెనిజులాపై కుట్ర వైట్‌హౌస్ దారుణ విధానాలకు పరాకాష్ట. 'నోబెల్ శాంతి'ని కోరుకుంటున్న ఓ మహానేత దిగజారిన విధానాలకు తిరుగులేని ఉదాహరణ.

# అయోతీథాస్ వ్యాఖ్యతో ఉలిక్కిపడ్డ దేశం


డాక్టర్ దేవరాజు మహారాజు

''స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గురించి, దేశభక్తి గురించి, స్వదేశీ జాగరణ గురించి మాట్లాడి జనాల నుండి చందాలు వసూలు చేసుకునే ఈ రాజకీయ నాయకులు ప్లేగు వంటి వ్యాధులు ప్రబలినప్పుడు, కరువు కాటకాలు వచ్చినపుడు అడ్రసు లేకుండా పోతారు. ప్రజల కన్నీళ్లు తుడవటానికి ఎవరూ రారు. వారికి అందించాల్సిన కూడు, నీడ వంటి కనీసావసరాలు అందించరు. కష్టకాలంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఈ నాయకులు కలలో కూడా అనుకోరు. వారు చెప్పే దేశభక్తి అంతా వారి స్వార్థ ప్రయోజనాల కోసమే – అని ప్రజలు గ్రహించాలి!'' – అని 'తమిళన్' అక్టోబరు 2,3, 1912 నాటి సంచికలో ఆ పత్రికా సంపాదకుడు సి.అయోతీథాస్ రాజకీయ వ్యవస్థను తీవ్రంగా విమర్శించారు. దాంతో దక్షిణ భారతదేశం ఉలిక్కిపడింది. ఎవరీ అయోతీథాస్ అని తెలుసుకోవడం ప్రారంభించింది.

దక్షిణ భారతదేశంలో కులాన్ని ప్రశ్నిస్తూ తొలిసారి గొంతెత్తిన కార్యకర్త – అయోతీ థాస్, ఆది ద్రావిడ నేపథ్యం నుండి వచ్చిన ఆయన రాజకీయం, సాహిత్యం, మతం వంటి అనేక రంగాలలో అవిరళ కృషి చేసినవారు. తమిళ పండితుడు, వృత్తి రీత్యా సిద్ధ వైద్యుడు. పందొమ్మిదవ శతాబ్దం చివరలో ఆది ద్రావిడ ప్రజల అభ్యున్నతి కోసం నడుం బిగించి 1891లో 'కులరహిత ద్రవిడ మహాసభ'ను స్థాపించారు. ఈ విషయంలో రెట్టమాలై శ్రీనివాసన్ అనే మరో సంఘ సంస్కర్త ఈయనకు సహకరించారు. బౌద్ధం స్వీకరించిన అయోతీథాస్, పరయల (మాలల) అసలు మతం బౌద్ధమని తేల్చారు. అందరినీ అందులోకి మారమని సూచించారు. కులరహిత సమాజం బౌద్ధం ద్వారానే సాధ్యమని ఉద్బోధించారు.

తరతరాలుగా వైష్ణవ సంప్రదాయంలో కూరుకుపోయిన కుటుంబం వీరిది. అయినప్పటికీ తన హేతుబద్ధమైన ఆలోచనలతో బ్రాహ్మణాధిపత్యాన్ని మతపరమైన పెత్తందారీ పోకడల్ని అయోతీథాస్ పక్కకు తొలగిస్తూ వచ్చారు. ఆ కాలంలోనే అంటే, 19వ శతాబ్దపు చివరి కాలంలో బ్రహ్మ సమాజం, ఆర్యసమాజం సంస్థలు హిందూ మత పునరుద్ధరణకు పూనుకున్నాయి. 1861–91 మధ్యకాలంలో క్రైస్తవులు, ముస్లింలు మినహా మిగిలిన వారందరినీ బలవంతంగా హిందువులుగానే పరిగణించారు. అయితే అయోతీథాస్ 'హిందూ' అనే గుర్తింపును నిరాకరించారు. కారణమేమంటే 'హిందూ'ను గుర్తిస్తే అందులో ఉన్న కుల నిర్మాణాన్ని నిచ్చెనమెట్ల కుల సంస్కృతినీ, అసమానతలను స్వీకరించాలి! అందుకని, ఆయన దాన్ని తిరస్కరించడంతో పాటు, తన అనుయాయులందరినీ తిరస్కరించమని సూచించారు. కుల హింసలను గుర్తుచేసుకుని, ఆది ద్రావిడుల్ని ఆ పరిధిలోంచి బయటికి రమ్మని పిలుపునిచ్చారు. అప్పుడే తమిళ శైవమతంలో కూడా పునరుద్ధరణకు ప్రయత్నాలు జరిగాయి. ఇది బ్రాహ్మణ వ్యతిరేకత గురించి మాట్లాడింది కానీ, కుల నిర్మూలన గురించి మౌనంగానే ఉంది. అందువల్ల అయోతీథాస్ శైవమతం స్వీకరించలేదు. పైగా శైవమతం వైపు కూడా ఆకర్షితులు కాకూడదని తన వారికి ఉద్బోధించారు. ఈ ప్రయత్నాలు ఇలా ఉండగా అయోతీథాస్ రాజకీయంగా కూడా కొన్ని ప్రయత్నాలు చేశారు. తను స్థాపించిన 'కులరహిత ద్రావిడ మహాసభ' పక్షాన 10 డిమాండ్లతో ఒక వినతి పత్రం తయారు చేసి, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి పంపారు. వారు వాటిని తమ 12వ సమావేశంలో చర్చించారు కూడా! అయితే, అందులో ఒక్క డిమాండ్‌కు కూడా సుముఖత వ్యక్తపరచలేదు. ఆ డిమాండ్లలో ఉచిత విద్య, బంజరు భూముల కేటాయింపు, పరయల (మాలల) ఆలయ ప్రవేశం మొదలైనవి ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీతో పని కాలేదని అయోతీ థాస్ తన ప్రయత్నం మానుకోలేదు. ప్రత్యామ్నాయ ప్రయత్నాలు ప్రారంభించారు. ఎమ్.వీర రాఘవాచారియర్, జి.సుబ్రహ్మణ్య అయ్యర్, పి.ఆనందాచార్లు కలిసి 1884లో 'మద్రాస్ మహాజనసభ'ను స్థాపించారు. ఇది కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం కాగలదని భావించారు. లోగడ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అవే పది డిమాండ్ల వినతిపత్రం అయోతీథాస్ మళ్ళీ ఈ మద్రాస్ మహాజన సభకు పంపించారు. కానీ, అక్కడా చుక్కెదురైంది. నిర్వాహక సభ్యులు వినతిపత్రాన్ని తిరస్కరించడమే కాదు, ఆయనను ఘోరంగా అవమానించారు.

జరిగిన అవమానంతో అయోతీథాస్ తీవ్రమైన మనోవేదనకు గురయ్యారు. తాము హిందువులమే అయితే జాతి విచక్షణ ఎందుకూ? కులదూషణలెందుకూ? దేవుడు అందరివాడైనపుడు ఆలయ ప్రవేశం తమకెందుకు ఉండదూ? వంటి అనేక ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. ఆయన వాటికి సమాధానాలు కనుగొనే ప్రయత్నంలో వేదాలు, బ్రాహ్మణత్వం, ఆచారాలు వంటి వాటి గూర్చి అధ్యయనం ప్రారంభించారు. విషయాలు అర్థమౌతున్నకొద్దీ ఆయనలో ఒక ఉద్యమకారుడు రూపుదిద్దుకోసాగాడు. 1870 దశకంలో తన పాతికేళ్ళ ప్రాయంలో తమిళనాడు నీలగిరి ప్రాంతంలోని తోడర్–కొండ జాతులను సమైక్య పరిచి 1875లో అద్వైతానంద సభకు రూపకల్పన చేశారు. అప్పుడే రెవరెండ్ జాన్ రధినమ్‌తో పరిచయం ఏర్పడింది. ఈయన మద్రాసులో ఆది ద్రావిడుల కోసం వెస్లియన్ మిషన్ పాఠశాల నిర్వహిస్తున్నారు. ఆయన పరిచయంతో అయోతీ థాస్‌కు కొత్త ఉత్సాహం లభించింది. దాంతో 1885లో 'ద్రవిడ పాండ్యన్' అనే వార్తా పత్రికను ప్రారంభించారు. ఎప్పటి నుంచో చేస్తూ వచ్చిన అధ్యయనాల కారణంగా ఒక సంవత్సరం తర్వాత 1886లో ''ఆది ద్రావిడులు–హిందువులు కారు''– అని భారతదేశ చరిత్రలోనే ఒక విప్లవాత్మకమైన ప్రకటన చేశారు.

1891లో ద్రవిడ మహాసభను స్థాపించి, ఆది ద్రావిడులకు ఒక పిలుపునిచ్చారు. వారంతా తమను తాము హిందువులుగా కాక, 'కుల రహిత తమిళులు'గా ప్రకటించుకోవాలని కోరాడు. ఆ రోజుల్లో అదొక సాహసోపేతమైన చర్య! ఈ రోజుల్లో కొందరు ప్రభుత్వ వ్యవస్థలతో పోరాడి, కుల రహిత సర్టిఫికెట్లు తీసుకుంటున్న సంగతి మనకు తెలుసు. కానీ, ఇప్పటికి 130 ఏళ్ల ముందు ఆ ప్రకటన చేయడమంటే ఆయన ఎంత ధైర్యం చేసి ఉండాలి? ఎంత ముందుచూపు ఉండి ఉండాలి? ఒకసారి అయోతీథాస్ తన అనుచరులతో థియోసాఫికల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడయిన కొలొనెల్ హెచ్.ఎస్.ఓల్కాట్‌ను కలుసుకున్నారు. బౌద్ధం స్వీకరించాలన్న తన కోర్కెను ఆయనకు తెలియజేశారు. ఆయన అయోతీథాస్ శ్రీలంకకు వెళ్లే ఏర్పాటు చేశారు. శ్రీలంకలో అయోతీథాస్ సింహళ బౌద్ధ భిక్షువు సుమంగళ నాయక్ నుండి ధమ్మదీక్ష స్వీకరించారు. చెన్నై తిరిగి వచ్చాక, 1898లో 'శాక్యబౌద్ధ సంఘాన్ని' స్థాపించి దాన్ని శాఖోపశాఖలుగా విస్తరింపజేశారు. ఈయన అప్పుడు ఏర్పాటు చేసిన శాక్య బౌద్ధ సొసైటీయే కాలక్రమంలో ఇండియన్ బుద్ధిస్ట్ అసోసియేషన్‌గా మారిపోయింది. తర్వాతకాలంలో బౌద్ధానికి సంబంధించి అనేక శాఖలు, సంఘాలు ఏర్పడుతూ వచ్చాయి.

ద్రవిడ ఉద్యమ పితామహుడిగా నిలిచిన అయోతీథాస్, రచయితగా చేసిన కృషి కూడా తక్కువది కాదు. 1.అంబికయ్యన్ కథ 2. ఇంద్ర జాతి చరిత్ర 3. ఇంద్ర దేశ బౌద్ధ పండుగలు 4. శాక్య మహర్షి చరిత్ర 5.తిరుక్కురల్ దేవునికి శుభాకాంక్షలు 6. తిరువళ్లువర్ చరిత్ర. 7.నందన్ చరిత్ర. 8.ఆధునిక కులాల్లో భయాందోళనలు 9. బుద్ధుడు – రాత్రీ పగలు లేని కాంతి 10.మురుగ భగవానుని చరిత్ర 11. వివాహ వివరణ 12. ప్రాచీన తమిళ భాష– బుద్ధుడు–ఆదివేదం 13. వేష బ్రాహ్మణ వేదాంత వివరణ.. మొదలైనవి.



అయోతీథాస్ అనేది ఆయనకు ఆయనే పెట్టుకున్న పేరు. బాల్యంలో ఈయన అయోధ్య దాసర్ పండిట్ అనే ఉపాధ్యాయుడి వద్ద చదువునేర్చుకున్నారు. తమిళం, ఇంగ్లీషు, పాళీ భాషల్ని, తత్త్వ శాస్త్రాన్ని, సిద్ధ వైద్యాన్నీ ఇలా అనేక విషయాలు నేర్చుకున్నారు. అందువల్ల గురువుగారి పట్ల ఆ బాలుడికి ఏర్పడ్డ గౌరవ భావంతో తన పేరు కూడా అయోధ్య దాసర్‌గా చెప్పుకునేవాడు అంటే తను కూడా గురువంతటి వాణ్ణి కావాలన్న ఆకాంక్ష–అతనితో అలా చేయించింది. ఆపేరే స్థిరపడి అయోతీ థాస్‌గా మారింది.

'అయోతీథాస్'గా ప్రసిద్ధుడైన ఈయనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు కథవరాయన్. ఇప్పుడు ఆ పేరు చెబితే ఆయనను ఎవరూ గుర్తుపట్టరు. అయోతీథాస్ అనేది ఆయనకు ఆయనే పెట్టుకున్న పేరు. బాల్యంలో ఈయన అయోధ్య దాసర్ పండిట్ అనే ఉపాధ్యాయుడి వద్ద చదువునేర్చుకున్నారు. తమిళం, ఇంగ్లీషు, పాళీ భాషల్ని, తత్త్వ శాస్త్రాన్ని, సిద్ధ వైద్యాన్నీ ఇలా అనేక విషయాలు నేర్చుకున్నారు. అందువల్ల గురువుగారి పట్ల ఆ బాలుడికి ఏర్పడ్డ గౌరవ భావంతో తన పేరు కూడా అయోధ్య దాసర్‌గా చెప్పుకునేవాడు అంటే తను కూడా గురువంతటి వాణ్ణి కావాలన్న ఆకాంక్ష–అతనితో అలా చేయించింది. ఆపేరే స్థిరపడి అయోతీ థాస్‌గా మారింది. తమిళ పలుకుబడి థాస్ అంటే మన తెలుగులో దాసుడు అనే అర్థం.

వీరిది విద్యావంతుల కుటుంబం. ఈయన తండ్రి కాంతప్పన్, ఫ్రాన్సిస్ వైట్ ఎల్లిస్ అనే బ్రిటిషు అధికారి దగ్గర పనిచేసేవాడు. తన కుటుంబం తరతరాలుగా భద్రపరుచుకుంటూ వచ్చిన తిరుక్కురళ్, నాలదియార్‌లను కాంతప్పన్ ఫ్రాన్సిస్ ఎల్లిస్‌కు తాళపత్రాలలో అందిస్తే – ఆయన వాటి విలువను గ్రహించి, ఇంగ్లీషులోకి అనువదించారు. తరువాత పుస్తకాలుగా ముద్రించి ప్రపంచానికి పరిచయం చేశారు. ఆ రకంగా తమిళుల సాంస్కృతిక సంపదైన తిరుక్కురళ్ వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తెలుసుకుంటూ ఉంటే – మన తెలుగు కవి వేమన పద్యాలను సేకరించి, ఇంగ్లీషులోకి అనువదించి ప్రపంచానికి పరిచయం చేసిన మన ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్(1798–1884) గుర్తుకొస్తారు.

అయోతీ థాస్ 20 మే 1845న రోయపెట్ట, మద్రాసులో జన్మించారు. మళ్లీ అదే మే నెల 5వ తేదీన 1914లో 69వ యేట కన్నుమూశారు. తండ్రి ఉద్యోగం కారణంగా వీరి కుటుంబం నీలగిరికి వలస వెళ్ళింది. ఒకరకంగా పెరియార్, ద్రవిడర్ కజగమ్ బి.ఆర్. అంబేద్కర్‌లకు ఈయనే స్ఫూర్తిప్రదాత!ఈయన మరణించిన చాలా కాలానికి ఆయుర్వేదం, యునాని వంటి వైద్యవిధానాలతో పాటు సిద్ధ మెడిసిన్‌ను కూడా ఇండియన్ మెడికల్ కౌన్సిల్ గుర్తించింది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిద్ధ – ను మాజీ భారత ప్రధాని డా. మన్‌మోహన్ సింగ్ ప్రారంభించారు. చాలాకాలం అయోతీ థాస్ పేరు మరుగునపడిపోయింది. అయితే తన దళిత సాహిత్య అకాడెమీ పక్షాన ఇజిల్‌మలై అయోతీథాస్ రచనల్ని మళ్ళీ వెలుగులోకి తెచ్చారు. కేంద్రమంత్రిగా పనిచేసిన అంబుమణి రామ్‌దాస్ చొరవతో కూడా అయోతీ థాస్ జీవితం –కృషి ఈ తరానికి పరిచయమయ్యాయి.

*(23 అక్టోబరు : కుల రహిత ఉద్యమానికి అయోతీథాస్ బీజం వేసిన రోజు)*

**(సుప్రసిద్ధ సాహితీవేత్త, విశ్రాంత ప్రొఫెసర్)**

# మహిళా భద్రతా వ్యవస్థలో జెండర్ స్టడీస్ స్థానం ఎప్పుడు?

మహిళల భద్రత అనే అంశం ఈ రోజుల్లో భారత సమాజం లో అత్యంత ప్రాధాన్యం పొందిన చర్చాంశంగా మారింది. ప్రతి రోజూ వార్తలలో కనబడుతున్న లైంగిక వేధింపులు, గృహ హింస, మానసిక బాధలు మహిళల భద్రత కేవలం చట్టపరమైన అంశం కాకుండా, మానసిక, సామాజిక, సాంస్కృతిక సమస్య కూడా అని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు, ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం, మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్, భరోసా సెంటర్స్ వంటి విభాగాలను ఏర్పాటుచేసి, మహిళలకు న్యాయం చేయడంలో విశేష పాత్ర పోషిస్తున్నాయి. అయితే ఈ విభాగాల్లో అత్యంత ముఖ్యమైన స్థానం పొందిన కౌన్సిలర్ పోస్టుల విషయంలో ఒక పెద్ద లోపం ఇప్పటికీ కొనసాగుతోంది. ఆ లోపం ఏమిటంటే జెండర్ స్టడీస్ పూర్తిచేసిన విద్యార్థులను ఇప్పటికీ అర్హులుగా పరిగణించకపోవడం.

జెండర్ స్టడీస్ అనే విద్యా కోర్సు ప్రస్తుతం భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న శాస్త్రం. ఈ కోర్సు చదివే విద్యార్థులు కేవలం లింగ సమానత్వం గురించి సిద్ధాంతాత్మక పరిజ్ఞానం మాత్రమే కాకుండా, మహిళలపై హింస, లైంగిక వేధింపులు, ట్రాఫికింగ్, మానసిక ఆందోళనలు వం టి సమస్యలను లోతుగా అధ్యయనం చేస్తారు. వారు లింగ సున్నిత దృక్పథాన్ని అభివృద్ధి చేసుకుంటారు, హ్యూమన్ రైట్స్, సోషల్ వర్క్ పద్ధతులపై సమగ్ర అవగాహన పొందుతారు.

ఇలాంటి సమగ్ర శిక్షణ పొందిన వారు ఉమెన్ సేఫ్టీ వింగ్‌లో కౌన్సిలర్‌గా పనిచేస్తే, బాధిత మహిళలతో మరింత సున్నితంగా, మానవీయంగా వ్యవహరించగలరు. బాధితురాలి మానసిక స్థితి అర్థం చేసుకోవడం, ఆమె భయాన్ని తగ్గించడం, చట్టపరమైన మార్గదర్శనం ఇవ్వడం ఇవన్నీ కౌన్సిలర్ బాధ్యతలు. ఈ పనిలో భావోద్వేగపరమైన సహనం, జెండర్ అవగాహన, మానసిక ధృఢత అవసరం. ఇవన్నీ జెండర్ స్టడీస్ విద్యార్థుల శిక్షణలో ప్రధాన భాగంగా ఉంటాయి.

అయితే ప్రస్తుత నియామక విధానాలు మాత్రం ఇంకా పాత విధానాలకే పరిమితమై ఉన్నాయి. కౌన్సిలర్ పోస్టులకు సాధారణంగా సైకాలజీ లేదా సోషల్ వర్క్ చేసినవారినే ఎంపిక చేస్తున్నారు. కానీ జెండర్ స్టడీస్ కూడా ఈ రెండింటిని సమ్మిళితంగా కలిగిన ఆధునిక విద్యా రంగం. సైకాలజీ మానసిక ఆరోగ్యంపై దృష్టి పెడితే, సోషల్ వర్క్ సమాజంలోని వ్యక్తిగత సమస్యల పరిష్కారాన్ని సూచిస్తుంది. కానీ జెండర్ స్టడీస్ ఈ రెండింటిని మించి, లింగ అసమానతల మూలాలను అర్థం చేసుకుని వాటిని సామాజిక మార్పు ద్వారా పరిష్కరించే దిశగా దృష్టి సారిస్తుంది.

తెలంగాణలో గతంలో కాకతీయ యూనివర్సిటీ, ప్రస్తుతం హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీలు ఎం.ఏ జెండర్ స్టడీస్ కోర్సును నాణ్యతతో బోధిస్తున్నాయి. ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ప్రస్తుతం ఉద్యోగ రహితులుగా ఉన్నారు. వారు ప్రభుత్వ ప్రాజెక్టులు, మహిళా కమిషన్‌లు, ఉమెన్ సేఫ్టీ వింగ్‌లలో పనిచేసే అవకాశం కోరుతున్నారు. కానీ నియామకాలలో కోర్సు పేరు లేకపోవడం వల్ల వారు అర్హత కోల్పోతున్నారు. ఇది విద్యా సమానత్వానికి విరుద్ధమైన అంశం.

ప్రభుత్వం ఈ అంశాన్ని గమనించి, ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్, 181 వుమెన్ హెల్ప్‌లైన్ వంటి విభాగాల్లో కౌన్సిలర్ పోస్టులకు జెండర్ స్టడీస్ విద్యార్థులను కూడా అర్హులుగా గుర్తించాలి. వారు ఫీల్డ్ ట్రైనింగ్ పొందినవారు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన అనుభవం ఉన్నవారు. ఇటువంటి వ్యక్తులు బాధితురాళ్లతో మాట్లాడినప్పుడు వారు కేవలం సలహాదారులుగా కాకుండా, ఒక మానవీయ ఆధారంగా నిలుస్తారు. ఇక ఈ మార్పు కేవలం ఉద్యోగ అవకాశాల పరిమితిలోనే ఉండదు. జెండర్ స్టడీస్ విద్యార్థులు వ్యవస్థలో చేరడం ద్వారా పోలీస్ వ్యవస్థలోనే జెండర్ సెన్సిటివిటీ పెరుగుతుంది.

మహిళా భద్రతా విధానాలు మరింత మానవీయంగా మారతాయి. చట్టపరమైన వ్యవహారాల్లో కూడా సానుభూతి ప్రధాన పాత్ర పోషిస్తుంది. ప్రస్తుతం ఉన్న ప్రపంచంలో మహిళా భద్రత అంటే కేవలం రక్షణ చర్యలు కాదు; అది మానసిక, సామాజిక, భావోద్వేగ స్థిరత్వాన్ని పునరుద్ధరించే ప్రక్రియ. ఈ ప్రక్రియలో జెండర్ స్టడీస్ విద్యార్థులు ముందుండాలి. వారు మహిళా హక్కుల ఉద్యమానికి శాస్త్రీయ దృష్టికోణం తీసుకురాగలరు. కాబట్టి, ప్రభుత్వం ఈ కోర్సు విద్యార్థులను కూడా ఉమెన్ సేఫ్టీ వింగ్ కౌన్సిలర్ పోస్టుల కు అర్హులుగా గుర్తించి, ప్రత్యేక నోటిఫికేషన్లు ఇవ్వడం అవసరం. ఇది కేవలం విద్యార్థుల భవిష్యత్తు పరిరక్షణ మాత్రమే కాదు మహిళా భద్ర తా వ్యవస్థను మరింత సున్నితమైన, సమర్థవంతమైన, మానవీయ దిశగా నడిపించే ఒక ప్రగతిశీల అడుగు అవుతుంది.

# జిఎస్‌టి తగ్గింపు కార్పొరేట్లకు వరం


కె. రామకృష్ణ,
సిపిఐ జాతీయ కార్యదర్శి

ఇటీవల కేంద్ర ప్రభు త్వం తీసుకున్న జిఎస్‌టి (వస్తు సేవల పన్ను) తగ్గింపు నిర్ణయం సామాన్యుడికి ఉపశమనంగా ప్రచారంచేస్తూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు నేతృత్వంలోని ప్రభుత్వం ఈ తగ్గింపును ప్రజలకు ఒక విజయోత్సవంగా చూపిస్తూ వందల కోట్లు ఖర్చుచేస్తూ ప్రచార కార్యక్రమాలు చేపట్టింది. కానీ, గణాంకాలు, వాస్తవ పరిస్థితులు పరిశీలిస్తే, ఈ చర్యలు సామాన్య ప్రజలకన్నా పెద్ద కంపెనీలకే లాభం చేకూర్చే విధంగా ఉన్నాయని స్పష్ట మవుతుంది.

దేశవ్యాప్తంగా 2025 ఆర్థిక సంవత్సరంలో జిఎస్‌టి వసూళ్లు ఇలా ఉన్నాయి:

- మహారాష్ట్ర: రూ. 3,59,855 కోట్లు
- కర్ణాటక: రూ. 1,59,564 కోట్లు
- గుజరాత్: రూ. 1,36,748 కోట్లు
- తమిళనాడు: రూ. 1,31,115 కోట్లు
- హర్యానా: రూ. 1,19,362 కోట్లు
- ఉత్తర ప్రదేశ్: రూ.1,12,212 కోట్లు
- ఢిల్లీ: రూ.77,002 కోట్లు
- పశ్చిమ బెంగాల్: రూ. 66,892 కోట్లు
- తెలంగాణ: రూ. 62,987 కోట్లు
- ఒడిశా : రూ. 60,928 కోట్లు.

ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌కు చోటులేకపోవడం గమనార్హం. రాష్ట్రం 2025లో జిఎస్‌టి ద్వారా వసూలు చేసిన ఆదాయం:

- మే: రూ. 3,803 కోట్లు (2% తగ్గుదల)
- జూన్: రూ. 3,634 కోట్లు
- జూలై: రూ. 3,803 కోట్లు (SGST ₹1,226 కోట్లు, IGST ₹1,704 కోట్లు)
- ఏప్రిల్–జూన్ త్రైమాసికం: రూ.8,860 కోట్లు (3.4%వృద్ధి మాత్రమే). దేశ సగటు జిఎస్‌టి వృద్ధి 10% దాటుతుండగా ఆంధ్రప్రదేశ్ 3% వద్ద ఆగిపోవడం డబుల్ ఇంజన్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనంగా ఉంది.

**మార్కెట్ల మందగమనం**

జిఎస్‌టి తగ్గింపు చర్య వెనుక ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ఉన్న ప్రధాన ఉద్దేశ్యం మందగించిన మార్కెట్లకు ఊపిరి పోయడం. ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, రియల్ ఎస్టేట్ రంగాలు గత రెండు సంవత్సరాల్లో తీవ్ర మాంద్యానికి గురయ్యాయి. ఈ రంగాలను మళ్లీ కదిలించడానికి పన్ను తగ్గింపుల రూపంలో బహుళజాతి సంస్థలకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ప్రోత్సాహం అందించింది. ఈ చర్యలు ప్రధానంగా కార్పొరేట్ వర్గాలకు మేలుచేసే విధంగా ఉన్నాయని ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు.

**సామాన్యుడికి స్వల్ప లాభమే**

ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 1.68లక్షల కుటుంబాలు ఉంటే వాటిలో 1.46లక్షల కుటుంబాలు తెల్ల రేషన్ కార్డు కలిగినవే. ఈ వర్గానికి తగ్గిన జిఎస్‌టి వల్ల ఏడాదికి కలిగే లాభం గరిష్టంగా ₹5,000 మాత్రమే. నెలకు ఇది ₹400 చొప్పునే వస్తుంది. మరోవైపు, వస్తువుల ధరలు తక్షణంగా తగ్గకపోవడం, వ్యాపారులు పన్ను తగ్గింపును వినియోగదారులకు అందించకపోవడం వల్ల ఈ లాభం కూడా చాలా సందర్భాల్లో ప్రజల చేతికి చేరడం లేదు.

సామాన్యుల జీవనంలో ముఖ్యమైన అంశం — పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్.ఇవి జిఎస్‌టి పరిధిలో లేవు.

దీని వల్ల కేంద్రం, రాష్ట్రాలు ఎక్సైజ్, వ్యాట్ పన్నుల రూపంలో భారీ ఆదాయాన్ని పొందుతున్నాయి.

ఈ పన్ను వనరులను వదులుకోవడానికి ప్రధాని మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదు. అందువల్ల జిఎస్‌టి తగ్గింపుతో నిజమైన ప్రజా ఉపశమనం సాధ్యం కాదు.

**కార్పొరేట్లకు లాభాల పంట**

పన్ను తగ్గింపు ప్రధానంగా ఆటోమొబైల్ రంగానికే వర్తించింది. ఇన్నోవా వంటి SUVలు, కొన్ని చిన్న కార్ల పైన పన్ను తగ్గడంతో మధ్యతరగతి పైభాగం, కార్పొరేట్ ఉద్యోగులు మాత్రమే లాభం పొందారు. రెండు చక్రాల వాహనాలు లేదా ప్రజా రవాణా ఛార్జీలలో మాత్రం చెప్పుకోదగిన మార్పు లేదు. ఈ తగ్గింపు సాధారణ ప్రజానీకానికి సంబంధం లేనిది.

**చేనేతపై అంతులేని నిర్లక్ష్యం**

ఆంధ్రప్రదేశ్‌లో వేలాది చేనేత కుటుంబాలు ఉన్నప్పటికీ చేనేత వస్త్రాలపై జిఎస్‌టి మినహాయింపు ఇప్పటికీ లభించలేదు. దీని ఫలితంగా చేనేత రంగం తీవ్ర నష్టాలను ఎదుర్కొంటోంది.

చేనేత వస్త్రాలపై జిఎస్‌టి పూర్తి గా రద్దు చేయాలి అనే డిమాండ్ కేంద్రానికి ఏళ్లుగా వెళ్తున్నా స్పందన లేదు. ఇది ప్రభుత్వ విధానాల్లోని సామాన్య వ్యాపారాల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనం.

**రాష్ట్ర ప్రభుత్వ ప్రచారోత్సవం**

ఈ స్థితిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు చేస్తూ జిఎస్‌టి తగ్గింపును సంబరంగా జరపడం బాధాకరం. రాష్ట్రంలో ఉద్యోగాల కొరత, విద్యుత్ ఛార్జీల పెరుగుదల, రైతు సంక్షోభం, చిన్న వ్యాపారాల మూతపడటం వంటి సమస్యలు ముదురుతున్నాయి. ఈ పరిస్థితుల్లో జిఎస్‌టి సంబరాలు ప్రచార రాజకీయాలకు పరాకాష్ట.

జిఎస్‌టి వసూళ్లలో తగ్గిన వృద్ధి రేటు ఆర్థిక కదలికలు స్తబ్ధత చెందుతున్నాయని సూచిస్తోంది. చిన్న వ్యాపారాలు మూతపడటం, కార్మిక వర్గాల ఆదాయం తగ్గడం వంటి అంశాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలహీనపరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రచారం కంటే ఆర్థిక పునరుజ్జీవన మే అవసరం.

జిఎస్‌టి వంటి పన్ను వ్యవస్థ ప్రజల జీవితాన్ని నేరుగా ప్రభావితం చేస్తుంది. వస్తువుల ధరలు, జీవన వ్యయం, వ్యాపార చైతన్యం అన్నీ దీనికి సంబంధం. కానీ ప్రభుత్వానికి ఈ వాస్తవాల కంటే ప్రచార బాణీలు ముఖ్యమైపోయాయి.ఇది ప్రజాస్వామ్య బాధ్యతకు విరుద్ధం. జీఎస్టీ తగ్గింపు ప్రజలకు నిజమైన ఉపశమనం ఇవ్వలేదు. అయితే పెద్ద కంపెనీలు, ఆటోమొబైల్ రంగం, కార్పొరేట్ వర్గాలు గణనీయమైన లాభాలు పొందాయి. ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలు జీఎస్టీ వసూళ్లలో వెనుకబడి ఉన్నప్పుడు ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి బదులు ప్రచారంలో తేలడం ఆందోళన కలిగించే విషయం. నిజమైన ఆర్థిక ఉపశమనం కావాలంటే ...

- పెట్రోల్, డీజిల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తేవాలి
- చేనేత పరిశ్రమలకు పూర్తి మినహాయింపు ఇవ్వాలి
- చిన్న వ్యాపారాల ప్రోత్సాహానికి పన్ను విధానాలు పునర్నిర్మించాలి.

# అంతరిస్తున్న అరుదైన జీవజాతులు

మంచు పర్వతాలకు అందాలను అద్దే జంతువులుగా మంచు చిరుత పులులు లేదా స్నో లిపర్డ్స్‌లు మన మనసులను దోచుకుంటూనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా మంచు చిరుత పులుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ, జీవ వైవిధ్యానికి విఘాతంగా నిలుస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వీటి సంఖ్య 3,920 నుంచి 6,590 వరకు మాత్రమే ఉండడాన్ని గమనించారు. ప్రపంచ దేశాల్లో మంచు చిరుతల సంఖ్య అత్యధికంగా చైనా (2,000– 2,500) లో ఉండగా, మంగోలియా రెండవ స్థానంలో నిలుస్తున్నది. అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సంఘం (ఐయూసిఎన్) అధ్యయనాల ప్రకారం మంచు చిరుత పులుల మనుగడ ప్రశ్నార్థకం గా మారినుందని హెచ్చరిస్తున్నది. ఈ గంభీరమైన విషయాన్ని గుర్తించిన ఐరాస జనరల్ అసెంబ్లీ, వీటిని పరిక్షించుకోవడానికి ప్రతి ఏట 23 అక్టోబర్ 23 రోజున అంతర్జాతీయ మంచు చిరుత పులుల దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ ది స్నో లిపర్డ్స్) పాటించారని ప్రపంచ దేశాలను కోరుతున్నది. కాలక్రమంలో మంచు చిరుతల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణాలుగా ప్రతికూల వాతావరణ మార్పులు, ఎముకలు/ వెంట్రుకల కోసం అక్రమ వేటలు, సహజ ఆహారం అందక పోవడం, మానవ తప్పిదాలతో వీటి సంఖ్య తగ్గడం, లాంటివి ఉన్నాయి. మానవ తప్పిదాలతో వీటి సంఖ్య తగ్గడం రాబోయే జీవ వైవిధ్య ప్రమాదాన్ని సూచిస్తున్నది. వీటి మనుగడ కు అవసరమైన ఆరోగ్యకర జీవనాలను కల్పిస్తూ వీటి శ్రేయస్సు కు పాటుపడదాం. రేపటి తరాలకు వీటిని అరుదైన ఆస్తులుగా బహుకరిద్దాం.

**(23 అక్టోబర్ అంతర్జాతీయ మంచుపులుల దినోత్సవం సందర్భంగా)**

# ఉరికొయ్యను ఎదిరించిన ఎర్రబోతు రాంరెడ్డి

ప్రజలను ఉత్తేజపరిచిన పాటలతో, భూమి కోసం, భుక్తి కోసం, నిరంకుశ పాలన నుంచి విముక్తికోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అమరులైన వందలాది వీరుల నెత్తుటి చుక్కలతో తడిచిన తెలంగాణ నేల ఇది. నేటి తరాలకు ఆ నెత్తుటి మరకలు, పోరాటాల స్ఫూర్తి సువాసనలు వెదజల్లుతుం టే, నాడు నిజాం రజాకార్ల దురాగతాలు పుస్తకాల రూపంలో చరిత్రగా కళ్లముందు సజీవ సాక్ష్యాలుగా నిలబడి పలకరిస్తుంటాయి. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిజాంరజాకార్ల దాడులను ఎదిరించి వీరోచితంగా పోరాడిన పదహారేళ్ల యువకుడి త్యాగ చరిత్ర ఇది. నల్గొండ జిల్లా, చిట్యాల మండలంలోని అప్పాజీపేట గ్రామంలో ఎర్రబోతు బుచ్చిరెడ్డి, సత్తమ్మ దంపతులకు ఎర్రబోతు రాంరెడ్డి 1933, అక్టోబర్ 10వ తేదీన జన్మించారు. చిన్నతనం నుంచే చురుకైన స్వభావం కలిగిన రాంరెడ్డి, ప్రాథమిక విద్యను స్వగ్రామంలోనే పూర్తి చేశారు. అనంతరం నల్గొండలోని మాల్‌బౌలీ ఉర్దూ మీడియం పాఠశాలలో ఏడవ తరగతి వరకు చదువుకున్నారు. రాంరెడ్డి తన తెలివితేటలు, ధైర్యసాహసాలతో ఉద్యమ నాయకుల దృష్టిని ఆకర్షించారు. ఆయన ఉద్యమకారులకు రహస్యంగా మీజాన్ పత్రికను సమర్థవంతంగా చేరవేశారు. తన సహచరులతో కలిసి గ్రామగ్రామాన తిరుగుతూ, నిజాం పాలన కు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేశారు.

సాయుధ పోరాటంలో ఇన్‌ఫార్మర్ల బెడద అనివార్యం కాగా, రాంరెడ్డి తన సూక్ష్మ దృష్టితో రజాకార్ల ఇన్‌ఫార్మర్లను, ప్రభుత్వానికి సమాచారం అందించే గ్రామస్తులను గుర్తించారు. నార్కెట్‌పల్లి మండలం, చిన్ననారాయణపురంలో ఇద్దరు ఇన్‌ఫార్మర్ల కాల్చివేత కేసులో దళ నాయకుడిగా రాంరెడ్డిపై అభియోగం మోపబడింది. 1948 సెప్టెంబర్ 17న నిజాం లొంగుబాటు తర్వాత సైనిక గవర్నర్ పాలనలో కమ్యూనిస్టులపై నిర్బంధం పెరిగింది. ఔరవాణి, బ్రహ్మణ వెల్లంల మధ్య పొలంలో ఉన్న రాంరెడ్డిని పోలీసులు అరెస్టు చేసి, ఖమ్మం కాన్సంట్రేషన్ క్యాంపునకు పంపారు. నల్గొండలో ఏర్పాటైన స్పెషల్ ట్రిబ్యునల్‌లో దొంగ సాక్ష్యాలతో విచారణ జరిపి, ఆయనకు ఉరిశిక్ష విధించారు. అప్పటికి రాంరెడ్డి వయసు 17 సంవత్సరాలు. ఈ క్రమంలో, నార్కెట్‌పల్లి మండలంలో ఇద్దరు ఇన్‌ఫార్మర్లను రాంరెడ్డి దళం హతమార్చింది. ఆ ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొనకపోయినప్పటికీ, దళ నాయకుడిగా ఆయనపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. భారత యూనియన్‌లో తెలంగాణ విలీనం అయిన తర్వాత కూడా కమ్యూనిస్టులపై నిర్బంధం కొనసాగింది. ఈ నేపథ్యంలో అరెస్టయిన రాంరెడ్డిపై నల్గొండలో స్పెషల్ ట్రిబ్యునల్ విచారణ జరిపి, 17 ఏళ్ల వయసులోనే ఉరిశిక్ష విధించింది. ఆయనతో పాటు మరో 11మంది యువకులకు కూడా మరణశిక్ష పడింది. ఈ సమయంలో ఒక అమెరికన్ మహిళా జర్నలిస్ట్ చంచల్‌గూడ జైలును సందర్శించి, రాంరెడ్డిని ఇంటర్వ్యూ చేసింది. ఆమె 'బాలుడికి ఉరిశిక్ష' (Execution of a Boy) శీర్షికతో 'టైమ్' మ్యాగజైన్‌లో రాసిన కథనం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. లండన్ నుండి వచ్చిన డి.ఎన్.ప్రిట్ బృందం సుప్రీంకోర్టులో వాదనలు వినిపించడంతో, నాటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ జోక్యం చేసుకుని ఉరిశిక్షను రద్దుచేసి, యావజ్జీవ కారాగార శిక్షగా మార్చారు. అలా ఏడేళ్ల జైలు శిక్ష అనంతరం విడుదలయ్యారు. అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో 2018 నవంబర్ 23వ తేదీన తుదిశ్వాస విడిచారు.



**(అక్టోబరు 23న రాంరెడ్డి వర్ధంతి)**

కొండేటి ప్రకాష్, 7981781086.

## అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపనలు



ప్రజాపక్షం/గూడూరు; మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం కేంద్రంలో పనులుకు బుధ వారం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి సీత క్క శంకుస్థాపనులు చేశారు.కొత్తగూడ మండల కేంద్రంలో 13 కోట్ల రూపాయల వ్యయంతో 30 పడకల సామర్థ్యం కలిగిన నూతన ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణానికి 12 కోట్ల రూపాయలు తో మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేశారు.అనంతరం మండలంలో కేంద్రంలో కళ్యాణలక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకుమంత్రి సీతక్క పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి సుధీర్ రాంనాద్ కేకన్ అడిషనల కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో నాయకలు పాల్గొన్నారు.

## 'ప్రజాపక్షం'కు ఎసిపి ప్రశాంత్ రెడ్డి శుభాకాంక్షలు



ప్రజాపక్షం/కాజీపేట : ప్రజాపక్షం జాతీయ తెలుగు దినపత్రిక ఏడవ వార్షికోత్సవం సందర్భంగా కాజీపేట ఎసిపి పింగిళి ప్రశాంత్ రెడ్డి పత్రిక యాజమాన్యానికి, పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఎసిపి కార్యాలయంలో ప్రజాపక్షం పత్రిక వార్షికోత్సవం సందర్భంగా ఎసిపి పింగిళి ప్రశాంత్ రెడ్డి కేక్ కట్ చేసి విలేఖరులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రతిబింబించే విధంగా ప్రజాపక్షం ముందుకు సాగుతూ ప్రజాభిమానం చూరగొనాలని ఆకాంక్షించారు.ప్రజాపక్షం పత్రిక జిల్లా ప్రతినిధి తోట సుధాకర్, నవ చేతన బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు, సిపిఐ జిల్లా నాయకులు మద్దెల ఎల్లేష్, మాలోతు శంకర్, వరంగల్ క్రైమ్, హనుమకొండ, హసన్ పర్తి విలేఖరులు కుక్కల రాజు, ఎండి ఉస్మాన్ పాషా, ఎర్ర కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పత్తి అమ్మకంలో పారదర్శకత లేకుండా రైతులపై కొత్త భారం?

ప్రజా పక్షం/నెక్కొండ: తెలంగాణ పత్తి సీజన్ మొదలైంది. పంట చేతికొచ్చి రైతులు అమ్మకానికి సిద్ధమవుతున్న సమయంలో ప్రభుత్వం కొత్త నిబంధనలు అమలుచేస్తుంది. ఇకపై పత్తిని కనీస మద్దతు ధరకు విక్రయించాలంటే రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా మూడు రోజుల ముందుగానే స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంది. ఈ మార్పు పత్రికల్లో వినిపించేటప్పుడు వినూత్నంగా అనిపించినా గ్రామీణ స్థాయిలో ఇది రైతులకు మిశ్రమ అనుభవంగా మారే అవకాశం ఉందన్నారు. డిజిటల్ టెక్నాలజీ ద్వారా పారదర్శకత పెరగడం మంచిదే. మార్కెట్ యార్డుల్లో జరిగే అవకతవకలు, రద్దీ, మధ్యవర్తుల దౌర్జన్యం కొంత వరకు తగ్గొచ్చు. అయితే స్మార్ట్ ఫోన్ లేదా ఇంటర్నెట్ సౌకర్యం లేని చిన్న రైతులకు ఈ పద్ధతి కొత్త చిక్కులకే దారి తీస్తుంది. యాప్ ద్వారా బుకింగ్ చేయడం, తేమ శాతం కొలవడం వంటి అంశాలు గ్రామీణ రైతులకు అంత సులభం కాదు. రైతు స్నేహ పూర్వక విధానంగా మారాలంటే ఎఇఒలు, మార్కెట్ అధికారులు ప్రత్యక్ష సాయం అందించాలి. గ్రామాల్లో బుకింగ్ సెంటర్లు ఏర్పాటుచేయడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అవసరం. ప్రభుత్వ ఉద్దేశం మంచిదే కాని రైతు చేతికి తగిన సౌకర్యం చేరేలా వ్యవస్థను అమలుచేయడమే అసలు పరీక్ష.

## మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన శాసనసభ్యుడు దొంతి



ప్రజాపక్షం/నర్సంపేట:నర్సంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని నర్సంపేట శాసన సభ్యుడు దొంతి మాధవరెడ్డి నర్సంపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు దిగుబడి పట్ల అవగాహన కల్పించుకోవాలని, తక్కువ ఎరువులను వాడుతూ అధిక దిగుబడులు వచ్చే విధంగా శాస్త్రీయ కోణంలో వ్యవసాయం చేయాలని, పంటకు పంటకు మధ్య డ్రాప్ హాలిడే చేస్తూ వ్యవసాయం కొనసాగించాలని తద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, నర్సంపేట పిఎసిఎస్ చైర్మన్ బొబ్బాల రమణారెడ్డి, మార్కెటింగ్ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, సహకార సంఘం అధికారులు,కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## కపాస్ కిసాన్ యాప్ అమలు వెనక్కి తీసుకోవాలి

### రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య

ప్రజాపక్షం/జఫర్‌గడ్: కపాస్‌కిసాన్ యాప్ వలన రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కావున వెనక్కి తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాప్‌తో సాంకేతిక లోపాలు, చెల్లింపుల ఆలస్యం, డేటా తప్పులు, ఇంటర్నెట్ సమస్యలు, రైతుల ఆర్థిక నష్టాలకు కారణమవుతున్నాయన్నారు. కపాస్‌కిసాన్ యాప్‌లోని సాంకేతిక సమస్యలను సరిచేయాలని, యాప్‌ను తెలుగు బాషలో అందుబాటులోకి తేవాలని, రైతులకు వాడకం గురించి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, చెల్లింపులో ఆలస్యమైతే వడ్డీతో చెల్లించాలన్నారు. కపాస్ కిసాన్ యాప్ వంటివి తీసుకొస్తూ సిసిఐని లేకుండా చేయడం కోసం కుట్ర చేస్తుందని, దీన్ని రైతాంగం పసిగట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు భిక్షపతి, శ్రీను, నాయకులుపాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం/జనగామ టౌన్: జిల్లాలోని ఔట్ సోర్సింగ్ పోస్టులు మోడల్ స్కూల్ టైప్4 కేజీబీవీ బచ్చన్నపేట, స్టేషన్‌ఘనపూర్, కొడకండ్ల, నర్మెట, జఫర్‌గడ్‌లలో ఒక్కొక్క ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని జిల్లా విద్యాధికారి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 22 నుండి 26 వరకు దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. అర్హతలు కలిగిన ఆస్తి గల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు



ప్రజాపక్షం/లింగాలఘణపురం:రైతులు దళారి చేతులలో మోసపోకుండా, రైతులకు, తెలంగాణ ప్రభుత్వం, అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని, జనగామ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, కొల్లూరి శివకుమార్ అన్నారు. బుధవారం, మండలంలోని, జీడికల్, సిరిపురం, నాగారం, ఐకెపి ఆధ్వర్యంలో, కళ్లెం మాణిక్యపురం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఆధ్వర్యంలో, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, వారు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, రైతులు పండించిన ధాన్యాన్ని, నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించాలని ఆయన తెలిపారు. రైతులు దళారి చేతిలో మోసపోకుండా, రైతులకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్, ఉపేందర్, వైస్ చైర్మన్, చౌదరపల్లి భాస్కర్, పిఎసిఎస్ డైరెక్టర్, వేముల కృష్ణారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు, మాజీ ఎంపిటిసి, చీట కోర్ సంపత్ బస్వగాని అనిల్ గౌడ్, ఆయాశాక అధికారులు,రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన పెనుప్రమాదం

ప్రజాపక్షం/వేలేరు : వేలేరు మండలకేంద్రంలోని పాతబ్రాండిషాపు అంజద్ కిరాణా షాపు సమీపంలో టిఎస్ 08 యుబి 7093 నెంబరు గల ట్రాలి ఆటో బుధవారం పెనుప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు,ట్రాలీని రోడ్డుకు ఎడమప్రక్కన కిరాణం షాపు ముందు డ్రైవర్ ఆపి ప్రక్కనేగల షాపులో సామాను కొనుగోలుకు వెళ్లే క్రమంలో ట్రాలీ ఆటో డౌన్‌లో ఉండే సరికి ఎదురుగా ఉన్నా 15 కెవి డిటిఆర్ ప్రక్కనే గల మురికి కాలువలోకి చొచ్చుకెల్లడం జరిగింది ప్రక్కనే ఉన్న విద్యుత్ స్థంభాన్ని ఢీకొంటే ట్రాలీలోగల వ్యక్తులు అక్కడికిఅక్కడే మృతిచెందేదని స్థానికులు,విద్యుత్ లైన్‌మెన్ తదితరులు తెలిపారు.లైన్‌మెన్ ఆసమయంలో అప్రమత్తమై విద్యుత్ నిలిపివేయగా గ్రామస్తులు ట్రాలీని ట్రాక్టర్ సహాయంతో బయటకు తీయడం జరిగింది.

# వైభవంగా బ్రహ్మోత్సవాల నిర్వహణ

**శాశ్వత ప్రాతిపదికన ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలి,ఆలయ ఆవరణలో పచ్చదనాన్ని పెంపొందించాలి, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



ప్రజాపక్షం/లింగాలఘణపూర్:జీడికల్ ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించి శాశ్వత ప్రాతిపదికన 5నుండి 10కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. వచ్చే నెలలో జరగనున్న లింఘాల ఘనపూర్ మండలం జీడికల్ శ్రీరామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని చేపట్టాలిసిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఆలయం వద్ద స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యుడు కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వచ్చే నెల 4 వ తేదీ నుండి 17 వరకు జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. వచ్చే నెల 10 వ తేదీన జరిగే స్వామి కల్యాణికి అన్ని శాఖల అధికారులు సమన్వయముగా పని చేయాలని అన్నారు. గుడి పక్కన ఆలయ ప్రహరీ గోడ నుండి గుండం వరకు మెట్లు, రెండు గుండాల వద్ద ఫన్సింగ్, గ్రామం నుండి ఆలయానికి వచ్చేందుకు సిసి రోడ్, కల్యాణ మండపం వద్ద పిచ్చి చెట్లను తొలగింపు,ల్యాండ్ లేవలింగ్ తదితర పనులను వెంటనే చేపట్టాలని తెలిపారు. అటవీ శాఖ అధికారుల సహకారంతో స్వామి నిత్య కైంకార్యానికి పూల తోట ఏర్పాటు చేయాలని అన్నారు. ఆలయ సమీపం అంత శుభ్రంగా చేసి, నీడను ఇచ్చే చెట్లను పెట్టి, పచ్చదనంతో ఆలయ పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండేలా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సెంట్రల్ లైటింగ్, రెడీమేడ్‌గా ఉండే టాయిలెట్స్‌లను అందుబాటులో పెట్టాలని వెల్లడించారు. శానిటేషన్ పక్కాగా జరగాలని, 24 గంటలు తాగు నీరు, విద్యుత్, మెడికల్ క్యాంపు, పోలీస్ భద్రత ఉండాలని అధికారులకు సూచించారు. నవంబర్ 3 వ తేదీ వరకు అన్ని పనులు అయిపోవాలని తెలిపారు. ముమ్మందు జీడికల్ దేవస్థానంకి సంబంధించి మాస్టర్ ప్లాన్ తయారు చేసి శాశ్వత అభివృద్ధి పనులను చేపట్టే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఆలయ అభివృద్ధిలో ప్రజలు, దాతలు కూడా భాగస్వామ్యంగా ఉండాలని కోరారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ, వివిధ శాఖల సమన్వయంతో గత జాతరను విజయవంతంగా నిర్వహించామని, ప్రత్యేక దృష్టితో ఈసారి కూడా అన్ని శాఖల అధికారులు వివిధ రకాల అభివృద్ధి పనులను చేపట్టి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. బ్రహ్మోత్సవాలు సజావుగా జరిగేందుకు జనగామ ఆర్‌డిఒ గోపీరామ్‌ని స్పెషల్ అధికారిగా నియమించామని, అలాగే కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేసి ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే తగు చర్యలు తీసుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు.సిసిరోడ్, మెట్లు, బుష్ క్లియరెన్స్, తాత్కాలిక టాయిలెట్స్ ఏర్పాటు చేస్తామని, ఎక్కువ శానిటేషన్ వర్కర్స్ పెట్టి ఆలయ పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండేల చూడాలని డిపిఒ ని ఆదేశించారు. శాశ్వతంగా కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ నిర్మాణంకి కుడా చర్యలు తీసుకుంటామని, మెడికల్ సిబ్బంది, మెడిసన్స్, అంబులెన్స్ అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి తెలిపారు. ఫైర్ సేఫ్టీ తీసుకోవాలని, ఎక్కువ బస్‌లు తిరిగేలా ఆర్‌టిసి అధికారులు చూడాలని, గత జాతర సందర్భంగా శాశ్వతంగా ట్రాన్స్‌ఫార్మ్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రొటోకాల్ సమస్యలు రాకుండా,చైన్ స్నాచింగ్ జరగకుండా గట్టి భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. క్లోరినేషన్ చేస్తూ ఉండాలని, రోజుకి 3 సార్లు టెస్ట్ చేస్తూ... తాగు నీరు ఎలాంటి కలుషితం జరగకుండా చూడాలని తెలిపారు.కార్యక్రమంలోడిసిపి రాజా మహేందర్ నాయక్,ఆర్‌డిఒగోపీరామ్, డిపిఒ స్వరూప, ఆలయ చైర్మన్ నరసింహులు, ఆలయ కార్య నిర్వహణ అధికారి వంశీ, డైరెక్టర్లు,విద్యుత్, ఇంజనీరింగ్, మెడికల్ తదితర శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

### టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/తొర్రూరు : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెర్లపా లెం గ్రామంలో 69వ ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి క బడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఎంపిక క్రీడోత్సవాలు హ నుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగా యి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై న ఝాన్సీరాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరిచేలా అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి రాష్ట్ర, జాతీ య స్థాయికి చేరుకునే విధంగా విద్యార్థులు కృషి చేయాలన్నారు. తమ ట్రస్టు ఆధ్వర్యంలో క్రీడల్లో రాణించే విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడలతో రోగనిరోధక వ్యవస్థకు కూడా సహాయపడుతుందన్నా రు.ఈ క్రీడోత్సవాల నిర్వహణకు హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.లక్ష30వేల ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందని తెలిపారు. ఝాన్సీరాజేందర్‌రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్టు, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం ప్రే రణాత్మకంగా సాగిందని నిర్వాహకులు తెలిపా రు. అనంతరం అధ్యాపకులు మాట్లాడుతూ ఝా న్సీరాజేందర్‌రెడ్డి సామాజిక సేవ చేయడంతో పాటు గ్రామీణ విద్యార్థులకు క్రీడా అవకాశాలు కల్పించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులతో పాటు ట్రోఫీలు అందజేసి అభినందించారు. పా ఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, క్రీడా నిర్వాహకులు, పార్టీ నా యకులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నాణ్యతను పరిశీలించి, పనులు నిర్వహించాలి

### జనగామ జిల్లా కలెక్టర్, రిజ్వాన్ భాషా షేక్



ప్రజాపక్షం/లింగాలఘణపురం: ఇందిరమ్మ ఇండ్లను నాణ్యతతో పరిశీలించి, ఇండ్ల నిర్మాణం పనులు చేపట్టాలని, అధికారులకు సూచించారు. మండలం లోని బండ్ల గూడెం గ్రామంలోని, మండల కేంద్రంలోని, నిర్మాణం జరుగుతున్న, ఇందిరమ్మ ఇండ్లను, పనులను జనగామ జిల్లా కలెక్టర్, రిజ్వాన్ పాషా షేక్ పరిశీలించారు. అనంతరం, ఇండ్ల లబ్ధిదారులను, వారి యొక్క అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు, సమయం వృధా చేయకుండా, ఇండ్ల నిర్మాణం పనులు, వేగవంతంగా, నిర్మించుకోవాలని, వారి ఇండ్ల కలలు నెరవేరేందుకు,అందుకు వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, రవీందర్, మండల పరిషత్, అభివృద్ధి అధికారి, ఎన్ రఘురామకృష్ణ, గ్రామపంచాయతీ కార్యదర్శిలు, బండ్లగూడెం ఫీల్డ్ అసిస్టెంట్, గల్ల గల్ల యాకూబ్, గ్రామ ప్రజలుపాల్గొన్నారు.

## 'కుల నిర్మూలన'దళిత హక్కుల పోరాట సమితి లక్ష్యం

### దళిత హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘీ ఎలేందర్



ప్రజపక్షం /వరంగల్ : సామాజిక న్యాయం,దళితుల ఐక్యత, రాజ్యాంగ హక్కుల సాధన, కుల నిర్మూలన దళిత హక్కుల పోరాట సమితి లక్ష్యంమని దళిత హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘీ ఎలేందర్ అన్నారు. వరంగల్ నగరంలోని సిపిఐ పార్టీ జిల్లా కార్యాలయం శివనగర్ తమ్మెర భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) 19వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘీ ఏలేందర్, జిల్లా అధ్యక్షులు జన్ను రవి లు మాట్లాడుతూ దళిత హక్కుల పోరాట సమితి 2006 అక్టోబర్ 22న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలో సామాజిక న్యాయం, దళితుల ఐక్యత, రాజ్యాంగ హక్కుల సాధన, కుల నిర్మూలన లక్ష్యాలతో స్థాపించబడిందన్నారు. మొదటి రాష్ట్ర అధ్యక్షులుగా గుండా మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా ఎం. బాల నరసింహ ఎన్నికైనట్లు పేర్కొన్నారు. సమాజాభివృద్ధికి తమ శ్రమను సమర్పించిన దళితులు నేటికీ అంటరానితనం, కులవివక్ష, అణచివేత, దాడులు, హత్యలు, సామాజిక బహిష్కరణలు వంటి అన్యాయాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి, నీరు, గాలి, వెలుగు, సమస్త ప్రజలకు సమాన హక్కుగా దక్కాల్సి ఉండగా దళితులు ఇంకా వాటికి దూరంగా ఉన్నారని, విద్య, వైద్యం, ఉపాధి దొరకని ద్రాక్షగా మారిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాల వలన రిజర్వేషన్లు, సౌకర్యాలు, హక్కులు హరించబడుతున్నాయన్నారు. దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి కోసం కులవివక్ష నిర్మూలన, సామాజిక న్యాయం, దళితుల ఐక్యత, రాజ్యాంగ హక్కుల సాధన కోసం డిహెచ్‌పిఎస్ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ దళిత సంఘాలను ఐక్యపరచడం ద్వారా విశాల ఐక్యత సాధించడానికి డిహెచ్‌పిఎస్ ఏర్పాటయిందని, కులవివక్షను ఎదుర్కొనే ప్రతి ఒక్కరు ఈ ఉద్యమంలో భాగమవ్వాలని, కులాంతర వివాహాలను ప్రోత్సహించడంతో పాటు అన్ని రంగాల్లో సమానత్వ సాధనకోసం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషి మియా, పనస ప్రసాద్, గుండె బద్రి, గన్నరపు రమేష్, తాళ్లపల్లి జాన్ పాల్, రాచర్ల రాజేందర్ , జన్ను రాజు, ఇనిగల శ్వేత, వేల్పుల నర్సింగరావు, జన్ను దీపిక, ఉషా, తదితరులు పాల్గొన్నారు.

## దళితుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు





### డిహెచ్‌పిఎస్ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు లావణ్య

ప్రజాపక్షం /భూపాలపల్లి:రాష్ట్రంలో దళిత హక్కులను పాలకు విస్మరిస్తున్నారని దళిత హక్కుల పోరాట సమితి జాతీయ కౌన్సిల్ సభ్యురాలు పొనగంటి లావణ్య ఆరోపించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రావినారాయణ రెడ్డి భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి 19వ ఆవిర్భావ వేడకులను కేక్ కట్ చేసి వేడకులు డిహెచ్‌పిఎస్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా లావణ్య మాట్లాడు తూ.. అనాది కాలం నుండి దళితులపై దాడులు, వివక్షలు జరుగుతున్నాయని,దళితులకు అందవల సిన సంక్షేమ పథకాలను అందించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైయ్యాని దుయ్యాబట్టారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి గత ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి మోసం చేసిందన్నారు.ఇప్పటికైన ప్రభుత్వాలు తమ విధానాలను మార్చుకోవాలని అన్నారు.ఈ కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అధికారంలోకి వస్తే మాజీవితాలు మారుతాయనుకున్న తరుణంలో ప్రభుత్వం అధికారం లోకి విచ్చి సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్న దళితుల అభివృద్ధిపై ఈ ప్రభుత్వం మాట్లాడక పోవడం విడ్డూరమన్నారు.దళిత బంధు తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం దళిత అభివృద్ధి కోసం 12 లక్షలు స్తామని చెప్పి ఇప్పటికి ఆచరణలో పట్టలేదని అన్నారు.ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల అభివృద్ధికి పాటుపడాలన్నారు. నాయకులు పెద్దమామల సంధ్య,చిట్యాల పద్మ,సుభద్ర,వాసం రజిత,పీక రవికాంత్,వైకుంఠం,ఎక్ రాములు,రాజేష్ పాల్గొన్నారు.

## ఆర్‌టిఎ అధికారులకే సైబర్ నేరగాళ్ల కుచ్చుటోపీ

### ఎసిబిపేరుతో పేరుతో రూ.10 లక్షలు వసూలు




ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : వరంగల్ ఆర్టీఏ అధికారులను ఎసిబిపేరుతో సైబర్ నేరస్తులు బురిడీ కొట్టించారు. కేసులను మాఫీ చేస్తామనే పేరుతో రూ.10 లక్షలకు పైగా కాజేశారు. చివరకు అధికారులకు అనుమానం రావడంతో ఎసిబితో పాటు పోలీసులను ఆశ్రయించారు. వారు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. వరంగల్ ఆర్‌టిఎకార్యాలయంలో కొన్ని రోజుల క్రితం ఎసిబి అధికారులు తనిఖీలు చేశారు. ఆ తర్వాత వారం క్రితం సైబర్ నేరస్తులు కార్యాలయంకు ఫోన్ చేశారు. ఆర్‌టిఎ జిల్లా అధికారిని లైన్‌లోకి తీసుకొని కేసు విషయంపై బెదిరింపులు చేశారు. ఆయనను లైన్లో పెట్టి మరో అధికారితో మాట్లాడారు. కేసులు మాఫీ కావాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిజిటల్ అరెస్టు పేరు మీద వారిని లైన్లోనే ఉంచి మాట్లాడారు.విడతల వారీగా వారి నుంచి డబ్బులను వసూలు చేశారు. రూ.10 లక్షలకు పైగా డబ్బులు వేయించుకొని వదిలిపెట్టారు. వారు మాట్లాడే విధానంలో అనుమానం వచ్చిన ఆర్‌టిఎ అధికారులు తర్వాతఎసిబి అధికారులతో మాట్లాడారు. తాము మోసపోయామని గుర్తించారు. వెంటనే ఎసిబి అధికారుల సూచన మేరకు వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ప్రస్తుతం అధికారులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫోన్ కాల్, బ్యాంక్ అకౌంట్ల వివరాల ప్రకారం కర్ణాటకలోని బీదర్ ప్రాంతం నుంచి సైబర్ నేరస్తులు ఈ నేరానికి పాల్పడినట్లు గుర్తించారు. వారిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ విషయం సంచలనం సృష్టించగా ఎసిబిఅధికారులు ఎవరూ నేరుగా అధికారులతో మాట్లాడరని, అటువంటి కాల్స్ వస్తే తమ దృష్టికి తీసుకురావడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని ఎసిబి డిఎస్‌పిసాంబయ్య తెలిపారు. సైబర్ నేరస్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎసిబి అధికారులు నేరుగా పట్టుకుంటారే తప్ప ఎవరికి ఫోన్లు చేయరని ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

## పోలీస్ జాగృతి కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం :వరంగల్ సిపి



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : పోలీస్ జాగృతి కళా బృందం నిర్వహించే సంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకరావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమీషనరేట్ పోలీస్ జాగృతి కళా బృందం సభ్యులతో వరంగల్ పోలీస్ కమిషనర్ తన కార్యాలయంలో ముచ్చటించారు. ఈ సందర్భంగా జాగృతి కళా బృందం గ్రామాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలుఎఎ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారో మొదలైన విషయాలను సిపికళా బృందం ఇంచార్జి ఎఎస్ఐ నాగమణిని అడిగి తెలుకున్నారు. అనంతరం సిపి మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ప్రజలకు సైబర్ నేరాలు, రోడ్ సేఫ్టీ, మూడ నమ్మకాలు,షీ టీం, డయల్ 100, మత్తు పదార్థాలపై అవగహన కల్పించే రీతిలో గ్రామీణ ప్రజలకు అర్థమయ్యే రీతిలో కథాంశాలతో ప్రదర్శనలు ఇవ్వాలని, అదే విధంగా కేవలం కథాంశాలే కాకుండా గత మూడు సంత్సరాలు గా సంబంధించి పూర్తి వివరాలను ప్రజలకు వివరించడంతో పాటు జరిగిన నష్టలపై ప్రజలకు వివరించాలని, ముఖ్యంగా కార్యక్రమాల నిర్వహణ కోసం కళా బృందం సభ్యులు ఒక నెల ముందుగానే చక్కటి ప్రణాళిక ను రూపొందించుకోవడంతో పాటు, సంబంధిత అధికారుల నుండి పూర్తి సమాచాన్ని సేకరించుకోవాలని బృందం సభ్యులకు తెలపడంతో పాటు, కళా బృందం కార్యాచరణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిందిగా ఎ సిపి ఎస్. బి 2 జాన్ నర్సింహులుకు సిపిసూచించారు. సిపితో ముచ్చటించిన వారిలో హెడ్ కానిస్టేబుళ్ళు విలియమ్, రత్నయ్య, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ పూల్ సింగ్ తో పాటు హోంగార్డ్స్ పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఎఐటియూసి నాయకులు

ప్రజాపక్షం/సత్తుపల్లి: వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించి, వారిని ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతూ సత్తుపల్లి మండల పరిషత్ అధికారి (ఎంపీడీఓ)కి ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని కార్మికులకు ఇచ్చే గౌరవేతనం కూడా గత ఐదు నెలలుగా పెండింగ్ ఉందని, తక్షణమే ఈ నెల 30వ తారీఖు నాటికి పెండింగ్ వేతనాలు బిల్లులు అన్ని కూడా చెల్లించాలని లేనియెడల ఈనెల 31 జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. మధ్యాహ్నం భోజనం వర్కర్స్ యూనియన్ ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహాదేవ లక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ రహీం మున్నిసా, జిల్లా కార్యవర్గ సభ్యురాలు జె వెంకటలక్ష్మి, బసవయ్య, తెలగారపు రామారావు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయండి

అదనపు కలెక్టర్ శ్రీజ

ప్రజాపక్షం/ ఖమ్మం : పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ ఆదేశించారు.44 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన పనులు పెండింగ్‌లో ఉన్నాయని పనులు పూర్తి చేసి ఎంబి రికార్డుల వివరాలు నమోదు చేస్తే బిల్లులు వెంటనే విడుదల చేయడం జరుగుతుందన్నారు. 44 పాఠశాలల్లో ఏ పాఠశాలలో పనులు ఎంత వరకు పూర్తి చేశారు, ఎక్కడ ఆగిపోయాయి అనే విషయంలో పూర్తి సమీక్ష నిర్వహించారు. నులు పెండింగ్ లో ఉంటే పాఠశాల సి బ్బంది, ఇంజనీరింగ్ అధికారుల వేతనాల్లో కోత వి ధించడం జరుగుతుందన్నారు. విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ సిహెచ్. రామకృష్ణ, ఎంపిడివోలు, ఎంఈవోలు, సంబంధిత పాఠశాలల హెడ్ మాస్టర్లు, ఏఈలు, పాల్గొన్నారు.



## మత్తు పదార్థాలను రవాణా చేసే వ్యక్తుల సమాచారం అందించండి

మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి



ప్రజాపక్షం/మణుగూరు: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ పిలుపు మేరకు నవంబర్ 15వ తేదీ వరకు జిల్లా పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైతన్యం డ్రగ్స్ పై యుద్ధం కార్యక్రమాలలో భాగంగా బుధవారం మణుగూరు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో సురక్షా బస్టాండ్‌లో, ఆర్టీసీ బస్సులు, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను ఫింగర్ ప్రింట్స్ స్కానర్ ద్వారా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిషేదిత గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా అక్రమ రవాణాను అడ్డుకోవడంలో భాగంగానే ఈ తనిఖీలు నిర్వహించడం జరిగిందని మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు పోలీసులు చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు. గంజాయి అక్రమ రవాణా చేసే వారి సమాచారం అందించి భాధ్యత గల పౌరులుగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని అన్నారు. మత్తుకు బానిసలై యువత తమ భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని తెలిపారు. ఎవరైనా నిషేదిత గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ గానీ, విక్రయిస్తూ గానీ పట్టుబడితే అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని, అవసరమైతే ఉన్నతాధికారుల అదేశాలతో పీడి యాక్టులను కూడా నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ తనిఖీలలో ఏడూళ్ళ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## ధాత్రి సహజ ఆహార ఉత్పత్తుల కేంద్రం ప్రారంభం



ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని తాళ్ళగొమ్మూరు గ్రామ పంచాయితీలో మహాలక్ష్మ మ్మ గుడి దగ్గర కాటిరెడ్డి సారధిరెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన ధాత్రి నాచురల ఆహార ఉత్పత్తుల కేంద్రం ప్రారంభోత్సవానికి మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత హాజరయ్యారు. ఈసందర్భంగా ఆహార ఉత్పత్తుల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా చూశారు. తయారయ్యే అన్ని పదార్థాలు ఆరోగ్యానికి మేలు చేసే విధంగా ఉన్నాయని అన్నారు. అందుబాటులో ఇంలాటి నాచురల్ ఉత్తత్పుల ఉండటం సంతోషించదగిన విషయమని తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలందరు అందుబాటులో ఉన్న ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో కాటిరెడ్డి సారధరెడ్డి, ధనలక్ష్మీ, కాటిరెడ్డి కృష్ణరెడ్డి, కైపు అంకిరెడ్డి, కైపు ఖగేందర్‌రెడ్డి, జయ, పేరం అరుణ, ఉమాదేవి, చల్లకోటి పూర్ణచందర్, గ్రామ పెద్దలు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

## ఘనంగా కొమురం భీం 125వ జయంతి వేడుకలు



ప్రజాపక్షం/సత్తుపల్లి: పట్టణంలోని కొమరం భీం విగ్రహం వద్ద కొమరం భీమ్ 125వ జయంతి వేడుకలను ఆదివాసిలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అక్టోబర్ 22, 1901 వ సంవత్సరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లోని జోడేఘాట్ ప్రాంతంలో జన్మించిన కొమరం భీం, ఆనాడు నిజాం పాలనకు వ్యతిరేకంగా జల్ జంగిల్ జమీన్ నినాదంతో ఆదివాసి హక్కుల కోసం పోరాడారని కొమరం భీమ్ ఆశయ సాధన కోసం, ఆదివాసి హక్కుల పరిరక్షణ కోసం నేడు మనం కూడా పోరాడవలసిన అవసరం ఉందని ఆదివాసి నాయకులు గుర్తు చేసుకున్నారు. వంకా వీరస్వామి, దారా భీమయ్య, తిరుమలరావు, కృష్ణారావు, పూచి గోవర్ధన్, భోగి వీరస్వామి, కుసిని శ్రీను, గంటా విష్ణు, పూచి నరేష్, పూచి విజయ్, మారుతి ధర్మారావు, మట్ట నాగేంద్ర, రేసు రామారావు, మారుతి బాబురావు, మారుతి సూరిబాబు, పూచి రవి పాల్గొన్నారు.

## సిపిఐ నాయకులు తుడుం వీరస్వామి మృతి


బాగం హేమంతరావు, దండి సురేష్ నివాళులు



ప్రజాపక్షం/కూసుమంచి: మండల పరిధిలోని నేలపట్ల గ్రామానికి చెందిన సిపిఐ గ్రామ శాఖ మాజీ కార్యదర్శి తుడుం వీరస్వామి అనారోగ్య కారణాలతో మంగళవారం రాత్రి మృతి చెందారు. పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న సిపిఐ జాతీయ సమితి సభ్యులు, ఖమ్మం జిల్లా నిర్మాణ బాధ్యులు భాగం హేమంతరావు, పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్ బుధవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి, ఎర్రజెండా కప్పి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వీరస్వామి గ్రామ శాఖ కార్యదర్శిగా పని చేసి పార్టీకి ఎన్నో సేవలను అందించారని, ఈ ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. సమస్యలపై పార్టీ ఎప్పుడూ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమంలో పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేశారని, గ్రామంలో ఆయన మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. పార్టీ జిల్లా సమితి సభ్యులు గుండెపోంగు మల్లేష్, మండల కార్యదర్శి భూక్యా నరసింహా, సహాయ కార్యదర్శి జిల్లా లింగయ్య, పార్టీ నాయకులు మర్రి వీరభద్రం, తుడుం భాస్కర్, పాల్గొన్నారు.

# ఆధునిక మౌలిక సదుపాయాలతో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ

**యోగితా రాణాతో మంత్రి తుమ్మల భేటీ**



ప్రజాపక్షం/ ఖమ్మం : దేశంలోనే తొలి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని కొత్తగూడెంలో అత్యాధునీక వసతులతో నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రణాళికను సిద్ధం చేసిందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఎర్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణాతో మంత్రి తుమ్మల సమావేశమయ్యారు. యూనివర్సిటీ నిర్మాణ ప్రగతిపై చర్చించి పలు సూచనలు చేశారు. ప్రపంచంలోనే రెండవ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ కొత్తగూడెంలో నిర్మితం కానుందని మైనింగ్ కళాశాలను సైన్స్ యూనివర్సిటీగా మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశ విద్య చరిత్రలో ఒక మైలురాయిగా ని లుస్తుందన్నారు. ప్రతిష్టాత్మక విద్యా సంస్థకు మాజీ ప్రధాని, ఆర్థికవేత్త డా॥ మన్‌మోహన్‌సింగ్ పేరు పెట్టడం ద్వారా తెలంగాణ ప్రభుత్వం గౌ రవప్రధమైన నిర్ణయం తీసుకుందన్నారు. యూ నివర్సిటీని అన్ని రకాల మౌలిక సదుపాయాలతో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రూపొందించాలని తుమ్మల అధికారులను ఆదేశించారు. సౌకర్యవంతమైన తరగతి గదులు, హాస్టళ్లు, గ్రం థాలయాలు, ప్రయోగశాలలు ఏర్పాటు చేయాల ని భవన నిర్మాణ రూపకల్పనకు సంబంధించి అంతర్జాతీయ ప్రమాణాలకు తగినవిధంగా ని ర్మించాలని, అగ్రశ్రేణి ఆర్కిటెక్‌ల సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న మైనింగ్ యూనివర్సిటీ అండర్ గ్రాడ్యూయేట్, పోస్టు గ్రా డ్యూయేట్ కోర్సులు కొనసాగుతున్నాయని వచ్చే వి ద్యా సంవత్సరం నుంచే పిహెచ్‌డి కోర్సులు ప్రా రంభించాలని ప్రభుత్వ నిర్ణయానికి యూనివర్సి టీ గ్రాంట్స్ కమిషన్ నుంచి అన్ని అనుమతులు తీ సుకోవాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తు భూ శాస్త్రవేత్తలు, ఖనిజ నిపుణులు, పర్యావరణ శాస్త్రవేత్తలు తయారు కా నున్నారని తుమ్మల విశ్వాసం వ్యక్తం చేశారు. ఎ ర్త్ యూనివర్సిటీ నిర్మాణానికి అవసరమైన భారీ నిధుల సమీకరణ కోసం ఎన్ఎండిసి సింగరేణి, కోల్ ఇండియా ప్రతినిధులతో చర్చించినట్లు తు మ్మల తెలిపారు. కొత్తగూడెంలో 300 ఎకరాల వి స్తీర్ణంలో నిర్మించబోయే ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ విద్య, ఉపాధి రంగాలకు సంబంధించి ఒక మార్గదర్శిగా ఉండబోతుందని, తెలంగాణ విద్యా రం గాన్ని ప్రపంచ స్థాయికి తీసుకుపోనుందని తు మ్మల తెలిపారు. భూశాస్త్రం, పర్యావరణం, ఖనిజ సంపదల వినియోగం, వాతావరణ మా ర్పులపై పరిశోధనలో ఈ యూనివర్సిటీ కీలకం కానుందన్నారు.

## దళిత వాడల్లో ఇళ్లు.. నిర్మాణానికి శంకుస్థాపన

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ప్రతీఏటా వర్షాకాలంలో శిథిలావస్తకు చేరిన తమ ఇండ్లను వదిలి పునరావాస కేంద్రాల్లో తలదాచుకునే పాతకొత్తగూడెం దళితవాడ కుటుంబాల కష్టాలను స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు తెరదించారు. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ఈ కుటుంబాలకు పక్కా గృహాలు మంజూరు చేయిస్తానని ఇచ్చిన హామీని ఆయన నిలబెట్టుకున్నారు. మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి నిరుపేద దళిత కుటుంబాల సొంతింటి కల నెరవేర్చారు. పట్టణంలోని పాత కొత్తగూడెం పరిధిలో గల దళితకుటుంబాలకు మంజూరైన 26 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ఘన స్వాగతం పలికి పూల మాలలు వేసి షాలువాలు కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడి దళిత కుటుంబాల పరిస్థితి వర్షాకాలంలో దయనీయంగా ఉందని, దీనిని గత పాలకులు గుర్తించక పోవడం బాధాకరమన్నారు. దళిత కుటుంబాలకు గృహ వసతి కల్పించడం సంతృప్తినిచ్చిందని, నిర్మాణాలు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేసి ఇచ్చే బాధ్యత అధికారులదే అన్నారు.సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, కార్పోరేషన్ కమీషనర్ సుజాత, సిపిఐ నాయకులు కంచర్ల జమలయ్య, నిమ్మగడ్డ వెంకటేశ్వర రావు, కోడి మల్లేష్, రామారావు, గడ్డం వెంకటేశ్వర్లు, బోయిన విజయ్‌కుమార్, సత్యనారాయణ చారి, భవాని, అధికారులు రవికుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

## రూ.లక్ష విలువైన గంజాయి పట్టివేత

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఓ ముగ్గురు యువకుల నుంచి రూ.లక్ష విలువైన గంజాయిని ఖమ్మంరూరల్ స్థానిక పోలీసులు పట్టుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. సిఐ ముష్క రాజు తెలిపిన వివరాల ప్రకారం...కస్నాతండాకు చెందిన వాంకుడోత్ వినోద్, రంగారెడ్డి జిల్లా కొత్తపేటకు చెందిన వస్కుల్ రాజు, హైదరాబాద్ ఎల్బీనగర్‌కు చెందిన గొడ్డెమల్ల సాయిరాం, మహబూబాద్ జిల్లా డోర్నకల్ మండలం మన్నెగూడెంకు చెందిన భూక్యా రోహిత్ కస్నాతండాలోని ఖమ్మంమహబుబాద్ హైవే పక్కన మందుతాగుతున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు వారిని పట్టుకుంటుండగా భూక్యా రోహిత్ పారిపోగా మిగిలిన ముగ్గరిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.లక్ష విలువైన గంజాయి లభ్యం అయ్యిందది. వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా..గంజాయిని ఒరిస్సాలోని మల్కనగరి నుంచి తీసుకొచ్చి డోర్నకల్ మీదుగా హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. పంచనామ నిర్వహించి సదరు నిందితులపై చట్టపరమైన కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిచ్చినట్టు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్లను సైతం స్వాధీన పరుచుకున్నారు.

## ప్రమాద ప్రాంతాలను గుర్తించండి


జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ప్రజాపక్షం/ ఖమ్మం : రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించి ప్రమాద ప్రాంతాలను గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టర్ సమావేశ మందిరంలో ఎనిమిదవ జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనదీప్ దురిశెట్టి, సిపి సు నీల్ దత్, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లు పాల్గొన్నారు. రోడ్లపై గుంతలు పూడ్చివేత నాణ్యతతో జరగాలని, ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఉపయోగించాలన్నారు. కల్లూరు, వైరా, సత్తుపల్లి, ఏదులాపురం మున్సిపాలిటీలలో ప్రధాన రోడ్లపై ఉన్న గుంతలను 15 రోజుల్లో పూడ్చి వేయాలని కలెక్టర్ ఆదేశించారు. నేషనల్ హైవే ఖమ్మం నగరానికి బైపాస్‌గా ఉంటుందని ఖమ్మం బై పాస్ వద్ద మరమ్మతు పనులు చేపట్టాలని రోడ్డు భ ద్రతా ప్రమాణాల క్రింద రంబుల్ స్ట్రిప్స్, రేడియం స్టిక్కర్స్, స్పీడ్ బోర్డులు ఏర్పాటు చేయాలని నేషన ల్ హైవే అధికారులను ఆదేశించారు. జాతీయ ర హదారులపై బ్లాక్ స్పాట్స్ గుర్తించి ప్రమాదాల ని వారణకు అవసరమై న చర్యలు చేపట్టాలన్నారు. వైరాలో ఒక అపార్ట్‌మెంట్ రోడ్డుపై మురుగునీరు వదలడం ఇంకుడు గుంత నిర్మించి రోడ్డుపై ము రుగునీరు రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నా రు. అక్టోబర్ 24న బైపాస్ నుంచి కలెక్టరేట్ వరకు ఫీల్డ్ విజిట్ చేపట్టి తీసుకోవాల్సిన చర్యలపై అక్టోబర్ 29 నాటికి రిపోర్టు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలల వద్ద రోడ్లపై రేడియం స్టిక్కర్లతో కూడిన స్కూల్ జోన్, గో స్లో బోర్డులు ఏ ర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. పాదాచారులకు ఉపయోగకరంగా తయారు చేయాలని, వ్యాపార వాణిజ్య సముదాయాల వద్ద తనిఖీలు చే పట్టి ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతను అప్పగించాలన్నారు. డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, ఆర్అండ్‌బి ఎస్ఈ యాకూబ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి కళావతిబాయి, జిల్లా రవాణా అధికారి వెంకటరమణ, నేషనల్ హైవే పిడిలు రామంజనే య రెడ్డి, దివ్య, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, ఆర్టివో, పోలీస్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## అమృత్ పథకం పనులు పరిశీలన

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : అమృత్ 2.0 పథకంలో భాగంగా కొత్తగూడెం పట్టణ తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించబోతోందని, పథకం నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో బుధవారం వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. రామవరం, సన్యాసిబస్తి, రైటర బస్తీ, రేగళ్ల పైపులైన్, నాగయ్యగడ్డలో నిర్మిస్తున్న భారీ నీటి నిల్వ ట్యాంక్ ప్రాంతాల్లో పర్యటించి నిర్మాణాలు పర్యవేక్షించారు. పైప్‌లైన్ల ఏర్పాటుతో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టమ తాగునీటి సమస్య పరిష్కారం కోసం అమృత్ పథకంలో భాగంగా రూ.124 కో ట్లు మంజూరయ్యాయని, ఈ నిధులతో సూర్యోదయస్కూల్ రోడ్‌లో, రామవరం నాగయ్య గడ్డ ఏరియాలో, పాత కొత్తగూడెం డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద భారీ నీటి ట్యాంకుల నిర్మాణం జరుగుతోంది. మోటార్లు అదేవిధంగా ట్యాంకుల అనుసంధానంగా 160 కి.మీ మేరా పైపులైన్ల ని ర్మాణం జరుగుతోందని తెలిపారు. పట్టణ ప్ర ధాన రహదారులు, బస్తీల్లో పైపులైన్ల నిర్మాణంతో ధ్వంసమైన రోడ్లను తిరిగి నిర్మించేందుకు చర్యలు తీసుకున్నామని, ఇప్పటికే ఆ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యకు కంటి తుడుపు చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపేందుకు తగిన ప్రణాళికతో ముందుకు పోతున్నట్లు తెలిపారు. అనంతరం పాత రామచంద్ర కళాశాల సమీపంలో అంబేద్కర్ భవన్ నిర్మాణానికి కూనంనేని శంకుస్థాపన చేశారు.సి పిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, కార్పోరేషన్ కమీషనర్ సుజాత, సిపిఐ నాయకులు కంచర్ల జమలయ్య, అధికారులు శ్రీనివాస్, రవికుమార్, నాగేంద్ర, రాంప్రసాద్, శ్రీకాంత్, ఉద య్, సిపిఐ నాయకులు సలిగంటి శ్రీనివాస్, కం చర్ల జమలయ్య, ఎస్‌కె ఫహీమ్, మునిగడప వెం కటేశ్వర్లు, శ్రీనివాస్, గోపికృష్ణ, మో హన్, జహీర్, పెయ్యల రంగారావు, శంకర్, వెంకన్న పాల్గొన్నారు.

## కడవరకూ కమ్యూనిస్టుగానే కాసియా నాయక్

పెద్దతండలో ఘనంగా 10వ వర్ధంతి వేడుకలు




ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : తను నమ్మిన్న సిద్ధాంతానికి కట్టుబడి కాసియా నాయక్ కడవరకు కమ్యూనిస్టుగానే కొనసాగారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంత్‌రావు అన్నారు. బుధవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని పెద్దతండలోని 5వ డివిజన్‌లో కాసియా నాయక్ 10వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత స్మారకస్థూపానికి సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాగం మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారం, గిరిజనుల హక్కుల సాధన, ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇప్పించడంలో కీలకమైన పోరాటాలు చేశారన్నారు. అటువంటి నిఖార్సైన కామ్రేడ్ ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. తన వారసులు, సిపిఐ కార్యకర్తలు తమ వారసత్వంగా ఆశయాలను పునికిపుచ్చుకొవాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూఈ ప్రాంతంలో సిపిఐ పార్టీగా ప్రజల పక్షాన పనిచేస్తున్న క్రమంలో అనేక నిర్బందాలు ఎదుర్కొన్నారన్నారు. వాటన్నింటినీ అధిగమిస్తూ ప్రజా సమస్యల పరిష్కరించడంలో అలుపెరగని సైనికుడిలా పనిచేశారన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మి డకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వెంపటి సురేందర్, బానోత్ రాంకోటి, సిపిఐ డివిజన్ నాయకులు గడ్డ, లఘుపతి, బాలాజీ, శ్రీను, కుమారులు హుస్సేన్, హుసేన్, రాజు, హాస్యనాయక్, భార్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలి

ప్రజాపక్షం/వైరా: వైరా మండలంలో సాగుచేసిన పంటలైన పెసర, మినుము, పత్తి, వరి పంటలు గత నెల రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు తీవ్ర నష్టం జరిగిందని, పంట నష్టం జరిగిన ప్రతి పంటకు ప్రతి ఎకరాకు రూ.30వేలు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైరా సిపిఎం ఆఫీస్ బోడేపూడి భవనం నందు వైరా రూరల్ మండల కార్యదర్శి వర్గ సభ్యులు సిపిఎం డివిజన్ కమిటీ సభ్యులు తోట నాగేశ్వర రావు అధ్యక్షతన బుధవారం జరిగిన ఈ సమావేశంలో భూక్యా వీరభద్రం పాల్గొని మాట్లాడుతూ మండలంలో రైతు లు వేసిన పంటలు పెసర, మినుము పంటలో వ ర్షాలకు తీవ్ర నష్టం జరిగిందని, అదేవిధంగా ప్ర తి పంటకు వైరస్‌కి ప్రతి దిగుబడులు రాని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అరకొరగా వచ్చిన పత్తి ఇప్పుడు దెబ్బతీసే దశలో ఉందని, గత నె లలో నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రతి పంటకు తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా బావులు, బోర్ల క్రింద వేసిన వరి పంట కో త దశలోకి వచ్చిందని, వర్షాలకు వరి పంట కూ డా నష్టం జరిగిందని అన్నారు. దెబ్బతిన్న పంటలను ప్రభుత్వ వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నష్టపరిహా రం ఇ వ్వని పక్షంలో రైతులను సమీకరించి సి పిఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేయాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, సిపిఎం వైరా మండల కార్యదర్శి శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు సుధాకర్, శ్రీనివాస రావు, మేడా శరాబంది, రమణ పాల్గొన్నారు.

## గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం



ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం గ్రానైట్ అండ్ మార్కర్స్ అసోసియేషన్ లో సభ్యుడైన వెంకటేష్ ఇటీవల గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న అసోసియేషన్ బాధ్యులు ఆయనకు ఆర్థిక సాయం అందించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సంఘ గౌరవ సలహాదా రు అదాలత్ నరేందర్, సంఘ అధ్యక్షులు కిషన్, జానిపాషా, వెంకటేశ్వర్లు, అంజిబాబు, గిరి, ఆకుల సైదులు, నర్సింహారావు, గో విందు, భద్రంపాల్గొన్నారు.

## అభివృద్ధిపై అధికారులతో చర్చ

ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై సత్తుపల్లి శాసన సభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ బుధవారం హైదరాబాద్‌లో పలువురు ఓఎస్‌డి అధికారులను కలిసి చర్చించారు.మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్, వాకిటి శ్రీహరిల ఓఎస్‌డిలను కలిసి పలు వినతిపత్రాలను అందించారు. సత్తుపల్లి అర్బన్ పార్క్, సత్తుపల్లి నియోజకవర్గం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ప్రధాన సెంటర్లలో నూతన జిమ్ సెంటర్ లు ఏర్పాటు చెయ్యాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు బీమిరెడ్డి సుబ్బారెడ్డి ఉన్నారు.

## బిసి నాయకులపై అట్రాసిటీ కేసులా..?

మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్

ప్రజాపక్షం/సత్తుపల్లి: బీసీ బందు జరిగితే బీసీ నాయకుల పై అట్రాసిటీ కేసులు ఏ విధంగా నమోదు చేస్తారని ప్రశ్నించింది బిజెపి త్రిసభ్య కమిటీ. ఈనెల 28న బీసీ బందులో బిజెపి నాయకుల పై జరిగిన దాడి ఘటనపై భాజపా నాయకత్వం నియమించిన త్రిసభ్య కమిటీ బృందం బుధవారం సత్తుపల్లి చేరుకుంది. ముందుగా దాడిలో గాయపడిన బిజెపి పట్టణ అధ్యక్షుడు భాణోత్ విజయ్ ని పరామర్శించి మేమున్నామని ధైర్యం చెప్పారు బాజాపా నాయకులు. అనంతరం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వర రావు, ఖమ్మం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ ఈవి రమేష్ ల అధ్యక్షతన బుధవారం పట్టణంలోని జే కన్వెన్షన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ పార్లమెంట్ సభ్యులు ఎం సీతారాం నాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్యేలు, మంత్రులు చెప్పినట్లుగా పోలీసులు చేసి తప్పించుకోలేరన్నారు. బిజెపితో తమాషాలు వద్దన్నారు. తక్షణమే బిజెపి నాయకులపై దాడికి దిగిన వారిని అరెస్టు చేయాలని లేకపోతే కేంద్ర హోమ్ మినిస్టర్ తదితరులు సత్తుపల్లి కి వస్తారని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ లపై చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ముఖ్యమంత్రి పదవిని బీసీలకు అప్పగించాలని స వాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కపట నాటకం ఆడుతుందన్నారు. బీసీలకు నిజంగా న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు చేసే హక్కు ఎవరికీ లేదని, కావాలనే ముస్లింలను బీసీలలో కలపాలని కాంగ్రెస్ పార్టీ చూస్తుందని, త ద్వారా బీసీ బిల్లు నీరుగారి పోగానే బిజెపి పైకి నెపం పెట్టాలని చూస్తుందన్నారు. పోలీసులు చూ సుకొని పని చేయాలని ఒక గిరిజన బిడ్డపై దాడి జరిగితే ఇంత వరకు ఎందుకు దాడి చేసిన వారిని అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. నిజంగా 42 శాతం రిజర్వేషన్లు పూర్తిగా బీసీలకు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్తే బిజెపి పూర్తి మద్దతు తెలుపుతుందన్నారు. రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఆత్మకూరు కాంతి కిరణ్, రాష్ట్ర ఓబిసి మోర్చా అధ్యక్షులు జి ఆనంద్ గౌడ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శులు గుత్తా వెంకటేశ్వరరావు, నాయుడు రాఘవ రావు, పా లేరు అసెంబ్లీ కాంటెస్ట్ అభ్యర్థి నున్నా రవికుమార్, మధిర కాంటెస్ట్ అభ్యర్థి విజయ రాజు, జిల్లా మీ డియా ఇంచార్జ్ బెనర్జీ చౌదరి ,జిల్లా కార్యదర్శులు నాగ సురేందర్ రెడ్డి, రామిశెట్టి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ణి వీరం రాజు, నకిరేకంటి వీరభద్రం, రవి రాథోడ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ జొన్నలగడ్డ నరేష్, సీనియర్ నాయకులు బాలకృష్ణారెడ్డి , రహంమతుల్లా, జిల్లా నాయకులు పర్సా రాంబాబు, పడిగల మధుసూదన్ రావు, మట్టా ప్రసాద్, మండల అధ్యక్షులు సాలి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# క్రీడ



# లెఫ్టినెంట్ కల్నల్‌గా నీరజ్ చోప్రా

భారత మేటి జావెలిన్ త్రోయర్, ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం దక్కింది. జావెలిన్ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాకు భారతీయ ఆర్మీలో గౌరవప్రదమైన లెఫ్టినెంట్ కల్నల్ ర్యాంక్‌ను అందజేశారు. ఢిల్లీలోని సౌత్ బ్లాక్‌లో ఆయన్ను ఆ ర్యాంక్‌తో సన్మానించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నీరజ్ చోప్రా కుటుంబం కూడా ఈ ఈవెంట్‌ను ప్రత్యక్షంగా వీక్షించింది. పట్టుదలకు, దేశభక్తికి నీరజ్ చోప్రా నిదర్శనమని రాజ్‌నాథ్ అన్నారు. ప్రభుత్వ గెజిట్ ప్రకారం నీరజ్ చోప్రా నియామకం ఏప్రిల్ 16వ తేదీన జరిగింది. జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్‌గా నయిబ్ సుబేదార్ ర్యాంకుతో నీరజ్ చోప్రా 2016 ఆగస్టులో భారతీయ సైన్యంలో చేరారు. నీరజ్ చోప్రాకు గతంలో పద్మశ్రీ, మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న, అర్జున అవార్డులు దక్కాయి. పరమ విశిష్ట సేవా మెడల్, విశిష్ట సేవా మెడల్ కూడా ఆయన గెలుచుకున్నారు. 2020లో టోక్యోలో జరిగిన ఒలింపిక్స్ క్రీడల్లో జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా స్వర్ణ పతకం గెలుచుకుని చరిత్ర సృష్టించారు. ఆ తర్వాత 2024 పారిస్ ఒలింపిక్ క్రీడల్లో రజత పతకం సాధించాడు. 2023 వరల్డ్ అథ్లటిక్స్‌లో గోల్డ్ మెడల్ కొట్టాడు. ఏషియన్, కామన్‌వెల్త్ గేమ్స్‌తో పాటు డైమండ్ లీగ్‌ల్లోనూ అతను స్వర్ణ పతకాలు గెలుచుకున్నాడు. నీరజ్ చోప్రా తన జావెలిన్‌ను అత్యుత్తమంగా 90.23 మీటర్ల దూరం విసిరి రికార్డు సృష్టించాడు. నీరజ్ సాధించిన విజయాలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ కీర్తించారు. రాబోయే తరాలకు ఇన్‌స్పిరేషన్‌గా ఆయన నిలుస్తారన్నారు. పట్టుదలకు, క్రమశిక్షణకు నీరజ్ ఆదర్శప్రాయుడన్నారు.

## నేడు ఆస్ట్రేలియా-భారత్ మధ్య

# రెండో వన్డే..

ఆస్ట్రేలియా-భారత్ మధ్య పెర్త్ వేదికగా జరిగిన తొలి వన్డే వర్షం ఇబ్బంది పెట్టింది. నాలుగుసార్లు అడ్డు తగలడంతో ఆటగాళ్లతో పాటు అభిమానులు ఇబ్బందిపడ్డారు. వర్షం కారణంగా మ్యాచ్‌ను 26 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు 26 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 236 పరుగులు చేసింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం.. ఆస్ట్రేలియాకు 131 పరుగుల



లక్ష్యాన్ని నిర్దేశించారు. కెప్టెన్ మిచెల్ మార్ష్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆస్ట్రేలియా 21.1 ఓవర్లలోనే మూడు వికెట్ల నష్టానికి 131 పరుగుల చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా 1–0 ఆధిక్యంలో నిలిచింది. ఇక అడిలైడ్ వేదికగా నేడు (గురువారం) రెండో వన్డే మ్యాచ్ జరుగనున్నది. ఈ మ్యాచ్‌కు సైతం వర్షం ఆటంకం కలిగిస్తుందా? పూర్తి 50 ఓవర్ల మ్యాచ్ జరుగుతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సిరీస్‌ను కాపాడుకోవాలనుకుంటే.. ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలువడం కీలకం. అడిలైడ్ ఓవల్‌లో వర్షం ఆటకు ఆటంకం కలుగకూడదని శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టీమిండియా ఆశిస్తున్నది. శుభవార్త ఏమిటంటే అడిలైడ్‌లో వర్షం పడే అవకాశం లేదని వాతావరణశాఖ అప్‌డేట్ ఇచ్చింది. మ్యాచ్‌కు ముందురోజు బుధశారం వర్షం పడే అవకాశం 20శాతం మాత్రమే ఉందని చెప్పింది. గురువారం జరిగే ఈ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశం చాలా తక్కువగానే ఉన్నాయి. పెర్త్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా మ్యాచ్ పదే పదే నిలిచిపోయింది. అడిలైడ్‌లో ఈ పరిస్థితి ఉండదని, అభిమానులు పూర్తి 50 ఓవర్ల మ్యాచ్‌ను ఆస్వాదించొచ్చు. అడిలైడ్ ఓవల్ పిచ్ బ్యాటింగ్ కోసం ఆస్ట్రేలియాలో అత్యుత్తమమైన పిచ్‌లలో ఒకటి. ఇది కొంత బౌన్స్‌తో కూడిన ఫ్లాట్ పిచ్. బ్యాట్స్‌మెన్ బ్యాటింగ్ చేయడం సులభమే. అడిలైడ స్పిన్నర్లకు అనుకూలంగా ఉండే పిచ్. భారత్ స్పిన్ పటిష్టంగా ఉంది. సిరీస్‌ను సమం చేయడంలో స్పిన్నర్లు కీలకపాత్ర పోషించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# సెమీస్ పోరు

మహిళల క్రికెట్‌లో మాత్రం 'ట్రోఫీ' దక్కే ఛాన్స్‌ను మిస్ చేసుకున్నట్లే అవుతుంది. ఎందుకంటే సెమీస్‌కు చేరుకోవాలంటే ఇక్కడ్నుంచి మిగిలిన రెండు మ్యాచులూ భారత మహిళా జట్టుకు గెలవడం అత్యంత కీలకం. టాప్ 4లో స్థానం కోసం న్యూజిలాండ్ కూడా ఈ రేసులో ఉంది. నేడు కివీస్‌తోనే టీమ్‌ఇండియా తలపడాల్సి ఉంది. ఇందులో గెలిస్తే పెద్దగా ఇబ్బందుల్లేకుండానే సెమీస్‌కు భారత్ చేరుకుంటుంది. చివరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించడం పెద్ద కష్టమేం కాదు. ఇప్పటికే దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ సెమీస్‌కు అర్హత సాధించాయి. ప్రస్తుతం భారత్ (5 మ్యాచుల్లో 4 పాయింట్లు), న్యూజిలాండ్ (5 మ్యాచుల్లో 4 పాయింట్లు), శ్రీలంక (6 మ్యాచుల్లో 4 పాయింట్లు) నాలుగో బెర్తు కోసం పోటీపడుతున్నాయి. బంగ్లా, పాక్ ఇప్పటికే ఎలిమినేట్ అయిపోయాయి. ఒకవేళ న్యూజిలాండ్‌తో మ్యాచ్ వర్షం కారణంగా రద్దైనా.. భారత్ తన చివరి మ్యాచ్‌లో బంగ్లాను ఓడిస్తే చాలు సెమీస్‌కు చేరుతుంది. మరోవైపు కివీస్ చివరి పోరు ఇంగ్లాండ్‌తో ఉంది. ఆ జట్టును ఓడించడం అంత సులువేం కాదు.

- నవీ ముంబయిలోని డీవై పాటిల్ స్టేడియం వేదికగా భారత్–న్యూజిలాండ్ మ్యాచ్
- మధ్యాహ్నం 3 గంటలకు మ్యాచ్ ప్రారంభం

**భారత తుది జట్టు (అంచనా):** ప్రతీకా రావల్, స్మృతి మంధాన, హర్లీన్ డియోల్, హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్), దీప్తి శర్మ, రిచా ఘోష్, అమన్‌జోత్ కౌర్, స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్ శ్రీ చరణి, రేణుకా ఠాకూర్


# ఫోకస్ చరిత్ర



# బావుల నగరం మొహెంజో దారో




సింధు లోయ నాగరికతను ప్రతిబింబించే మొహెంజో దారోను 'బావుల నగరం' అంటారు. ఎందుకంటే ఈ నగరంలో కనీసం 700కి పైగా బావులు ఉన్నట్టు పురాతత్వ శాఖ తవ్వకాల్లో గుర్తించారు. ఇది పురాతన ఈన్దస్ నాగరికతలోని అత్యంత ఆధునాతన నీటి సరఫరా వ్యవస్థను సూచిస్తుంది. మొహెంజో దారో నగరంలో ఇంత పెద్ద సంఖ్యలో బావులు ఉండటం వలన, ప్రజలు ఎక్కువగా కురిసే వర్షాలపై మాత్రమే ఆధారపడకుండా జీవించేవారు. వాటి నుండి నీటిని ఆవాసాలకు చేరవేసే ఏర్పాట్లు కూడా కల్పించిన ఆనవాళ్లు కూడా ఉన్నాయి. ప్రతి మూడు లేదా నాలుగు ఇళ్లకు కలిపి ఒక బావి ఉన్నట్టు చెప్తున్నారు. మొహెంజో దారోతోపాటు కనుగొన్న మరో నగరం హరప్పాలో మాత్రం బావులు చాలా తక్కువ. అక్కడ కేవలం ఎనిమిది బావులను మాత్రమే కనుగొన్నారు. అయితే, హరప్పా నగరం మధ్యలో ఉన్న పెద్ద తుంటి లేదా రిజర్వాయర్ ద్వారా నీటిని సమీప నివాస ప్రాంతాలకు అందించి ఉంటారని పరిశోధకులు భావిస్తున్నారు. మరోపక్క ధోలవీరా పెరుద్వార ప్రాంతంలో అందుబాటులో ఉన్న వర్షపు నీటిని పెద్ద రాళ్లతో నిర్మించిన సిస్టర్న్‌లలో నిల్వ చేసే ఆనవాళ్లు లభించాయి. అక్కడ మురికి నీటి డ్రెయినేజీని వర్షపు నీటి కుంభకాల నుండి వేరుగా రూపొందించడం విశేషం. ఇక్కడి ఈ నీటి సేకరణ, నిర్వహణాపద్ధతులు ప్రజల అవసరాలకు సరిపోయే విధంగా చక్కగా రూపుదిద్దుకున్నాయి. మొహెంజో దారోలోని బావుల వ్యవస్థ అక్కడి నివాసాలు, సేవా ప్రదేశాల్లో నీరు అందుబాటులో ఉండేదనే విషయాన్ని సూచిస్తున్నది. ఇది ప్రాచీన కాలంలోనే ఒక అత్యున్నతమైన నీటి నిర్వహణ శైలిగా నిలిచింది.





# స్టోన్‌హెంజ్‌లో భూగర్భ నిర్మాణాలు!

ఇంగ్లాండ్‌లోని సాలిస్‌బరీ ప్రాంతంలో ఉన్న 'స్టోన్ హెంజ్' గురించి ఇటీవల వెలుగులోకి వచ్చిన కొత్త సమాచారం ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలను ఆశ్చర్యానికీ, ఆందోళనకీ గురిచేసింది. ఈ రహస్యమైన రాతి వలయం ఏన్నో వేల ఏళ్లుగా మానవ చరిత్రలో అతి పెద్ద మిస్టరీలలో ఒకటిగా నిలిచింది. ఇప్పటివరకు దీనిని సూర్యుని క్రమాన్ని సూచించే కేలండర్‌గా, దేవతల పూజాస్థలంగా లేదా సమాధి స్థలంగా భావించారు. కానీ, ఇటీవల చేసిన భూస్కానింగ్ పరిశోధనల ద్వారా అతి ఆశ్చర్యకరమైన నిర్మాణాలు ఈ ప్రదేశం అడుగున ఉన్నట్టు తేలింది. అధునాతన భూస్కానింగ్ సాంకేతికతతో శాస్త్రవేత్తలు స్టోన్‌హెంజ్ కింద సుమారు పదిహేడు పురాతన నిర్మాణాలను గుర్తించారు. వీటిలో కొన్ని ప్రెస్ ప్రోసెషన్ మార్గాలకు అనుసంధానంగా ఉన్నాయని గుర్తించారు. ఇది స్టోన్‌హెంజ్ ఒకే సర్కిల్ కాకుండా పెద్ద తంత్రమైన పూజా కేంద్రం, అంటే ఒక రకమైన పవిత్ర నగరంలా ఉన్నదని సూచిస్తుంది. అధిక రిజల్యూషన్ స్కానింగ్ ద్వారా కనిపెట్టిన ఈ దాగిన భూగర్భ నిర్మాణాలు, మానవ నాగరికత అత్యంత అభివృద్ధి చెందిన దశను చేరుకునే సమయానికే ఉన్నాయని ఈ పరిశోధనలో స్పష్టమైంది. ఇంగ్లాండ్ బర్మింఘమ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విన్స్ గాఫ్నే నాయకత్వం వహించిన 'స్టోన్‌హెంజ్ హిడెన్ ల్యాండ్‌స్కేప్స్ ప్రాజెక్ట్' గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్, మాగ్నటోమీటర్‌లు, జీపీఎస్ మ్యాపింగ్ పద్ధతులు ఉపయోగించి సుమారు నాలుగు చదరపు మైళ్ళ భూమిని తవ్వకుండానే డిజిటల్‌గా మ్యాప్ చేశారు. ఇది వేల సంవత్సరాలుగా భూమి కింద దాగి ఉన్న రహస్యాలను బయటపెట్టింది. ఒక కొత్త దృక్పథాన్ని అందించింది. సాధారణ రైతులు రాళ్లు లాగి నిర్మించినట్లు ఇప్పటివరకు చెప్తున్న కథకు విరుద్ధంగా, కొత్త సాక్ష్యాలు మాత్రం స్టోన్‌హెంజ్ వ్యవస్థను ఎంతో ఉన్నత నాగరికత నిర్మించి ఉండవచ్చని సూచిస్తున్నాయి. ప్రత్యేకంగా, ఆల్టర్ స్టోన్ స్కాట్‌లాండ్‌లోని రాళ్లతో తయారైనదని శాస్త్రీయంగా నిరూపితమైంది. అంటే ఇది స్థానికంగా కాకుండా వందల కిలోమీటర్ల దూరం నుండి ఈ రాళ్లను తెచ్చారని తేలింది. ఇది గత శతాబ్దాలుగా మనం తెలుసుకున్న చరిత్రకే సవాలు విసురుతోంది. కొంతమంది నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ భూగర్భ నిర్మాణాలు కేవలం పూజా స్థలం మాత్రమే కాకుండా, వివిధ సామాజిక, ఖగోళ సంబంధిత క్రతువుల నిమిత్తం ఉపయోగించిన కేంద్రాలుగా కూడా పనిచేసి ఉండవచ్చు. ఇంకా మరికొంతమంది పరిశోధకులు దీనిని ఒక రహస్య ద్వారం లేదా తారాసంబంధ కమ్యూనికేషన్ కేంద్రంగా ఊహిస్తున్నారు. శాస్త్రవేత్తలు ఇప్పటికీ తవ్వకాలు కొనసాగిస్తూ కొత్త వాస్తవాలు వెలికితీస్తున్నారు. అందుచేత, స్టోన్‌హెంజ్ కేవలం రాతిబండల సమూహమే కాదు, ఇది మానవజాతి పూర్వ చరిత్రను తిరగరాసేంత శక్తివంతమైన రహస్యం దాగి ఉన్న ప్రదేశం అని చెప్పవచ్చు. ఈ కనుగొనుల్లు మన నాగరికత ఆరంభాలపై ఉన్న మన అంచనాలను పూర్తిగా మారుస్తున్నాయి.





మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న సిపిఐ రాష్ట్ర కాదర్శివర్గ సభ్యుడు కళవేన శంకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మేకల దాసు, ప్రజాపక్షం జిల్లా ప్రతినిధి పార్వతి సురేష్ కుమార్, మంచిర్యాల ఆర్సీ ఇన్‌చార్జి కేశేటి వంశీ తదితరులు



ప్రజాపక్షం దినపత్రిక 7వ వార్షికోత్సవం సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న దృశ్యాలు



సిపిఐ వరంగల్ జిల్లా కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాషు మియా, ప్రజాపక్షం జిల్లా ప్రతినిధి కోదాటి గోపాలకృష్ణ, సిపిఐ రాష్ట్రసమితి సభ్యుడు పంజాల రమేష్, మేకల రవి, సిపిఐ జిల్లా నాయకులు తదితరులు



హనుమకొండలోని బాలసముద్రం జిల్లా కార్యాలయంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిరబోయిన కరుణాకర్, ప్రజాపక్షం జిల్లా ప్రతినిధి తోట సుధాకర్ తదితరులు



మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ రవీంద్రబాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, మహబూబాబాద్ జిల్లా రిపోర్టర్ కల్లూరి ప్రభాకర్, కేసముద్రం విలేకరి శ్రీను, గూడూరు విలేకరి తదితరులు

# ప్రతీ అక్షరం ప్రజల పక్షాన నిలవాలి

### ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ప్రతీ ఒక్క అక్షరం ప్రజల పక్షాన నిలిచి ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రథమ భూమిక పోషించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశిరావు అన్నారు. ప్రజాపక్షం దినపత్రిక 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కొత్తగూడెం కేంద్రంలో ప్రజాపక్షం పాత్రికేయులు, సిపిఐ శ్రేణులతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ అభ్యుదయభావాలతో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాపక్షం దినపత్రిక దినదినాభివృద్ధిలో ముందుకు సాగుతూ 7వ వార్షికోత్సవం లోనికి అడుగుపెట్టడం అభినందనీయం అన్నారు. పత్రికలు ప్రభుత్వాలకు, ప్రజలకు వారధులుగా నిలవాలని సూచించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు, అవినీతి అక్రమాల భరతం పట్టేందుకు ఈ దినపత్రిక ప్రధాన వేదిక కావాలన్నారు. మీడియా కొత్తపుంతలు తొక్కుతున్న నాటి రోజుల్లో ప్రజాపక్షాన్ని ప్రజలు ఆదరిస్తున్నారని, ఈ ఆదరణను అందిపుచ్చుకుని ప్రజల్లోకి మరింతగా చొచ్చుకుపోయి అక్షర యుద్ధం సాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం జిల్లా ఇన్‌చార్జ్ పందా సత్యానంద్, చంద్రుగొండ మదన్ మోహన్, పాల్వంచ వెంకటనారాయణ గౌడ్‌తో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యుడు కంచర్ల జమలయ్య, చలిగంటి శ్రీనివాస్, మునిగడప వెంకన్న, ఫయూం,బరిగల భూపేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం శ్రామికభవన్‌లో సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, 'ప్రజాపక్షం'జిల్లా ప్రతినిధి ఆకుల పాండురంగం, ఎఐటియుసి జిల్లాకార్యదర్శి లక్ష్మణ్, ప్రజాపక్షం విలేకరులు తదితరులు




కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ 'ప్రజాపక్షం' కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, సిపిఐ నాయకులు సృజన్‌కుమార్, మణికంఠరెడ్డి, సురేందర్‌రెడ్డి, పైడిపల్లి రాజు,సదాశివ, ప్రజాపక్షం కరీంనగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో చిప్పరి వెంకట్రాజు, కరీంనగర్ ఆర్‌సి ఇన్‌చార్జి చేతన్ క్రాంత్ తదితరులు



నిజామాబాద్ జిల్లా సిపిఐ కార్యాలయంలో 'ప్రజాపక్షం' జిల్లా ప్రతినిధి కర్క రమేష్, సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్, ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై.ఓమయ్య, రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు తదితరులు



కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా ఆవరణలో 'ప్రజాపక్షం' కాగజ్‌నగర్ ఆర్‌సి షఫి ఉల్లా, ఆసిఫాబాద్, రెబ్బెన, పెంచికల్‌పేట్ పాత్రికేయులు తదితరులు



పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని 'ప్రజాపక్షం' కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, ప్రజాపక్షంస్టాఫ్ రిపోర్టర్ మహమ్మద్ గౌస్ పాషా తదితరులు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో



నిర్మల్ జిల్లా డిపిఆర్ఒ కార్యాలయంలో...



ములుగు జిల్లా 'ప్రజాపక్షం' ఆఫీసులో ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆలుగొండ రమేష్, మున్సిపల్ కమిషనర్ జనగాం సంపత్ తదితరులు



సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ బుర్ర శ్రీనివాస్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు తదితరులు



కాజీపేట ఎసిపి కార్యాలయంలో ఎసిపి పింగిళి ప్రశాంత్ రెడ్డి 'ప్రజాపక్షం' జిల్లా ప్రతినిధి తోట సుధాకర్, నవచేతన బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు, సిపిఐ జిల్లా నాయకులు తదితరులు



వికారాబాద్‌లోని అతిథి గృహంలో 'ప్రజాపక్షం' జిల్లా స్టాఫ్‌రిపోర్టర్ రవిందర్, తాండూరు ఇన్‌చార్జి రాంచంద్రయ్య, పరిగి,మోమిన్‌పెట్, పెద్దేముల్, కోట్‌పల్లి, నవాబ్‌పెట్, వికారాబాద్ రూరల్ విలేకరులు తదితరులు



దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో 'ప్రజాపక్షం' నల్గొండ జిల్లా ప్రతినిధి జిల్లా యాదయ్య, దేవరకొండ విలేకరి దర్శనం విష్ణు, కొండమల్లేపల్లి విలేకరి చిలువేరు శ్రీధర్, నల్గొండ పట్టణ విలేకరి దశరథ తదితరులు



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు: ఏఎంసి చైర్మన్

ప్రజాపక్షం/గొల్లపల్లి : రైతులు అరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దని , ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ భీమా సంతోష్ అన్నారు. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం రోజున ఏఎంసి చైర్మన్ భీమా సంతోష్ ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలు వరికి రూ.2389, మొక్కజొన్నకు రూ.2400 మద్దతు ధర లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నిశాంత్ రెడ్డి, రాజిరెడ్డి, సుధాకర్, వరలక్ష్మి , శివయ్య, తిరుపతి, కట్ట లక్ష్మ ణ్, సత్యనారాయణ గౌడ్, అరవింద్ గౌడ్, వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## స్కానింగ్ కేంద్రాలలో లింగ నిర్ధారణ చేయడం నేరం

జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ వి వాణిశ్రీ



ప్రజాపక్షం/పెద్దపల్లి : ప్రైవేటు స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వి వాణిశ్రీ అన్నారు. బుధవారం రోజున కార్యాలయంలో పి.సి.పి.యన్.డి.టి. అడ్వైజరి కమిటి సమావేశంను డా. వి. వాణిశ్రీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 32 స్కానింగ్ కేంద్రాలు రిజిస్ట్రేషన్ అయ్యాయని,వీటిలో ప్రతి నెల 10 కేంద్రాలను తనిఖీ చేస్తూ, అన్నీ కేంద్రాలు తనిఖీ అయ్యేలా చూస్తున్నామని,గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం 1994 (పి. సి. పి. ఎన్.డి.టి.) ప్రకారం పుట్ట బోయే బిడ్డ అడ, మగ అని చెప్పడం నేరమని, లింగ నిర్ధారణ చేసిన వారికి, చేయుమని అడిగిన వారికి మూడు సంవత్సరాల జైలు శిక్ష తోపాటు రూ.10,000/ల జరిమానా విదించడం జరుగుతుందని అన్నారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టంను పకడ్బందిగా అమలు చేస్తున్నామని, రెన్యువల్ కు దరఖాస్తు చేసుకున్న స్కానింగ్ కేంద్రాల దరఖాస్తులను పరిశీలించి, డిస్ట్రిక్ట్ అప్రేపియేట్ కమిటీకి అనుమతించడం కొరకు సిఫారసు చేయడం జరిగిందని అన్నారు. ఇందులో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి రామగుండం దరఖాస్తు కూడా ఉన్నదని,ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణులకు చేసే స్కానింగ్ వివరాలను కూడా ఫారం ఎఫ్ నింపడం ద్వారా వారి వివరాలను పొందుపరిచాలని కమిటీ సభ్యులు రాజ గోపాల్ కోరారు. జిల్లా సమైక్య గ్రూపు సమావేశంలలో లింగ వివక్షత పై అవగాహన కల్పిస్తామని జిల్లా సమైక్య సంఘాల అధ్యక్షురాలు శ్రీమతి స్నేహ అన్నారు.ఈ సమావేశంలో డా.రవీందర్, పిల్లల వైద్య నిపుణులు,పి.రాకేష్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, కె. రాజగోపాల్, రెడ్ క్రాస్ సోసైటి, అధ్యక్షులు, స్నేహ శ్రీపతి, జిల్లా సమైక్య అధ్యక్షురాలు, జగన్ డి. పి.ఆర్.ఓ., ఎస్.వెంకటేశ్వర్లు , జిల్లా మాస్ మీడియా ఉప అధికారి పాల్గోన్నారు.

## 25న సైకిల్ ర్యాలీ

పోస్టర్, రూట్‌మ్యాప్ ఆవిష్కరించిన సిపి గౌష్ ఆలం



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 25న శనివారం నిర్వహించబోయే సైకిల్ ర్యాలీకి సంబంధించిన పోస్టర్, రూట్ మ్యాప్‌లను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపిఎస్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. శనివారం ఉదయం ఈ సైకిల్ ర్యాలీ పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి ప్రారంభమవుతుందని సిపి తెలిపారు. పరేడ్ గ్రౌండ్ నుంచి మొదలై బస్‌స్టేషన్, ప్రతిమ మల్టీప్లెక్స్, గీతాభవన్ చౌరస్తా, మంకమ్మతోటలోని పొన్నం కాంప్లెక్స్, కెమిస్ట్ భవన్ మీదుగా సాగి, ఎలక్ట్రిసిటీ కార్యాలయం వద్ద యూటర్న్ తీసుకుంటుందని పేర్కొన్నారు. అనంతరం కోర్టు చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ చౌరస్తా, నాఖా చౌరస్తా, బోట్ చౌరస్తా, కమాన్ చౌరస్తా, తిరిగి బస్టాండ్ సర్కిల్, ప్రతిమ మల్టీప్లెక్స్ మీదుగా ప్రయాణించి పోలీసు పరేడ్ గ్రౌండ్ వద్ద ముగుస్తుందని ఆయన వివరించారు. ఈ సైక్లింగ్ ర్యాలీ నగరంలో దాదాపు 20 కిలోమీటర్ల మేర జరగనుందని సిపి పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశ్యంతో అక్టోబర్ 31వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సిపి తెలిపారు. ఈ పోలీసు అమరవీరుల వారోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రజలు, విధ్యార్థులు ఈ పోటీలలో, కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనాలని సిపి కోరారు.

## నీటి సమస్య తీర్చిన మంత్రి అడ్లూరికి దట్నూర్ వాసులు కృతజ్ఞతలు



ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం దట్నూర్ గ్రామంలోని ఎంపీ యుపిఎస్ పాఠశాలలోని విద్యార్థులకు ,త్రాగు నీటి సమస్య ఉందని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి లక్ష్మ ణ్ కుమార్ బోర్ మోటర్ శాంక్షన్ చేయగా బుధవారం బోర్ మోటర్ ఫిట్ చేయించి విద్యార్థుల నీటి సమస్యను తీర్చారు .మంత్రి అడ్లూరి ణ్ కుమార్ కు సహకరించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి కి విద్యార్థులు ,ఉపాధ్యాయులు ,గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జక్కుల మురళీధర్ రావు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు దండిగా రవీందర్, బెక్కం గంగారం, బూర్ల నరేష్, బూర్ల సురేందర్, బెక్కం రవి, బసవరాజుల సత్తయ్య, కొల్లూరి శంకర్ పాల్గొన్నారు.

## 27న మద్యం షాపుల డ్రా

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్: 2025–27 రిక్రూట్ మద్యపు దుకాణాల కేటాయింపుకు డ్రా తేదీని జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారి మహిపాల్ రెడ్డి ప్రకటించారు. ఈ డ్రా అక్టోబర్ 27, 2025 ఉదయం 11.00 గంటలకు బంధంపల్లి, స్వరూప గార్డెన్స్‌లో నిర్వహించనున్నారు.దరఖాస్తుదారులు నిర్ణయించిన తేదీ, సమయానికి తప్పనిసరిగా హాజరుకావాలని అధికారులు సూచించారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాపక్ష/జగదేవ్‌పూర్: మండల పరిధిలోని తిగుల్ గ్రామానికి చెందిన కొల్తూరు రాజమ్మకు మంజూరైన సిఎం సహాయనిధి చెక్కును వారి కుటుంబ సభ్యులకు మాజీ సర్పంచ్ భానుప్రకాశ్ బుధవారం అందజేశారు. ఇటీవల ఆనారోగ్యానికి గురై ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేరగా వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం సహాయనిధి ద్వారా రాజమ్మకు మంజూరైన రూ. 45000 ల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు రాజు, చింటూ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కేంద్రాల్లో అమ్ముకోవాలి

టపాస్ కిసాన్ ద్వారా అన్‌లైన్ చేసుకోవాలి

మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హుస్నాబాద్: రైతులు తమ పంటలు, పత్తి, మక్క వరిధాన్యం తో పాటు ఇతర అంతర పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోళ్ల కేంద్రాల్లో తమ దినుసులను అమ్ముకుని 48 గంటల నుండి 72 గంటల మధ్యలో తమ డబ్బులను పొందవచ్చని తెలంగాణ బిసి మరియు రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులకు సూచించారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ సమీపంలోని గోమాత జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగొలును అలాగే వ్యవసాయ మార్కెట్ యార్డులో మక్కలు, వరి ధాన్యం కొనుగోలును జిల్లా కలెక్టర్ కె హైమవతి, గ్రంధాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సహకార సంఘం చైర్మెన్ బి . శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మెన్ కె. తిరుపతిరెడ్డితో కలిసి ప్రారంబించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు మాట్లాడుతూ కాటన్ కార్పొరేషన్ ద్వారా దేశంలో 12 రాష్ట్రల్లో టపాస్ మొబైల్ యాప్ ద్వారా రైతుల అన్‌లైన్ చేసుకుంటే ఎవరిని ఆశ్రయించ కుండా నేరుగా రైతుల ప్రభుత్వ కేంద్రాల్లో అమ్ముకోవచ్చని తెలిపారు. రైతులు నాణ్యమైన పత్తితో పాటు తేమ శాతం చూసుకుని తెస్తే క్వింటాకు 8100 ధర ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. హుస్నాబాద్ డివిజన్ కేంద్రంలో ఎక్కడ కూడ రైతులు ఇబ్బంది పడకుండ అన్ని మండల కేంద్రాల్లో కొనుగోళు కేంద్రాలను ప్రాంరబించాలని అధికారులను ప్రజాప్రతినిధులకు సూచించారు. మూడు జిల్లాల కేంద్రమైన హుస్నాబాద్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతులకు హుస్నాబాద్‌లో అమ్ముకునే సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌కు సూచించారు. రైతుల సన్న రకం వరి ధాన్యంకు మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ఇచ్చె బొనస్ కల్పి వెంట వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఉన్న రైతులు అంతర్‌పంటలుతో పాటు చిరుధాన్యం పంటలపై దృష్టి పెట్లాలని మంత్రి రైతును కోరారు. త్వరలోనే గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసుకుని రైతులకు సాగు నీరు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా కార్యాక్రమంలో ముందుగా మిల్లు ఉన్న గోమాతలకు పచ్చిగడ్డితో పాటు దాన పెట్టి గోమాతను పూజించారు. కార్యక్రమంలో అర్ డివో రాంమూర్తి, డిటి , వ్యవసాయ అధికారులు, కొహెడ మార్కెట్ చైర్మెన్ , కాంగ్రేస్ నాయకులు చిత్తారి రవిందర్ పద్మ, బిక్కి, బాలయ్య, మిల్లు యజమానులు, రాజు, సంపత్, రజిత, దండి లక్ష్మి , రవిందర్ , ఐరెడ్డి పత్యనారయణరెడ్డి , వంగర మల్లెశం , తదితరులు పాల్గోన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాపక్షం/చందుర్తి: మండలం లోని సనుగుల గ్రామం లో ఫ్యాక్స్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ప్రారంభించారు.రైతులు పండించిన ప్రతి ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని , రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని అన్నారు.అధికారుల సూచనల మేరకు ధాన్యం 17 శాతం తో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.గ్రేడ్ ఏ ధాన్యానికి రూపాయలు 2389 ,సాధారణ రకానికి రూపాయలు 2369, సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు 500 బోనస్ అందిస్తామని అన్నారు.రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని , ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమం లో ఏఎంసి వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం ,డీఆర్డివో శేషాద్రి,జిల్లా సహకార అధికారి రామకృష్ణ,జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్ర ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన




ప్రజాపక్షం/జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణ 35వ వార్డులో 45 లక్షలతో సీసీ రోడ్డు డ్రైనేజీ నిర్మాణ పనులకు జగిత్యాల ఎంఎల్ఏ డాక్టర్ సంజయ్‌కుమార్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ జగిత్యాల పట్టణ అభివృద్దికి కృషి చేస్తామని , ప్రభుత్వంతో కలిసి పనిచేసి జగిత్యాల ను అభివృద్ధి చేసి జగిత్యాల ప్రజల రుణం తీర్చుకుంటామని అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇండ్లు డబల్ బెడ్‌రూం ఇండ్లను మంజూర్ చేస్తామని అన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ది చేస్తున్నామన్నారు. పట్టణంలో పచ్చదనం పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ స్పందన , నాయకులు అడువాల లక్ష్మ ణ్, గోలి శ్రీనివాస్, జయశ్రీ, బొలుసాని శ్రీనివాస్, టీవి సత్యం, సిరిసిల్ల శ్రీనివాస్, టీవి సూర్యం, డీఈలు వరుణ్, ఏఈ అనిల్, టిపిఎస్ శ్రీకర్ మున్సిపల్ అధికారులు, పట్టణ వార్డు నాయకులు, పాల్గొన్నారు.

## దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

ప్రజాపక్షం/కొండపాక: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి గిట్టుబాటు ధర లభిస్తుందని దళారులను నమ్మి మోసపోకుండా రైతుల కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి అన్నారు.మండలంలోని కొండపాక మర్పడగ, దుద్దెడ, సిరినగండ్ల, వెలికట్ట గ్రామాల్లో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని రైతులు ఇబ్బందులకు గురికాకుండా ఉండడం కోసం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర అందిస్తుందన్నారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.వ్యవసాయ అధికారి శివరామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పిఎసిఎస్‌వైస్ చైర్మన్ అమరేందర్, డైరెక్టర్ బూర్గుల సురేందర్ రావు, చారి, నాయకులు, మంచాల కనకరాములు, వాసరి లింగారావు, ఆరెపల్లి మహదేవ్, సిద్దులు, చిరంజీవి, రాజు, రైతులు, పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అర్హులు అందరికీ రేషన్‌కార్డులు

మంత్రి వివేక్ వెంకటస్వామి



ప్రజాపక్షం/సిద్దిపేట: రాష్ట్రంలో అర్హత ఉన్నత వారందరికి రేషన్‌కార్డులు, సన్నబియ్యం అందిస్తున్నట్లు రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. సిద్దిపేట జిల్లాలోనే కొత్తగా 26వేల కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేసినట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం సిద్దిపేట సమీకృత భవన్‌లో కల్యాణలక్ష్మి. షాది ముబారక్ చెక్కులను లబ్దిదారులకు జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి వివేక్‌వెంకటస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నిటిని నేరవేర్చటంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో అర్హులకు ఇందిరమ్మ ఇండ్లకు పంపిణీ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. డిసెంబర్ నాటికి లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పథకాల అమలులో సమస్యలుంటనే వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి వివేక్ ఆదేశించారు. కల్యాణ లక్ష్మి లో సిద్దిపేట నియోజకవర్గంలో 381 లబ్దిదారులకు 3.81 కోట్లు, దుబ్బాకలో 410 మందికి 4.10 కోట్లు, గజ్వేల్‌లో 204 మందికి 2.04 కోట్లు, మొత్తం లబ్దిదారులు 995 మందికి 9.95 కోట్లు విలువైన చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 74.386 కొత్త రేషన్‌కార్డులు మంజూరైనట్లు తెలిపారు. సిద్దిపేటకు 24.073, గజ్వేల్‌కు 15.659, దుబ్బాకకు 14819, హుస్నాబాద్‌కు 9783, జనగాంకు 7687, మానకోండురుకు 2410 కార్డులు మంజూరు చేశారు. జిల్లాలోని ఆరు నియోజక వర్గాల్లో 11201 ఇండ్లు మంజూరుకాగా వీటిలో 8929 ఇండ్లు గ్రౌండింగ్ అయినట్లు తెలిపారు. మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్ 1.79300 గృహాలకు 2.282.69 లక్షలు మంజూరు చేసినట్లుతెలిపారు. గృహజ్యోతి పథకంలో 2.04.250 గృహాలకు 9.782.04 లక్షలు చెల్లించబడ్డాయి. రైతుభరోసాలో 3.20.379 రైతులకు 355.68కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మహిళ ఉచిత ప్రయాణం జిల్లాలో 6.94 మహిళలు ఆర్టీసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. ఈపథకంలో 228.67 కోట్లు ఖర్చుచేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు, కలెక్టర్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

## సులభంగా నేర్పించేందుకు బుధవారం బోధన: కలెక్టర్



ప్రజాపక్షం/కొత్తపల్లి: విధ్యార్థులకు కఠినమైన పాఠ్యాంశాలను సులభంగా నేర్పించేందుకు బుధవారం బోధన కార్యక్రమం ఉపకరిస్తుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బోధన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పర్యవేక్షించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విధ్యార్థులతో కలిసి భోజనం చేశారు. 9వ తరగతి విధ్యార్థులతో పాఠశాలు చదివించారు. ప్రతి విధ్యార్థితో పాఠాన్ని చదివిస్తూ స్పష్టంగా అర్థవంతంగా చదివించేందుకు మెళకువలు నేర్పారు. ప్రతి విద్యార్థి నోట్‌బుక్లో రైటింగ్ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విధ్యార్థులతో మాట్లాడుతూ బుధవారం బోధనలో ఏదైనా సబ్జెక్ట్‌లోని కఠినమైన పాఠాన్ని ఎంచుకుని చదవాలని అన్నారు. శ్రద్ధ అంకితభావంతో నేర్చుకోవాలని సూచించారు. బుధవారం బోధన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ కఠినమైన పాఠాల పట్ల దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేష్, ఎంఈవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న డాక్టర్‌లు

ఎఐటియుసి నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, ఆరెల్లి పోషం





ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణి లో కార్మికులకు సరైన వైద్యం అందించక వారి ప్రాణాలతో వైద్యులు చెలగాటం ఆడుతున్నారని, కార్మికులకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించిన డాక్టర్ లపై యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం లు డిమాండ్ చేశారు. బుధవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన ఏఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పిటల్ కు డెలివరీ కోసం వచ్చిన గర్భిణీ కి సకాలంలో సరైన వైద్యం అందించక పోవడం వల్ల గర్భస్థ శిశువు మరణించించిదని, దీనికి కారణం హాస్పిటల్ గైనకాలజిస్ట్ అని వారు ఆరోపించారు. ఏరియా హాస్పిటల్ లో లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన విలువైన వైద్య పరికరాలు ఉన్నా నిపుణులు లేక పోవడం వల్ల అవి నిరుపయోగంగా ఉంటున్నాయని, వైద్య పరికరాలు పని చేసే విధంగా నిపుణులను నియమించి కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని గత ఏడాది వైద్యాధికారులకు, సింగరేణి యాజమాన్యంకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని వారు పేర్కొన్నారు. గర్భిణీకి సకాలంలో ఏరియా హాస్పిటల్ లో స్కానింగ్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించేందుకు విలువైన వైద్య పరికరాలను నిర్వహించే వైద్య నిపుణులు లేకపోవడం వైద్య పరీక్షల కోసం ప్రైవేటు స్కానింగ్ సెంటర్స్‌కు పంపడం వల్ల గర్భస్థ శిశువు మరణానికి ఇదొక కారణమని వారు ఆరోపించారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి నాయకులు దాసరి శ్రీనివాస్, అటికేటి రాజు, బి.సంతోష్ రెడ్డి ,నందిని నరేశ్,తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి పాలన అంతా సగం.. సగం ఆగం..ఆగం

మాజీ మంత్రి హరీశ్‌రావు



ప్రజాపక్షం/ సిద్దిపేట : రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మక్కల కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించటం వల్ల సిద్దిపేట మార్కెట్ యార్డులోనే 14వేల క్వింటళ్ల మక్కలు దళారుల పాలైందన్నారు. రైతులు మక్కలు మద్దతు ధర కంటే తక్కువగా 1600 రూపాయలు క్వింటల్‌కు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. బుధవారం సిద్దిపేట మార్కెట్ యార్డులో వద్ద మక్కల కొనుగోలు కేంద్రాలను మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ప్రతి ఎకరాకు కేవలం 18 క్వింటళ్ల మాత్రమే కొంటామని ప్రభుత్వం కొత్త నిబంధన పెట్టడం దుర్మార్గమన్నారు. రైతు 25 నుండి 30 క్వింటళ్ల మక్కలు పండిస్తే 18 క్వింటళ్లు మాత్రమే ప్రభుత్వం కొంటానంటే మిగతాది దళారుల పాలవుతుందన్నారు. పండిన పంట మొత్తం కొనుగోలు చేస్తామని , బోనస్ ఇస్తామని రేవంత్ రెడ్డి ఎందుకు కోతలు పెడుతున్నారన్నారు. ప్రతి గింజకు మద్దతు ధర ఇచ్చుకుంటా అని, ప్రతి పంటకు బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వంజాడలేదన్నారు. రెవంత్‌రెడ్డి పాలన అంతా సగం..సగం, ఆగం.. ఆగం అని ఎద్దేవా చేశారు. పండించిన ప్రతి పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

**ఉద్యోగం సామాజిక బాధ్యత – మాజీ మంత్రి హరీశ్‌రావు**

ఉద్యోగం సామాజిక బాధ్యతగా నిర్వర్తించాలని.. పదవ తరగతి ఫలితాల సాధనలో పట్టుదలతో కృషిచేసిన మంచి విద్యాధికారి యాదవరెడ్డి అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. నామనస్సుకు నచ్చిన కొంత మంది ఉద్యోగుల్లో యాదవరెడ్డి ఒకరన్నారు. పదవి విరమణ పొందిన మీ సలహాలు. సూచనలు ఎల్లప్పుడు ఉండాలన్నారు. బుధవారం చిన్నకోడూరు మండలం పెద్దకోడూరులో ఎంఇఓ యాదవరెడ్డి పదవి విరమణ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు గుండు భూపేశ్.మాణిక్యరెడ్డి, పాల సాయిరాం, రాధకిషన్‌శర్మ, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, టిపిటిఎఫ్ నేత తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆస్పత్రులపై చర్య తీసుకోండి

సిపిఐ పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్



ప్రజాపక్షం/పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా కేంద్రాల్లోని కనీస నియమ నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని బుధవారం రోజున సిపిఐ పెద్దపల్లి పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్, మాజీ కార్యదర్శి చంద్రగిరి ఉదయ్ కుమారులు జిల్లా వైద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు తనిఖీ చేయాలని అలాగే నియమ నిబంధనలు పాటించకుండా కనీస అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని, అనుమతి లేని వాటిపైన నోటీసులు జారీ చేసి వాటిని రద్దు చేయాలని, ప్రతి హాస్పటల్ నియమ నిబంధనలు పాటించాలనీ, ఫైర్ అండ్ సేఫ్టీ పార్కింగ్, ల్యాబ్ ,ఎక్రే ,మెడికల్ షాప్ నిర్వహణ సంబంధించిన వాటిని తనిఖీ చేయాలని, డాక్టర్ల అర్హత పత్రాలను, ఆస్పత్రిలో పని చేసే సిబ్బంది యొక్క అర్హతలను, మెడికల్ కౌన్సిల్ సర్టిఫికెట్ను అందులో పని చేసే వర్కర్ల జీతాలకు సంబంధించిన వివరాలను రికార్డులను తనిఖీ చేసి నిబంధనలు పాటించని ఆసుపత్రులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆసుపత్రులను నియంత్రించాలని వినతి పత్రం అందజేశారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/ఆర్మూర్ :** మండలంలోని హరిపూర్(దేపూర్) గ్రామానికి చెందిన ఇటీవల్ అప్పుల బాధ భరించలేక కాకతీయ కెనాల్ లో బావమరిది జోరిగె గంగాధర్ కెనాల్ లో దూకి చనిపోవటంతో ఆయనను వెతికే క్రమంలో బావ గంగాధర్ కూడా నీటిలో గల్లంతై మరణించిన విషయం అందరికీ తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న దేపూర్ గ్రామానికి చెందిన న్యాయవాది చరణ్ వాట్సప్ గ్రూప్ లో పేద కుటుంబాలకు అండగా నిల వండి అని ఒక మెసేజ్ పెట్టడంతో ఆ గ్రూపులో ఉన్న వ్యక్తులు తమకు తోచిన సహాయాన్ని రెండు కుటుంబాలకు 15వేల రూపాయలు జమ చేసి వారి కుటుంబాలకు బుధవారం అందజేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ఉపాధ్యక్షుడు జరిగె ధర్మయ్య, పట్వారి అశోక్, సిఆర్పిఎఫ్ రాజు, గొల్ల చిన్నయ్య తదితరులున్నారు. అనంతరం కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ కుటుంబాలకు అండగా నిలిచిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



## డబుల్ బెడ్రూమ్ ఇండ్లు పేదలకు అందించండి

వామపక్ష నాయకులు డిమాండ్

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలో గల కొమురం భీమ్ చౌరస్తా వద్ద బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదల కొరకు నిర్మించిన డబుల్ బెడ్రూమ్ లను కొందరు కబ్జా చేసుకుని ఇతర జిల్లాల వారికి అమ్ముకోవడము జరిగిందని వామపక్ష నాయకులు ఆరోపించారు. వారు మాట్లాడుతూ డబుల్ బెడ్రూమ్ ఇండ్లు అక్రమార్కుల ప్రభుత్వ అధికారులు నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తూ పేదలకు చెందాల్సిన ఇండ్లను వేరే వారికి కేటాయించడం ఎంతవరకు సమంజసమని, ఇండ్లు రాని పేదలు అద్దె కిరాయిలు కట్టలేక ఉపాధి అవకాశాలు లేక విద్య వైద్యానికి ఖర్చులు పెట్టలేక ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకొని అప్పుల పాలవుతున్నారని, ధనవంతులు అధికారులు ప్రజా ప్రతినిధులు కుమ్మక్కై పేదోళ్ళు నివసించే గూడును కూడా గుంజుకొని అమ్ముకోవడం సమంజసం కాదని,ఇప్పటికైనా మానవత్వాన్ని మంటలు కలపకుండా ప్రశ్నించే గొంతులను నొక్కకుండా జరిగిన తప్పులను సరిదిద్దుకొని అక్కడున్న డబుల్ బెడ్రూమ్ లను నిజాయితీగా ఆత్మగౌరవంతో పేదవాళ్లు మనవాళ్లే అనుకొని గూడు కోసం పోరాడుతున్న పేదవారికి మానవత ధర్మంతో న్యాయము చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి అల్లెపు పీటర్, సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ డివిజన్ కార్యదర్శి నునారికారి రాజేష్,బిసిపి జిల్లా కార్యదర్శి పనుపుల వెంకన్న అఖిల భారత మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి పి.స్వరూప,న్యూ డెమొక్రసీ నాయకులు లింగన్న మండల నాయకులు హైమద్ ఖాన్, బండ పెల్లి సురేష్ డబుల్ బెడ్ రూమ్ బాధితులు రాధక్క, జాఫర్, గౌస్, పద్మ కమల, అన్వర్ తదితరులు ఉన్నారు.



## జిల్లాలో వరి ధాన్యం సేకరణ ఏర్పాట్లు భేష్ : స్పెషల్ ఆఫీసర్ లక్ష్మి

**ప్రజాపక్షం/ఎడపల్లి :** ఖరీప్ సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యం సేకరణ కోసం నిజామాబాద్ జిల్లాలో చేపట్టిన ప్రణాళికబద్ధమైన ఏర్పాట్లను నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు స్పెషల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ ఐఎఎస్ అధికారిణి లక్ష్మి అభినందించారు. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌లతో కలిసి బుధవారం ఆమె ఎడపల్లి మండల కేంద్రంలోని ఐకేపి,సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కేంద్రాలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం నిల్వలకు సంబంధించిన రికార్డులను స్పెషల్ ఆఫీసర్ లక్ష్మి తనిఖీ చేశారు. ధాన్యం తీసుకొచ్చిన రైతులను ఆమె నేరుగా పలకరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేవని, నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేసి, మిల్లులకు తరలిస్తున్నారని రైతులు చెప్పడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. స్పెషల్ ఆఫీసర్ వెంట డీఆర్డీఓ సాయాగౌడ్, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, డిసిఓ శ్రీనివాస్ రావు, మార్కెటింగ్ శాఖ ఏడీ గంగవ్వ, తహసీల్దార్ దత్తాత్రి, స్థానిక అధికారులు, సోసైటీ ఛైర్మన్ మల్కారెడ్డి, సోసైటీ సెక్రెటరి రాజారాం, కేంద్రాల నిర్వహకులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లపై సమీక్ష సమావేశం

**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** మహ్మద్‌నగర్ మండలంలో నూతనంగా నిర్మాణం చేపట్టనున్న ఇందిరమ్మ ఇండ్ల గురించి ఎమ్మెల్యే లక్ష్మీ కాంతా రావు ఆదేశానుసారం ఏఎంసీ ఛైర్మెన్ మనోజ్‌కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీంధర్, ఎస్టీ సెల్ సవాయిసింగ్‌లు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లపై ప్రొసీడింగ్ పత్రాలు పొంది ఇండ్లు నిర్మించుకోని వారి గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను గురించి ప్రజలకు తెలియజేసి వారు లబ్ధిపొందేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు కృషి ఫలితంగా నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చూస్తామన్నారు. ఇండ్ల నిర్మాణ పనులను గురించి క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు పరిశీలించేలా చూడాలని మండల యువజన అధ్యక్షుడు సంతోష్ రాథోడ్ ఎంపీడీఓను కోరారు. ఈ కార్యక్రమంలో వెంకట సత్యనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి గౌరి, సాయిప్రణీత్, ఫీల్డు అసిస్టెంట్ గంగారాం గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ రవాణా శాఖ కార్యాలయంపై ఎసిబి మెరుపు దాడి

కీలక అధికారులు గైర్హాజరు, ఏజెంట్లపై విచారణ



**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని రవాణా శాఖ కార్యాలయంలో బుధవారం ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఏసీబీ డీఎస్పీ మధు ఆదరణ ఆద్వర్యంలో పది మంది అధికారులు సాధారణ పౌరుల మాదిరిగా కార్యాలయంలోకి ప్రవేశించారు.మొదట ప్రధాన గేటు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నుంచి ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.అనంతరం కార్యాలయంలోని రిజిస్ట్రేషన్ దరఖాస్తులను,గ్యాస్ కౌంటర్లను సున్నితంగా పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు.బయట ఏజెంట్లు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారా అనే అంశంపై ప్రత్యేకంగా ఆరా తీసి విచారణ జరిపారు.తనిఖీ సమయంలో జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీవో) దుర్గాప్రసాద్ సహా ఇతర కీలక అధికారులు సెలవులో ఉండగా,ఒక్కరు మాత్రమే కార్యాలయంలో ఉండడం పై ఏసీబీ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు.వాహనాల రిజిస్ట్రేషన్,డ్రైవింగ్ లైసెన్స్ జారీ కౌంటర్లను పరిశీలించి,రిజిస్ట్రేషన్ ప్రక్రియపై వివరాలు అడిగినప్పటికీ సరైన సమాధానం లభించకపోవడంతో అధికారులు తీవ్ర నిరాశకు గురయ్యారు.కొందరు ఏజెంట్లు ఈ కార్యలయంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తమకు సమాచారం రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు.తనిఖీల్లో కొన్ని లోపాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు వెలడించారు.ఈ కార్యాలయంలో అవినీతి అక్రమాలకు పాల్పడితే ఏసీబీ అధికారులను సంప్రదించాలని,అందుకొసం టోల్ ఫ్రీ నెంబర్ ను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. బుధవారం అందోల్ మార్కెట్ యార్డులో సంగారెడ్డి జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అన్నారు. రైతులు పండించిన ప్రతి వరి కొనుగోలు చేస్తామన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. సంగారెడ్డి జిల్లాలో 216 కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన ధరకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం ధాన్యం పంటలు సాగును ప్రోత్సాహించేందుకు క్వింటాలుకు రూ.500 రూపాలయ బోనస్ ను అందిస్తున్నామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటలలో రైతుల ఖాతాలో డబ్బులు జమచేస్తున్నామన్నారు. వరి ధాన్యాన్ని సహకార సంఘాలు ఐకెపి డిసిఎం ఎస్‌లతో పాటు రైతులు రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పిఒ) ద్వారా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ముందుకు వస్తే వారికి అవకాశం కల్పించి, కొనుగోలు కేంద్రాలను పెంచుతామన్నారు. అందోల్ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో చెరువు, కుంటలు ఉన్నాయన్నారు. 2005–2006లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత రాజశేఖరరెడ్డి సహకారంతో సింగూరు కాల్వ ఇవ్వడం వలన 40 వేల ఎకరాలు సాగులోకి వచ్చిందన్నారు. నియోజకవర్గంలో వరి పత్తి పంటలు అత్యధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తారన్నారు. జిల్లాలో సాగు నీటి వ్యవస్థ కు పూర్తి సహకారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ మాధురి, అందోల్ ఆర్డీఓ పాండు, రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్ శేరి జగన్ మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్ మోహన్‌రెడ్డి, ప్రజా ప్రతినిదులు సురేందర్ గౌడ్, చిట్టిబాబు, కలాలి రమేష్ గౌడ్, పిఎస్ ఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కాగజ్‌నగర్ అభివృద్ధికి నిధులు కోరాం

సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్‌బాబు

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** కాగజ్‌నగర్ పట్టణ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరామని సిర్పూర్ శాసనసభ్యుడు డా.పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన దీపావళి సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పట్టణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా సిర్పూర్ నియోజకవర్గం మీదుగా నాగపూర్ హైదరాబాద్ జాతీయ రహదారి నిర్మాణ అలైన్‌మెంట్ ప్రక్రియ చివరి దశలో ఉందని, డిపిఆర్ కోసం ఎన్‌హెచ్‌ఏఐ చర్యలు తీసుకుంటుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## దళారులకు అమ్మకండి

ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



**ప్రజాపక్షం/నందిపేట్ :** మీరు ఎంతో కష్టపడి పండించిన మొక్కజొన్న పంటను దళారులకు అమ్మవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలోనే అమ్ముకోవాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి రైతులను కోరారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలో బుధవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో టెంకాయ కొట్టించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టపడి మొక్కజొన్న పండిస్తారో వాటిని వర్షాల కారణంతో దళారులకు చాలా మంది రైతులు అమ్ముకొని నష్టపోయారని అన్నారు. కొనుగోలు కేంద్రంలో మద్దతు ధర లభిస్తుందని గుర్తించాలని చెప్పారు. పలువురు రైతులు జిల్లాకు మంజూరైన వ్యవసాయ కళాశాల గురించి అడిగారు. లక్కంపల్లి సెజ్‌లో ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఎమ్మెల్యేకు సూచించారు. కార్యక్రమంలో డొంకేశ్వర్ సింగిల్ విండో ఛైర్మన్ భరత్ రెడ్డి, డైరెక్టర్లు రైతులు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి భవనాన్ని త్వరితగతిన పూర్తిచేయాలి

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు నాణ్యతతో చేపట్టాలి

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ గ్రామీణ మండలంలోని నాగ్నాయిపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనం పనులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగాఈ కలెక్టర్ మాట్లాడుతూ,భవన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.నిర్మాణ పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.భవన నమూనా మ్యాపులను పరిశీలించి,అవసరమైన సవరణలపై సూచనలు చేశారు.భవన నిర్మాణం నాణ్యతంతంగా సమయానికి పూర్తి కావాలని,సరిపడినంత మంది కూలీలను నియమించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ప్రదేశం కేటాయించాలన్నారు.భవనం చుట్టూ హద్దుల గుర్తులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.ఇందిరా మహిళా శక్తి భవనాలు రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతను పెంపొందించేందుకు చేపట్టిన ప్రాధాన్యమైన కార్యక్రమమని కలెక్టర్ పేర్కొన్నారు.సంబంధిత అధికారులు ఎప్పటి కప్పుడు నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ పట్టణంలోని బంగాల్‌పేట్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు.లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కల నేరవేర్చేందుకు 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతోందని,పనులను నాణ్యవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.దశలవారీగా నిధులు విడుదల చేయడం జరుగుతుందని,అధికారులు పర్యవేక్షణను క్రమం తప్పకుండా కొనసాగించాలని కలెక్టర్ అన్నారు.నిరుపేద లబ్ధిదారులు తమ సొంత ఇంటి కలను నెరవేర్చినందుకు ప్రభుత్వానికి,కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ చందు జాదవ్,డీఈ తుకారం రాథోడ్, ఏఈఈ చందన్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్లు ప్రభాకర్, రాజు, ఎంపిడిఓ గజానన్, హౌసింగ్, మున్సిపల్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## వైద్య వృత్తిలో రాణించి పేదలకు సేవలు అందించాలి

ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



**ప్రజాపక్షం/బైంసా :** మన ప్రాంత విద్యార్థులు ఎంబిబిఎస్‌లో సీటు సాధించడం అభినందనీయమని వైద్య వృత్తిలో రాణించి పేదలకు సేవ చేయాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు.మంగళవారం బైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ లో అనసూయ పవర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో 25 మంది విద్యార్థులు ఎంబిబిఎస్ లో సీట్లు సాధించిన సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి అభినందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వైద్యులు అవసరమని,భవిష్యత్తులో డాక్టర్లు అయ్యాక గ్రామీణ,ప్రాంతాల్లో వైద్య సేవలు విస్తరించాలన్నారు.జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగిన తల్లిదండ్రులను విస్మరించవద్దన్నారు.తల్లిదండ్రులు దైవంతో సమానులని పిల్లల కోసం వారి ఎండనక,పగలనక శ్రమిస్తారన్నారు.బైంసా ఏరియా ఆసుపత్రిని మరింత అభివృద్ధి పరుస్తానని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.విద్యతోనే సమాజ అభివృద్ధి జరుగుతుందన్నారు.విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.అనంతరం ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ సతీష్ పవార్,ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కాశీనాథ్,వైద్యులు అనిల్ పద్మావతి మాట్లాడుతూ వైద్యరంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయని భవిష్యత్తులో అనుకున్న రంగంలో సక్సెస్ అయి వైద్య సేవలు చేపట్టాలని సూచించారు.మండల విద్యాధికారులు సుభాష్,చంద్రకాంత్,ఉపాధ్యాయ సంఘ నాయకులు బి.వి.రమణారావ్ వినోద్ శంకర్ బాజిరెడ్డి శ్రీనివాస్ గంగాధర్ తోపాటు పలువురు మాట్లాడుతూ,గత పది సంవత్సరాలుగా విద్యారంగాన్ని అభివృద్ధి పరచడానికి అనసూయ పవర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు.కార్యక్రమంలో విద్యార్థుల తమ అనుభవాలు పంచుకుంటూ,విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తపరిచారు.కార్యక్రమంలో రిటైర్డ్ డిఎఫ్.వో దత్తురామ్ పటేల్,సీనియర్ నాయకులు సొలంకి భీమ్ రావ్ తో పలువురు నాయకులు పాల్గొన్నారు.



## ధాన్యం విక్రయించుకునేలా అన్ని సదుపాయాలు కల్పించాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం విక్రయించుకునేలా అన్ని సదుపాయాలు కల్పించాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెంగల్‌పాడ్, తాటితండా గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంఏద్రాలను రూరల్ ఎమ్మెల్యే భూపతపిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం విఇక్రయయించుకునేలా అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులు, సిబ్బందికి సూచచించారు. ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి, ప్రతి గింజన కొనుగోలు చేస్తుందన్నారు. ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలకు పెద్దపీత వేస్తుందని జిల్లాలో గత ధాన్యం కొనుగోలు ఐకెపి ఆధ్వర్యంలో 100 సెంటర్ ఇస్తే ప్రస్తుతం 200 ధాన్యం కొనుగోలు ఐకెపి కేంద్రాలను అప్పజెప్పిందన్నారు. గత ధాన్యం కొనుగోలు ఐకెపి మహిళలకు కోటి రూపాయల లాభం వచ్చిందని అంచనా వేశారు. సిఎం రేవంత్‌రెడ్డి మహిళలను కోటీశ్వర్లుగా చేయడమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్నారన్నారు. రైతులు ఇచ్చిన ధాన్యానికి రసీదు ఖచ్చితంగా ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఎటువంటి అవకతవకలకు జరగకూడదని ఐకెపి అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఇందల్వాయి మా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నవీన్‌గౌడ్, చింతల కిషన్, లింగాపూర్ సంతోష్‌రెడ్డి, రాయసింగ్, పరశురాంనాయక్, ఐకెపి సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఆర్మూర్ డివిజన్‌లో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి బుధవారం సందర్శించారు. జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి, ఆర్మూర్ మండలం పిప్రి గ్రామాల్లో కొనసాగుతున్న కేంద్రాలను పరిశీలించారు. రైతుల నుండి సేకరించిన మొక్కజొన్న పంట నాణ్యతను తనిఖీ చేశారు. కేంద్రాల వద్ద ఆరబెఎట్టిన మొక్కజొన్న నిల్వలను పపరిశీలించి రైతులతో మాట్లాడారు. కనీస మద్దతు ధర అందించేందుకు వీఈలుగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమే 14 శాతానికి లోబడి ఉండేలా ఆరబెట్టి శుభ్రపర్చి నమొక్కజొన్న పంటను కేంద్రాలకు తతెచ్చి పూర్తి స్థాయిలో మద్దతు ధర పొందాలని సూచించారు. కాగా కొనుగోలు కేంద్రాలలో రైతులకు తగిన సదుపాయాలు అందుబాటులో ఉండేఏలా చర్యలు తీసుకోవాలని రైతులు తెచ్చిన పంట నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉంటే వెంటనే తూకం జరిపించి టాయబ్ ఎంట్రీ చేయాలని కేంద్రాల నిర్వాహకుఉలను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులుఉ తలెత్తకుండా మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా కృషి చేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్‌రావు, మార్క్‌ఫెడ్ డిఎం మహేష్‌కుమార్ న్నారు.

## ఎక్సైజ్ శాఖ మీద ఉన్న దృష్టి విద్యారంగంపై లేదు

బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణంలో బాయ్స్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ పనిచేస్తున్న బాలాసంకుల రాజ్ గోపాల్ రావు లక్షటిపేటకు చెందిన అతను గత నాలుగు నెలలుగా ప్రభుత్వం నుండి రావాల్సిన 8 లక్షల రూపాయల పెండింగ్ బిల్లులు రాక అలాగే వాటికి సంబంధించిన ప్రొసీడింగ్స్ ఇవ్వకపోవడంతో తన నివాసంలో మూడు రోజుల క్రితం ఆత్మహత్య యత్నానికి పాల్పడటంతో బుధవారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ తన నివాసానికి వెళ్ళి పరామర్శించారు.తను మాట్లాడుతూ బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు భరించలేక.చివరికి తల్లి గాజులు అమ్మవలిసిన పరిస్థితిలో రాజ్ గోపాల్ ఆత్మహత్యకు పాల్పడటం జరిగింది.విద్యాశాఖ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విద్యావ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారన విమర్శించారు.మధ్యాహ్న భోజన పథకం దయనీయ పరిస్థితుల్లో ఉంది.

ఏప్రిల్ 2025 నుండి ఇప్పటి వరకు కోడిగుడ్ల బిల్లులు చెల్లించలేదు.అని గత మూడు నెలల మధ్యాహ్న భోజన బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి.రాష్ట్రంలో విద్యారంగం క్రమంగా కుప్పకూలే దశకు చేరుకుంది.ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు దాటినా,ఇప్పటి వరకు పాఠశాల నిధులు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు.ఈ కారణంగా పాఠశాలలలో చాక్ పీసులు,డస్టర్స్,అవసరమైన సామగ్రి కొనుగోలు,చిన్న చిన్న మరమ్మత్తులు,కార్యక్రమాలు అన్నీ నిలిచిపోయి హెడ్ మాస్టర్స్ వారి జేబుల నుండి చెల్లించే పరిస్థితి ఏర్పడింది.రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు రాక వార్డెన్లు,రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక అటు రిటైర్డ్ ఉపాధ్యాయులు, జీపీఎఫ్ రాక టీచర్స్ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.విద్యా,సంక్షేమ శాఖకు సంబంధించి పెండింగ్లో ఉన్న బాకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రమేష్,అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్,మండల అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్, పట్టణ అధ్యక్షుడు కీర్తి మనోజ్ కుమార్, రమేష్, తదితర నాయకులు కర్యాకర్తలు ఉన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారం కేసులో... నేరస్థుడికి జీవిత ఖైదు, రూ.10వేలు జరిమానా


**ప్రజాపక్షం/సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నం 75/2018లో మైనర్ బాలికను అపహరించి అత్యాచారం చేసిన కేసులో నిందితుడు తలారి లక్ష్మి నారాయణ @చిన్ని వయస్సు 20 సంవత్సరాలు వృత్తి డ్రైవర్ నివాసంర గురజాడ గ్రామం కోహిర్ మండలం ప్రస్తుతం పోలపల్లి గ్రామం జహీరాబాద్ మండలం కేసు పూర్వపరాలు విన్న స్పెషల్ పోక్సో కోర్ట్ జడ్జి కె. జయంతి నిందితుడు చేసిన నేర నిరూపితమైనందున ఐపిసి సెక్షన్ 376(2)(n), 366(A), 506 పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1)rIw 6 Sc \St (pca) చట్టంలోని సెక్షన్ 3/2 (v) ప్రకారం దోషిగా తేలినందునా నిందితునికి జీవిత ఖైదు ,రూ. పదివేలు జరిమాన చెల్లించిన పక్షంలో ఒక సంవత్సరం కాల సాదారణ శిక్ష విధించడం జరుగుతుంది తీర్పు వెల్లడించారు. కేసు విచారణలో భాగంగా కృషి చేసిన అధికారులు ఎస్పిఎల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. సూరిరెడ్డి ఎఎస్ ఐ జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ ఎన్ రవి అదికారులందరికి జిల్లా పోలీస్ అధికారి పరితోష్ ఫంకజ్ అభినందనలు తెలిపారు.







## సంక్రాంతికి..
# 'నారి నారి నడుమ మురారి'

శర్వానంద్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'నారి నారి నడుమ మురారి'. 'సామజవరగమన' దర్శకుడు రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఎకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సాక్షి వైద్య, సంయుక్త హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. ఈ చిత్రం 2026 సంక్రాంతికి రిలీజ్ అవుతుందని నిర్మాతలు ప్రకటించారు. గతంలో 'శతమానం భవతి'తో బ్లాక్ బస్టర్ అందించిన శర్వాకు సంక్రాంతి లక్కీ సీజన్ అవుతుందని నిర్మాతలు భావిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి విశాల్ చంద్ర శేఖర్ సంగీతం అందిస్తుండగా, జ్ఞాన శేఖర్ విఎస్, యువరాజ్ కలిసి సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. భాను బోగవరపు కథను రాశారు. నందు సావిరిగణ డైలాగ్స్ అందించారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్. అజయ్ సుంకర సహ నిర్మాతగా, కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్.ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది.




# నవంబర్ 14న 'కాంత' విడుదల

దుల్కర్ సల్మాన్ పీరియాడికల్ మూవీ 'కాంత' టీజర్‌తో సంచలనం సృష్టించింది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ తమిళ తెలుగు ద్విభాషా చిత్రంలో దుల్కర్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించింది. సముద్రఖని కీలక పాత్ర పోషిస్తున్నారు.స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ వేఫేరర్ ఫిలిమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌లపై రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. సినిమాకు సంబధించిన అని పనులు పూర్తి కావచ్చిన ఈ కాంత చిత్రాన్ని నవంబర్ 14న వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది.



# 'సూపర్ డూపర్' పాట విడుదల

మాస్ జాతర' చిత్రం నుండి ఇప్పటికే విడుదలైన 'తు మేరా లవర్', 'ఓలే ఓలే', 'హుడియో హుడియో' గీతాలు శ్రోతలను విశేషంగా ఆకట్టుకొని, సామాజిక మాధ్యమాల్లో ఉర్రూతలూగించాయి. తాజాగా చిత్ర బృందం, నాలుగో గీతంగా ఉత్సాహభరితమైన మాస్ పాట 'సూపర్ డూపర్'ను విడుదల చేసింది. రవితేజ మాస్‌కి, శ్రీలీల ఎనర్జీకి తగ్గట్టుగా స్వరపరిచిన ఈ బ్లాక్ బస్టర్ ట్యూన్ అందరినీ కట్టిపడేస్తోంది. 'మాస్ జాతర' చిత్రాన్ని, ఆల్బమ్‌ని మరింతగా ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లేలా ఈ 'సూపర్ డూపర్' గీతముంది.



# 'మిరాయ్' సక్సెస్ మీట్

సూపర్ హీరో తేజ సజ్జా బ్రహ్మాండ బ్లాక్ బస్టర్ 'మిరాయ్'. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. రాకింగ్ స్టార్ మనోజ్ మంచు పవర్ ఫుల్ పాత్ర పోషించారు. రితికా నాయక్ హీరోయిన్‌గా నటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మించారు. సెప్టెంబర్ 12న వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రిలీజైన ఈ చిత్రం బ్రహ్మాండ బ్లాక్ బస్టర్ సక్సెస్ ని అందుకుని అద్భుతమైన కలెక్షన్స్‌తో రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ సందర్భంగా బ్లాక్ బస్టర్ సక్సెస్ సెలబ్రేషన్ మీట్ నిర్వహించారు. ఈ వేడుకలో యూనిట్ అందరికీ మెమెంటోలు అందించి అభినందించారు. హీరో తేజ సజ్జ మాట్లాడుతూ మమ్మల్ని నడిపించిన టెక్నీషియన్స్ అందరికోసం. వాళ్లకి గుర్తుగా ఉండాలని ఈవెంట్ ని నిర్వహించాం. ఇలాంటి ఈవెంట్ ని పెట్టడానికి ముందడుగు వేసిన మా నిర్మాత విశ్వప్రసాద్ గారికి కృతజ్ఞతలు. సినిమా రిలీజ్ అయి దాదాపుగా 45 డేస్ అవుతుంది. ఒటీటీకి వచ్చిన వరకూ కూడా థియేటర్లో రన్ నడుస్తుంది. ఓటీటీకి వచ్చాక కూడా ఈవెంట్ ని పెట్టడం విశ్వ గొప్ప మనసు. ఇంత బ్రహ్మాండ బ్లాక్ బాస్టర్ లాంటి సినిమా ఇచ్చిన డాక్టర్ కార్తీక్ గారికి థాంక్యూ. మా టీమ్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఒక మంచి సినిమా వస్తే సపోర్ట్ చేసి ఎంతో గొప్ప స్థాయికి తీసుకువెళ్తారు. నా కెరీర్లో నాకు ఇది ఎన్నో సార్లు చూపించారు. మీరు ప్రోత్సహించిన విధానం ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటాను. మీ అందరికీ ఎప్పుడు కూడా కృతజ్ఞతతో ఉంటాను. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ ఈ సినిమాకి ఇంత అద్భుతమైన విజయాన్ని అందించిన ప్రేక్షకులకు మీడియాకు ధన్యవాదాలు. దీనిని ఫ్యాన్ వరల్డ్ ఫ్రాంచైజ్ చేస్తున్నాం. మిరాయి విజయంతో ఇది మొదలైంది. జియో స్టార్ లార్జెస్ట్ యూజర్ బేస్ ఉన్న ఓటీటీ. ఇండియాలోనే ఎక్కువ మంది చూసిన సినిమాగా నిలుస్తుందని ఆశిస్తున్నాం. మరిన్ని అద్భుతమైన సినిమాలు చేయాలని కోరుకుంటున్నాం అని అన్నారు. డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని మాట్లాడుతూ సినిమాని నేను ఎప్పుడు కూడా మ్యాజిక్ అనుకునేవాడిని. తీయడం మొదలుపెట్టాక మ్యాజిక్ అనేది నెమ్మదిగా అర్థమైంది. అందరి కొలాబరేషన్‌తో సినిమా తయారవుతుంది అని చెప్పారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ రితిక నాయక్, సంగీత దర్శకుడు గౌరా హరి, నిర్మాత వై రవిశంకర్, డైరెక్టర్ మారుతి, డైరెక్టర్ వెంకటేష్ మహా, డైరెక్టర్ సంపత్ నంది, డైరెక్టర్ శ్రీరామ్ ఆదిత్య, డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి పాల్గొన్నారు.

# 'మైసా' పోస్టర్ రిలీజ్

నేషనల్ క్రష్ రష్మిక మందన్న రవీంద్ర పుల్లె డైరెక్టర్‌గా అరంగేట్రం చేస్తున్న 'మైసా'. ఫీమేల్ సెంట్రిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో రాబోతున్నారు. అన్‌ఫార్ములా ఫిలిమ్స్ మైసాను భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమాకు సంబధించిన పోస్టర్ రిలీజ్ చేశారు. రష్మిక ఇంటెన్స్ లుక్‌లో కనిపించిన పోస్టర్ అదిరిపోయింది. త్వరలో గ్లింప్స్ రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. మైసా గోండ్ తెగల బ్యాక్ డ్రాప్‌లో యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు. రష్మిక మందన్న ఇంతకు ముందు ఎప్పుడూ చూడని ఇంటెన్స్ అవతార్‌లో కనిపిస్తుంది. ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ మ్యూజిక్ అందిస్తున్నారు. సూర్య 'రెట్రో' సినిమాకి పని చేసిన శ్రేయాస్ పికృష్ణ డీవోపీగా పని చేస్తున్నారు. యాక్షన్‌ని 'కల్కి 2898 ఏడీ' ఫేమ్ ఆండి లాంగ్ డిజైన్ చేస్తున్నారు.



# అర్జున అవార్డు గ్రహీత మణతి గణేషన్ కథ 'బైసన్'



ధృవ్ విక్రమ్, అనుపమ పరమేశ్వరణ్ జంటగా అప్లాజ్ ఎంటర్టైన్మెంట్స్, నీలం స్టూడియోస్ బ్యానర్ మీద పా. రంజిత్ సమర్పణలో సమీర్ నాయర్, దీపక్ సెగల్, పా.రంజిత్, అదితి ఆనంద్ నిర్మాతలుగా మారి సెల్వరాజ్ తెరకెక్కించిన చిత్రం 'బైసన్'. ఈ సినిమాకి నివాస్ కె.ప్రసన్న సంగీతాన్ని అందించారు. ఇక ఈ మూవీని తెలుగులో జగదంబే ఫిలమ్స్ బ్యానర్ మీద తెలుగులో అక్టోబర్ 24న రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ప్రెస్ మీట్ నిర్వహించారు. హీరో ధృవ్ విక్రమ్ మాట్లాడుతూ నేను కొన్ని రోజుల క్రితం ఇక్కడికి షాపింగ్ చేసేందుకు వచ్చాను. అక్కడ ఆ షాప్ ఓనర్ నన్ను చూసి 'మీరు విక్రమ్‌లా ఉన్నారు' అని అన్నారు.

# 'దీక్ష' కోసం స్పెషల్ పాటను చిత్రీకరిస్తాం : దర్శకుడు ఆర్.కె.గౌడ్



ఆర్‌కె ఫిలిమ్స్ , సిగ్ధ క్రియేషన్స్ బ్యానర్‌లో డిఎస్ రెడ్డి సమర్పణలో డా.ప్రతాని రామకృష్ణ గౌడ్, పి.అశోకుమార్ నిర్మాతలుగా, ఆర్‌కె గౌడ్ దర్శకత్వంలో కిరణ్, ఆలేఖ్యరెడ్డి హీరో హీరోయిన్స్ గా ఆక్స ఖాన్, తులసి, అనూష,కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ ప్రధాన పాత్రలలో నటించిన చిత్రం'దీక్ష'. ఫ్యామిలీ ఎంటర్టైనర్గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. అయితే ఈ సినిమా కోసం ప్రత్యేకంగా ఒక పాటను చిత్రీకరిస్తున్నామని దర్శకుడు ఆర్‌కె గౌడ్ బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చెప్పారు. మధు ప్రియా పాడిన బులెట్ పాటను హీరో కిరణ్, సోషల్ మీడియా ఇన్ఫ్లు ఎన్సర్స్ లాస్య, అనూహ్యలపై త్వరలోనే చిత్రీకరిస్తామని ఆయన అన్నారు.

# రూపాయి బలోపేతానికి ఆర్బీఐ ద్వంద్వ వ్యూహం

**న్యూఢిల్లీ:** అమెరికా కఠిన నిర్ణయాలు, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్న భారత రూపాయికి ఆర్బీఐ అండగా నిలిచింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత దిగజారకుండా భారీ ఎత్తున చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆగస్టులో ఏకంగా 7.69 బిలియన్ అమెరికన్ డాలర్లను (సుమారుగా రూ.67వేలకోట్లు) మార్కెట్లో విక్రయించినట్లు ఆర్బీఐ తన తాజా నివేదికలో వెల్లడించింది. ఇటీవల డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 88కి పడిపోయింది. రూపాయి విలువ 1.6 శాతం వరకు క్షీణించడంతో కేంద్ర బ్యాంక్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. సాధారణంగా మార్కెట్లో డాలర్‌కు డిమాండ్ పెరిగినప్పుడు రూపాయి బలహీనపడుతుంది.

## ఇసి ముమ్మర సన్నాహాలు (మొదటి పేజీ తరువాయి)

ద్వారా దిద్దుబాటు చేసిన ఓటర్ల జాబితాలతో ప్రస్తుత ఓటర్ల జాబితాలను సరిపోల్చి చూసేందుకు దశలవారీగా అమలు చేయబోయే బృహత్తర ప్రణాళిక తీరు ప్రగతిని కేంద్ర ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు బుధవారం సమీక్షించారు. దేశవ్యాప్తంగా ఈ సామూహిక ప్రత్యేక ముమ్మర తనిఖీ సమీక్షలపై నిర్ణయం తీసుకోవడానికి గతనెల అంటే సెప్టెంబరు నుండి ఇప్పటివరకూ కేంద్ర ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు సమావేశం కావడం ఇది రెండోసారి. ఇప్పుడు తాజాగా రెండురోజులపాటు ఈ సమావేశం జరుగుతోంది. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు ఎస్.ఎస్.సంధు, వివేక్ జోషి ఈ రెండు రోజుల సమావేశంలో పాల్గొంటున్నారు. కొత్తగా మళ్ళీ ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర తనిఖీలు దేశవ్యాప్తంగా చేయడంవల్ల, గతంలో చేసిన ప్రత్యేక ముమ్మర తనిఖీల తర్వాత జాబితాలలో ఉన్న ఓటర్లలో ఎంతమంది తిరిగి కొత్త జాబితాల్లో కొనసాగారన్న విషయాన్ని, ఆ ఓటర్ల సంఖ్యను రాష్ట్రాలలోని ఎన్నికల యంత్రాంగాలు చాలా స్పష్టంగా తెలుసుకోగలుగుతాయి. బీహార్‌లో ప్రత్యేక ముమ్మర తనిఖీ సమీక్షలు నిర్వహించినప్పుడు తమ గుర్తింపునకు సంబంధించిన సాక్ష్యాధారాల పత్రాలను సమర్పించడంలో ఓటర్లు విఫలమయ్యారు. కానీ పాక్షికంగా ఓటర్ల జాబితాల్లో చేరే పత్రాలలో మాత్రమే వారు ఉన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం అంచనా ప్రకారం, ప్రస్తుతం ఈ ప్రత్యేక ముమ్మర తనిఖీల సమీక్ష నిర్వహించడంవల్ల దాదాపు చాలా రాష్ట్రాలలో సగానికి సగంమంది ఓటర్లు బహుశా ఎలాంటి సాక్ష్యాధారాల పత్రాలు ఇవ్వకుండా జాబితాల్లో కొనసాగుతున్నారన్న విషయం వెలుగులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. వారందరికీ ఈ 'సర్' ద్వారా భరోసా కలిగే అవకాశం ఉంది. రాజకీయపార్టీలు నియమించే బూత్ స్థాయీ అధికారులు, బూత్ స్థాయీ ఏజంట్లతోపాటు ఎన్నికల సంఘంలో జిల్లాస్థాయీ అధికారులు,,ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులకు శిక్షణ, నియామకాలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న పరిస్థితి ఏమిటో కూడా కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు సమీక్షించినట్లు కమిషన్ ఒక ప్రకటనలో తెలియజేసింది. వచ్చే ఏడాదిలో ఎన్నికలు జరిగే రాష్ట్రాలతో ఈ ప్రత్యేక ముమ్మర తనిఖీల మొదటి దశను ప్రారంభిస్తారు. ఈ మొదటిదశలో మరిన్ని రాష్ట్రాలను కూడా చేర్చే అవకాశం ఉంది. ఐతే అదేసమయంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న రాష్ట్రాలలో ఓటర్ల జాబితాలను ప్రక్షాళన చేసే కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం చేపట్టబోదని అధికారులు స్పష్టం చేశారు. ఎందుకంటే ఎన్నికల సంఘం యంత్రాంగం పూర్తిగా 'సర్'పై దృష్టిపెట్టి ఆ తనిఖీలలో నిమగ్నమై ఉంటుందిగనుక ఈ ప్రక్షాళన జోలికి యంత్రాంగం వెళ్ళదు. బీహార్‌లో ఇప్పటికే ఓటర్ల జాబితాల ప్రక్షాళన కార్యక్రమం పూర్తయింది. తుదిజాబితాలో దాదాపు 7.42 కోట్లమంది ఓటర్ల పేర్ల జాబితాలను సెప్టెంబరు 30వ తేదీన ప్రచురించారు.

## నామినేషన్ల తిరస్కరణ (మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలోని సెంటర్, స్ట్రాంగ్ రూమును, చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. భద్రత చర్యలను కూడా త్రిపాఠి పరిశీలించారు.

# మరోసారి మాటిచ్చారు

(మొదటి పేజీ తరువాయి)

భారత సంతతి వ్యాపారులు చేస్తున్న సహాయాన్ని ఆయన ప్రశంసించారు. 'అమెరికాలో భారత సంతతి వ్యాపార నాయకులు ప్రపంచంలోనే ఇక్కడ ఎక్కువ, నిజంగా, ఈ కంపెనీలను మీరు చూస్తే, వారు ఏం చేస్తున్నారో చూస్తే ప్రపంచంలో వారు అమెరికాలో ఎంత పెద్ద వ్యాపారులో తెలుస్తుంది' అన్నారు. ఈ వేడుకలలో పాల్గొన్న ఎడోబ్ సిఇఓ శంతను నారాయణ్, మైక్రోన్ టెక్నాలజీ సిఇఓ సంజయ్ మెహ్రోత్రా, ఐబిఎం సిఇఓ అరవింద్ క్రిష్ణ తదితర ప్రముఖ వ్యాపారుల పేర్లను ట్రంప్ ప్రస్తావించారు. దీపావళి వేడుకల సందర్భంగా ట్రంప్ జ్యోతిని వెలిగించి దాని ప్రాముఖ్యతను వివరించారు. చీకటిపైవిజయానికి ఈ దీపం చిహ్నం అని చెప్పారు. అజ్ఞానాంధకారం నుండి జ్ఞానానికి ఈ దీపం చిహ్నం అని చెప్పారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ఈ దీపం ఒక చిహ్నం అని ట్రంప్ అన్నారు. ఎఫ్‌బిఐ డైరెక్టర్ కాష్ పటేల్ కూడా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. మీ నాయకత్వం కింద లక్షలమంది అమెరికన్లు బ్రతుకుతూ తమ కలలు పండించుకుంటున్నారని ఈ సందర్భంగా ట్రంప్‌ను కాష్ పటేల్ ప్రశంసించారు. రష్యా నుండి చమురు కొనుగోళ్ళను తగ్గించుకుంటామని మోదీ తనకు ఫోన్‌లో హామీ ఇచ్చారని ఈ వేడుకల్లో ప్రసంగించిన ట్రంప్ మరోసారి ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి మోదీ గొప్ప నాయకుడు, నా మిత్రుడు అని చెప్పారు. 'మీ ప్రధానమంత్రి మోదీతో ఈరోజే ఫోన్‌లో మాట్లాడా, మా మధ్య గొప్ప సంభాషణ జరిగింది. వాణిజ్యం గురించి మాట్లాడుకున్నాం. ఇంకా చాలా విషయాలు మాట్లాడుకున్నాం. కానీ ఎక్కువగా ప్రపంచ వాణిజ్యం గురించే మాట్లాడుకున్నాం. ఆయనకు ఈ విషయాలో ఆసక్తి చాలా ఎక్కువ' అన్నారు. 'నేను భారత ప్రజలను ప్రేమిస్తాను, ఈరోజు మోదీతో మాట్లాడా, మా మధ్య మంచి సంబంధం ఉంది, ఎక్కువ చమురు రష్యా నుండి కొనుగోలు చేయబోమని చెప్పారు, ఉక్రేన్‌లో యుద్ధం ముగిసిపోవాలని ఆయన కోరుకుంటున్నారు' అని చెప్పారు. భారత్‌—పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను సడలించేందుకు వాణిజ్యాన్ని ఆయుధంగా తాను ఉపయోగించానని ఆయన మరోసారి ప్రస్తావించారు. భారత్‌—పాకిస్థాన్ సంబంధాల గురించి కూడా మోదీతో మాట్లాడానన్నారు. 'కొద్దిసేపటి క్రితం నేను మాట్లాడా, పాకిస్థాన్‌తో యుద్ధాలు వద్దని చెప్పా, వాస్తవం ఏమిటంటే వాణిజ్యం ఇక్కడ ప్రధానాంశం, నేను దాని గురించే మాట్లాడగలను, మాకు పాకిస్థాన్‌తోగానీ, భారత్‌తో గానీ యుద్ధాలు లేవు, అది చాలా చాలా మంచి విషయం' అన్నారు. భారత్‌—పాకిస్థాన్ మధ్య యుద్ధం తానే ఆపానని అనేక డజన్ల సార్లు ఇప్పటివరకూ ట్రంప్ చెప్పారు. కానీ తర్వాత భారత అధికార వర్గాలు ఢిల్లీలో వివరణ ఇస్తూ, మోదీ—ట్రంప్ సంభాషణల్లో పాకిస్థాన్ విషయం రాలేదని పేర్కొన్నారు. గతవారంలోనూ ట్రంప్ రష్యా చమురు విషయం ప్రస్తావించారు. 'రష్యా నుండి ఎక్కువగా చమురు కొనుగోలు చేయాలని నేను కోరుకోవడంలేదు, ఉక్రేన్‌లో యుద్ధం ముగిసిపోవాలని నేను కూడా కోరుకుంటున్నా' అని మోదీ తనకు ఫోన్‌లో చెప్పారని ట్రంప్ అన్నారు. సోషల్ మీడియాలో కూడా ఆయన ప్రవాసభారతీయులకు, భారత ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు చెప్పినప్పటికీ, చమురు కొనుగోళ్ళ విషయం మాత్రం ఆయన పోస్టింగ్‌లో పేర్కొనలేదు. గతవారంలో కూడా ట్రంప్ ఇదే విషయం చెప్పినప్పుడు భారత విదేశాంగమంత్రిత్వశాఖ ప్రతిస్పందిస్తూ, ట్రంప్—మోదీ మధ్య ఫోన్ కాల్ సంభాషణ విషయం తమకు తెలియదని పేర్కొంది. 'ఈరోజు నేను భారత ప్రధానమంత్రితో ఫోన్‌లో మాట్లాడాను, దీపావళి శుభాకాంక్షలు తెలియజేశాను, పైన నేను పేర్కొన్నవిధంగా ఆయన మళ్ళీ నాకు మాటిచ్చారు'' అని వైట్‌హౌస్‌లో దీపావళి ఉత్సవ వేడుకల సందర్భంగా పాత్రికేయులకు ట్రంప్ చెప్పారు. ''ఆయన కూడా ఉక్రేన్‌—రష్యా మధ్య యుద్ధం ముగిసిపోవాలని కోరుకుంటున్నారు, మీరు తెలుసా? వాళ్ళు రష్యా నుండి ఇకమీదట ఎక్కువ చమురు కొనుగోలు చేయరు, వాళ్ళు ఈ కొనుగోళ్ళలో కోతలు పెడతారు, క్రమంగా వారు రష్యా చమురు కొనుగోళ్ళను తగ్గించుకుంటూ వస్తారు, ఒకేసారి కొనుగోళ్ళు ఆపేయడం వారికికూడా కష్టమే'' అని ట్రంప్ పాత్రికేయులకు చెప్పారు. ఉక్రేన్‌లో 2022లో రష్యా పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించిన తర్వాత పశ్చిమదేశాలు ఆంక్షలు విధించాయి. దీంతో చైనా తర్వాత, రష్యా నుండి ప్రపంచంలో అత్యధికంగా ముడి చమురు కొనుగోలు చేస్తున్న దేశంగా భారత్ రెండోస్థానంలో ఉంది. ఈ కొనుగోళ్ళ వల్ల వచ్చే లాభాలతోనే పుతిన్ ఉక్రేన్‌లో యుద్ధం కొనసాగిస్తున్నారనీ, పరోక్షంగా ఈ యుద్ధం కొనసాగడానిక చైనా—భారత్‌లే ప్రధాన కారణమని ట్రంప్ కొద్దినెలలుగా ప్రచారం చేస్తున్నారు. ఆ కారణంతోనే భారత్‌పై 25 శాతం పెనాల్టీ సుంకాలను ట్రంప్ విధించారు. కానీ భారత్ అవసరాల నిమిత్తం తక్కువ ధరకు రష్యా నుండి చమురు కొంటున్నామని, ప్రపంచమార్కెట్లను అన్వేషించి భారత వినియోగదారుల ప్రయోజనాలకు అనుగుణంగా తాము నిర్ణయం తీసుకుంటామని విదేశాంగ మంత్రిత్వశాఖ పదేపదే ప్రకటనలు చేస్తున్నది. అమెరికాతో సహా పాశ్చాత్యదేశాలన్నీ రష్యాతో చమురు వ్యాపారంలో ఉన్న విషయాన్ని కూడా భారత ప్రభుత్వం ప్రధానంగా ప్రపంచం దృష్టికి తీసుకువస్తున్నది. చమురు కొనుగోళ్ళ రూపేణా భారతదేశం ఉక్రేన్‌లో రష్యా యుద్ధం చేయడానికి నిధులు సమకూరుస్తోందని అమెరికా అధ్యక్షుడు ఆరోపణ చేస్తున్నారు. ఈ కారణంగానే రెండు దేశాలమధ్యా వాణిజ్య చర్చలు స్తంభించాయి.

### ఫోన్‌లో మోదీకి ట్రంప్ దీపావళి శుభాకాంక్షలు



దీపావళి పర్వదినం సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మంగళవారం ఫోన్ చేసి శుభాకాంక్షలు చెప్పారు. అదేరోజు రాత్రి వైట్‌హౌస్‌లో అధికారికంగా నిర్వహించిన దీపావళి వేడుకలలో ట్రంప్ పాల్గొని ప్రసంగించారు. ఫోన్‌లో మోదీ ద్వారా భారత ప్రజలకు కూడా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇతర విషయాలను కూడా ఆయనతో చర్చించారు. 'మీరు నాకు ఫోన్ చేసినందుకు కృతజ్ఞతలు ప్రెసిడెంట్ ట్రంప్, మీకు కూడా దీపావళి శుభాకాంక్షలు, ఈ దీపావళి వెలుగుల నడుమ మన రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాలూ అన్ని రూపాలలో ప్రపంచానికి ఎదురవుతున్న ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా నిలబడి పోరాడాలి, పపంచానికి ఆశాజ్యోతులను అందించాలి' అని ఈ సందర్భంగా ట్రంప్‌కు మోదీ తెలియజేశారు. ఇదే విషయాన్ని ఎక్స్ వేదికగా మోదీ పోస్టింగ్ పెట్టారు. రష్యా నుండి చమురు కొనుగోళ్ళు ఆపేస్తామని భారత్ హామీ ఇచ్చిన తర్వాత ట్రంప్ తిరిగి మోదీతో ఫోన్ సంభాషణలను పునరుద్ధరించారు. మోదీ—ట్రంప్ ఫోన్ సంభాషణలో పాకిస్థాన్ గురించి ఎలాంటి చర్చా జరగలేదని అధికార వర్గాలు తెలియజేశాయి. భారత్ నుండి అమెరికా దిగుమతి చేసుకునే వస్తువులపై ట్రంప్ ప్రభుత్వం 50 శాతం సుంకాలు విధించిన తర్వాత రెండు దేశాలమధ్యా సంబంధాలు దెబ్బతిన్నాయి. ఆ తర్వాత సెప్టెంబరు 16వ తేదీ నుండి ఇప్పటివరకూ అధికారికంగా ట్రంప్—మోదీ మధ్య దీంతో మూడుసార్లు ఫోన్ సంభాషణలు జరిగాయి.
















Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com